ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్

సంపుటి 18 - సంచిక 08
**జనవరి 2014**

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**

## అహంకారము అనేది ఒక రోగం

అహంకారమనేది మనలో ఉన్న వివేకాన్ని హరించి వేస్తుంది. మనిషిలో ఇది ఉన్నంత వరకు జీవితంలో సరైన ఆలోచనా విధానము మరియు సవ్యమైనటువంటి దృష్టికోణాలు అనేవి ఉండవు. ఈ కారణాల వలన ప్రతి ఒక్కరు ఏదో విధంగా సమస్యల బారిన పడుతూనే ఉంటారు. పిల్లవానికి బాల్యంలోనే “నువ్వే తరగతిలో మొదటివాడిగా రావాలని” అనేది చెప్పబడుతుంది. ఒకవేళ ఆ పిల్లవాడు తరగతిలో మొదటివాడుగా వస్తే, ప్రతి ఒక్కరు వాడిని ప్రశంశించటం వలన వాడు తన యొక్క జీవితాన్ని సవ్యమైనటువంటి రీతిలో ఆలోచించే విధానాన్ని కోల్పోతాడు. పెద్దవాడయ్యే కొద్దీ ఆ రోగం (అహంకారము) పెరిగిపోతూనే ఉంటుంది. దీనివలన “వివేకము” అనేది మందగించి పోతుంది.

అహంకారమనే రోగాన్ని గురించి చెప్పాలంటే ఎవరైనా ఒక వ్యక్తి ఏదో ఒక విషయంలో సఫలీకృతుడయ్యే కొద్దీ అతని అహంకారము అదే నిష్పత్తిలో పెరిగిపోతూనే ఉంటుంది. అంతేకాక అదొక పెద్ద బండరాతివలె జీవితాన్ని సన్మార్గం నుంచి, ఆధ్యాత్మిక మార్గం నుంచి దారి మళ్ళిస్తుంది. దీనికి భిన్నంగా మనిషి ఏ విషయంలోనైనా అపజయం పాలైతే, అతని అహంకారము ఒక గాయంగా మారి అతడిని బాధించటమే కాకుండా, మెల్లిమెల్లిగా అతని మనస్సులో “తాను ఎంతో హీనుడు” అనే భావాన్ని కలిగిస్తుంది, అతనిని భయభీతుడిగా చేస్తుంది.

ఈ అహంకారమనే రోగానికి సద్వివేకము, సద్జ్ఞానములు మాత్రమే ఔషధములుగా పనిచేస్తాయి. సద్వివేకము యొక్క ఉద్దేశ్యము ఏమంటే నిరంతరం మనిషి ఏదో ఒక పనిలో నిమగ్నుడై ఉండాలి. ఆ పని యొక్క సఫలతగాని, అసఫలత గాని అతడిని ప్రభావితం చేయకూడదు. ఇటువంటి వ్యక్తి వెనుక శాంతి, ఆశీర్వాదాల ప్రవాహం అలా ఉంటూనే ఉంటుంది. కనుక అక్కడ అహంకారము అనేది నామరూపాల్లేకుండా పోవటమే కాకుండా సదా వివేకమే ఉంటుందనే విషయం తెలుసుకోవాలి.

*– అఖండజ్యోతి, అక్టోబర్ 2010*
*అనువాదం: శ్రీమతి సీతామహాలక్ష్మి*

**రేపటి గురించిన చింత వద్దు**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** అహంకారం అనేది ఒక రోగం 1
2. **విషయసూచిక-సద్గురు వాణి :** నిదానమే ప్రధానం 2
3. **వేదమంత్రం :**
   భగవంతుని కృపకు కావలసినది పవిత్రత 3
4. **గాయత్రీ విద్య - 40 :** ఆనందమయకోశం 4
5. **గాయత్రీ చిత్రావళి - 19 :** అదృశ్య సహాయము 6
6. **బాలల భవితకు బంగారుబాట - 38 :** స్ఫూర్తి 7
7. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 19 :**
   "సైనిక" పత్రిక కోసం హూంకారం 8
8. **యుగనిర్మాణ యోజన :**
   మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 12 13
9. **కుండలినీ మహావిజ్ఞానం-5 :**
   యోగం యొక్క రహస్యం - సిద్ధికి పరికరములు 15
10. **స్వామి వివేకానంద జయంతి ప్రత్యేకం :**
    లోకసేవా పరాయణుడు - వివేకానందుడు 19
11. **మనం - మన ఆరోగ్యం :**
    ఏడుపు వస్తే మనసారా ఏడవండి 23
12. **వ్యక్తి వికాసం-2 :** జీవించేకళ 25
13. **మెస్మరిజం-6 :** నిద్రాస్థితిలోకి పంపే విధానాలు 28
14. **ప్రతిభ :** ప్రతిభకు వయస్సుతో పనేముంది? 31
15. **పురుషార్థం** 34
16. **కలర్ ఇంజనీరింగ్ - 2 :** శబ్దశక్తి - వాక్‌శక్తి 35
17. **బాలల నిర్మాణం :** పిల్లలకు మర్యాద నేర్పాలి 38
18. **పూజ్య గురుదేవుల అమృతవాణి :**
    యుగపరివర్తనలో మన బాధ్యత - 3 40
19. **నా వారితో నా మాట :**
    ఆత్మ విశ్లేషణ చేసుకుందాం 44
20. **ఓటరులారా మేల్కొనండి!** 46
21. **వార్తలు** 47




## సద్గురు వాణి

### నిదానమే ప్రధానం

ఆంగ్ల రచయిత బుల్వర్ లిట్టన్ నవలలు వ్రాయడం ఒక హాబీగా ప్రారంభించాడు. కానీ అతని రచనలు చాలా ఖ్యాతి గాంచాయి. ఎవరో ఆయనను ఇంత బాగా ఎలా వ్రాయగలుగుతున్నారని ప్రశ్నించారు. దానికి లిట్టన్ ఇలా సమాధానం ఇచ్చాడు – "నేను ఏ పనిని హడావిడిగా చెయ్యను. చేసే ప్రతి పనిని వీలయినంత బాగా చేసేందుకు ఇష్టపడతాను. నేను అనేక ఇతర పనులు చేస్తూ కూడా 60 నవలలు వ్రాయగలిగాను. నమ్ముతారో లేదో నేను ఏ రోజు మూడు గంటల కన్నా ఎక్కువ సమయం చదవడానికి, వ్రాయడానికి ఇవ్వలేదు. కానీ చేసే పని సంపూర్ణ శ్రద్ధతో, ఉత్సాహంతో చేసేవాడిని".


## యుగశక్తి గాయత్రి

**చందా రుసుమును ఆన్‌లైన్ ద్వారా పంపించండి.**

బ్యాంకు పేరు: ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ

ఖాతాపేరు : శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు

ఖాతానెం. : **32506416087**

IFSC Code : **SBIN-0013272**

అట్లే మని ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కాని చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 20/- చందాకు అదనంగా పంప ప్రార్థన. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలాన జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుతూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట

అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.

ఫోన్: 040-23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| విడి ప్రతి రూ॥ **12/-** | **3** సం॥ చందా రూ॥ **350/-** |
| సం॥ చందా రూ॥ **120/-** | **10** సం॥ చందా రూ॥ **1116/-** |


**వర్తమానంలోనే దృష్టిపెట్టాలి**

వేద మంత్రం

# భగవంతుని కృపకు కావలసినది పవిత్రత

**న పాపాసో మనామేహ నారాయాసో న జల్వవః ।**
**యదిన్నివన్ద్రం వృషణం సచా సుతే సఖాయం**
**కృణవామహై ॥ (ఋగ్వేద 8/61/11)**

**భావార్థం :** అంతఃకరణ మలినం, అపవిత్రం అయినట్లయితే పరమాత్మ ఉపాసన ఫలవంతము కాదు. అందువలన ఈశ్వరుని ఉపాసన నిష్పాప హృదయముతో చేయాలి.

**సందేశం:** ప్రపంచములో ఈశ్వరుని విషయములో ప్రజలలో భిన్న భిన్న విశ్వాసాలు ఉన్నాయి. కొంతమంది ఈశ్వరుని నమ్మరు. కొంతమంది ఈశ్వరుడు ఉన్నట్లయితే ఎందుకు కనపడదని అడుగుతారు. విద్యుత్తు తీగెలలో విద్యుత్తు ప్రవహిస్తూ బల్బు ద్వారా ప్రకాశాన్ని ఇస్తుంది, కానీ విద్యుత్తు మనకు కనపడుతున్నదా? అందువలన విద్యుత్తు ఉనికిని నిరాకరించగలమా? ఈశ్వరుడు ఈ సృష్టికి కర్త, నియంత, పాలకుడు, ఆయన ఉపాసనలోనే మనకు మేలు ఉన్నది.

చాలామంది వ్యక్తులు పరమేశ్వరుని ఉపాసిస్తుంటారు. అయినా దుఃఖాలు, కష్టాలలోనే ఉంటుంటారు. దీనికి కారణం వారి అంతఃకరణంలో కల్మషాలు ఉన్నాయి. అది పాపకర్మలలో మునిగి ఉన్నది. ఈ స్థితిలో చేసే ఉపాసన కేవలం ఒక కపట నాటకం అని అనవచ్చు. ఇలా చేయడం వలన మనకు ప్రయోజనం ఎలా కలుగుతుంది? భగవంతుని కృపకు పవిత్రత అనేది ఏకైక షరతు. పరమపిత పరమేశ్వరుడు మన సర్వశ్రేష్ఠ మిత్రుడు, సఖుడు. మనము నిష్పాపులమై, ఉదారులమై, విశాల హృదయంతో ఉండటం లేదు. ఇలా అయితే మరి ఆయన మిత్రత్వ అమృతాన్ని మనపై ఎలా చిలకరిస్తాడు?

నేటి యుగం అహం చుట్టూ తిరుగుతున్నది. ఇంద్రియ పరాయణులమై మనం నీడల వెంబడి పరుగెడుతున్నాము. ఒక భయానక నిస్సారతలో చిక్కుకొన్నాము. 'కామం – కాంచనం'ల రోగం అంతటా భయంకరంగా వ్యాపిస్తున్నది. ఈ సుడిగుండం నుండి బయటపడాలని ప్రజలు అనుకోవటం లేదు.

మనుష్యులు భోగ విలాసాలలో మునిగి తేలుతూనే ఉన్నా, ఎప్పుడు అసంతృప్తే. భోగాలు స్వయంగా, తమలో తృప్తి కలిగించగల సామర్థ్యం లేదని ఎలుగెత్తి చాటుతూ ఉంటే, ఈ తథ్యాన్ని మరచి మళ్ళీ మళ్ళీ మరింత వేగంతో అదే భోగాల కొరకు వెంపర్లాడుతున్నాడు. దీనికి మించిన దౌర్భాగ్యం మరింకేముంటుంది? 'భోగా నభుక్తా వ్యయమేవ భుక్త్వా' అనగా "మనము ప్రాపంచిక భోగాలను భోగించనే లేదు, పైగా ఆ భోగాలను ప్రాప్తించుకోవాలనే చింతయే మనలను భోగించింది". వేదము భౌతికమైనదంతా త్యజించమని చెప్పలేదు. ఈ శరీరం లేకుండా, భౌతిక పదార్థాలు లేకుండా మన నిర్వహణ అసంభవం, కానీ ఇదే సర్వస్వంగా భావించడం మనను మనం మోసగించుకొనుటయే.

పరోపకారం, నైతిక ఆచరణ ఉన్నత ఆధ్యాత్మిక జీవితానికి సోపానాలు మాత్రమే. చిత్తశుద్ధికి ఇవి అవసరం. చిత్తశుద్ధి లేకుండా ఉన్నత జ్ఞానం ప్రాప్తించదు. మనసులోని మురికిని కడుగుకొనుటకు ధృడమైన నైతికాచరణ, నిస్వార్థభావంతో ఇతరుల మేలు కొరకు చేసే పనులు, స్వాధ్యాయము, ఆధ్యాత్మిక సాధనలు ఆవశ్యకం. అప్పుడే హృదయంలో దివ్యజ్ఞాన ప్రకాశం అవతరిస్తుంది. ఈ దివ్యత్వ ప్రకాశం, తేజస్సును మన కల్మషాలు సహించలేవు, స్వతహాగానే దూరంగా పారి పోతాయి. వాటి ఖాళీల పూర్తి సద్గుణాల ద్వారా అవుతుంది.

ఇదంతా ధృఢ ఆత్మబలం ద్వారానే సంభవం.

★★★

## పండుగలు

**జనవరి 2014**

| | |
|---|---|
| 12-01-2014 | స్వామి వివేకానంద జయంతి |
| 14-01-2014 | సంక్రాంతి |
| 26-01-2014 | గణతంత్ర దినోత్సవం |

**ఫిబ్రవరి 2014**

| | |
|---|---|
| 04-02-2014 | వసంత పంచమి (శ్రీ పంచమి) |
| 06-02-2014 | రథ సప్తమి |
| 27-02-2014 | మహా శివరాత్రి |

**వర్తమానంలోని ఒక్క క్షణాన్ని వృథా చేయకూడదు**



గాయత్రీ విద్య-40

# ఆనందమయకోశం

గాయత్రి యొక్క పంచమ ముఖం ఆనందమయకోశం. ఏ ఆవరణలో ప్రవేశిస్తే ఆత్మకు ఆనందం లభిస్తుందో, ఎక్కడ శాంతి, స్థిరత, నిశ్చింతత ప్రాప్తిస్తుందో అదే ఆనందమయకోశం. గీత రెండవ అధ్యాయంలో చెప్పిన స్థితప్రజ్ఞుని గుణ, కర్మ స్వభావాలు ఆనందమయకోశ స్థితిలో వస్తాయి. ఆత్మిక పరమార్థ సాధనలో మనోయోగపూర్వకంగా సంలగ్నమయినందువలన ప్రాపంచిక అవసరాలు చాలా పరిమితంగా ఉంటాయి. వాటి కొరకు బాధ ఏమీ ఉండదు. ఎందుకంటే సాధకుడు తన శారీరిక, మానసిక స్వస్థత ద్వారా కావలసిన వస్తువులను సులభంగా ప్రాప్తించుకొనగలుగుతాడు.

ప్రకృతిలోని పరివర్తనలు, విశ్వవ్యాప్తంగా హెచ్చుతగ్గులు, కర్మల గహన (రహస్య, లోతైన) గతి, ప్రారబ్ధం, వస్తువుల యొక్క నశ్వరత, వైభవం యొక్క చంచల చపలత్వం మొదలైన పరిస్థితులు ఎదురవుతుంటాయి, ఇబ్బందులు కలుగజేస్తాయి. ఇటువంటి పరిస్థితులను చూసి స్థితప్రజ్ఞుడు నవ్వుతాడు; భగవంతుని వెలుగునీడలాగా, దాగుడుమూతల ఆటలగా భావిస్తాడు. ఇప్పుడే ఆనందం, వెనువెంటనే బాధ; ఒకసారి ఐశ్వర్యం, ఒకసారి బీదతనం; ఇప్పుడు యవ్వనం తరువాత ముసలితనం; ఇప్పుడు జన్మ తరువాత మరణం, ఒకసారి ఉప్పగా, ఒకసారి తియ్యగా ఈ ప్రపంచం ఎంత విలక్షణ మైనది? పగలు గడచిపోగానే రాత్రి వస్తుంది. రాత్రి గడవగానే నూతన ప్రభాతం వస్తుంది. ఆకాశంలోని మేఘాల ఛాయ వెలుగు నీడలవలె వస్తూ పోతుంటాయి. ఈ సీతాకోక చిలుకల వెనుక ఎక్కడ పరిగెత్తగలను? క్షణక్షణం ఎగిసిపడే అలలను ఎంతవరకు లెక్కించగలను? ఒక క్షణం దుఃఖించే, ఒక క్షణం నవ్వే బాలక్రీడను నేను ఎందుకు చేయాలి?

ఆనందమయకోశంలో అడుగుపెట్టిన జీవుడు తన వెనుకటి నాలుగు శరీరములు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములను గురించి బాగుగా అవగాహన చేసుకుంటాడు. వాని అసంపూర్ణత, ప్రపంచం యొక్క పరివర్తన శీలతల సమ్మేళనం ద్వారా ఒక విష వాయువు తయారయి జీవుని పాపతాపములను నల్లని ధూళితో కలుషితం చేస్తున్నదని అర్థమవుతుంది. ఈ రెండు పక్షముల గుణదోషములను తెలుసుకుని వాటిని వేరువేరుగా ఉంచుతాడు. తుపాకిలోని మందుకి అగ్ని తగులకపోతే విస్ఫోటనమయ్యే పరిస్థితి రాదు. ఇది అర్థం చేసుకుని అతను తన దృష్టికోణములో దార్శనికత, సాత్వికత, వాస్తవికత, సూక్ష్మదర్శతలకు ప్రాధాన్యం ఇస్తాడు. అందువలన అతనికి ప్రాపంచిక సమస్యలు చాలా చిన్నవిగా, మహత్వం లేనివిగా తెలుస్తాయి. ఏ సమస్యలను చూచి సాధారణ మానవుడు దుఃఖిస్తాడో, అట్టి వానిని అతను ఒక వినోదంగా కొట్టిపడేస్తాడు. ఆత్మిక భూమికలో తన దృఢస్థానాన్ని తయారుచేసుకుని శాంతిని, సంతోషాన్ని అనుభవిస్తాడు.

గీత రెండవ అధ్యాయంలో స్థితప్రజ్ఞుడు తనలోపల ఉన్న ఆత్మస్థితిలో రమిస్తాడని శ్రీకృష్ణ భగవానుడు చెప్తాడు. సుఖ దుఃఖములను సమానంగా చూస్తాడు, ఇష్టాయిష్టాలు ఉండవు. కొన్నింటి మీద ఇష్టం, కొన్నింటి మీద ద్వేషం ఉండవు. ఇంద్రియములను ఇంద్రియముల వరకే పరిమితం చేస్తాడు. వాటి ప్రభావం ఆత్మమీద పడనీయడు, తాబేలు తన అంగములను ముడుచుకుని తనలోనికి తీసుకుంటుంది. యోగి కూడా తన కోరికలను, ఆశలను ప్రపంచం పైకి విసరకుండా తన అంతః భూమికపై ఉంచుకుంటాడు. ఇలా చేయడం వలన అతని మానసికస్థితి యోగి, బ్రహ్మభూత్, జీవనముక్తుడు, సమాధి స్థితివలె ఉంటుంది.

ఆనందమయకోశం యొక్క స్థితి పంచమ భూమిక. దీనిని సమాధిస్థితి అని కూడా అంటారు. సమాధి అనేక రకాలుగా ఉంటుంది. కష్టసమాధి, భావసమాధి, ధ్యానసమాధి, ప్రాణసమాధి, సహజసమాధి మొదలైన 27 సమాధి స్థితులు చెప్పబడ్డాయి. మూర్ఛ, క్లోరోఫాం, మత్తుమందుల ద్వారా వచ్చే సమాధిస్థితిని కష్టసమాధి అని అంటారు. భావాతిరేకం వలన కలిగే సమాధిస్థితిని భావసమాధి అంటారు. ధ్యానం ఎంతో తన్మయత కలిగి అదృశ్య నిరాకార సత్తా సాకారమయి కనిపిస్తే

**ప్రతి నిమిషం విలువైనదే**

దానిని ధ్యానసమాధి అంటారు. ఇష్టదైవం యొక్క దర్శనం కలిగితే అది ధ్యానసమాధి స్థితిలోనే జరుగుతుంది. కానీ అతనికి మామూలు కళ్ళతో చూస్తున్నాడో లేక దివ్య నేత్రములతో ధ్యానం చేస్తున్నాడో తెలియదు. బ్రహ్మరంధ్రంలో ప్రాణములను ఏకత్రితం చేస్తే ప్రాణసమాధి లభ్యమవుతుంది. హఠయోగంలో ఈ సమాధి ద్వారా శరీరాన్ని చనిపోయేటట్లు చేసి కూడా జీవించగలరు. తనను తాను బ్రహ్మలో లీనం చేసుకునే స్థితిని బ్రహ్మసమాధి అంటారు.

ఇటువంటి 27 రకముల సమాధిస్థితులలో వర్తమాన పరిస్థితులయందు సహజసమాధి సులభమైనది, సుఖసాధ్యం కూడా. కబీరు సహజ సమాధికి చాలా ప్రాముఖ్యత ఇచ్చాడు. తన అనుభవముతో సహజసమాధి సులభమని గ్రహించి తన అనుయాయులకు ఈ సాధన చెయ్యవలసినదిగా ప్రేరణ ఇచ్చేవాడు. ఈ సమాధిస్థితి సహజమైనదని, సర్వసులభమని, సాధారణ సాధనలతో వచ్చినందున దీని సహజసమాధి అనే పేరు ఇవ్వబడింది. హఠయోగ సాధనలు కఠినమైనవి. ఆ సాధనలను అభ్యాసము చేసి సమాధిస్థితి వరకు వెళ్ళటం కష్టసాధ్యమైన పని. చిరకాల తపశ్చర్య, షట్‌కర్మల శ్రమతో కూడిన సాధన సులభం కాదు. అనుభవజ్ఞుడైన గురు సమ్ముఖములో విశేషమైన జాగ్రత్తతో సాధన చెయ్యవలసి ఉంటుంది. మధ్యలో ఆపివేస్తే ప్రమాదములు జరుగవచ్చు. కబీరు సహజ యోగానికి పెద్దపీట వేశారు. **సహజ యోగం అంటే సిద్ధాంతమయ జీవనం, కర్తవ్యపూర్ణ కార్యక్రమం** ఎందుకంటే ఇంద్రియ భోగులు, కామ, క్రోధ, లోభ, మోహముల తుచ్ఛమైన కోరికలతో ప్రేరేపింపబడిన ప్రజలు తమ కార్యక్రమాలను నిర్ధారించుకుంటారు. అందువలన రకరకాల కష్టాలపాలవుతారు.

సహజసమాధి అసంఖ్యాకమైన యోగసాధనలలో ఒకటి. దాని ప్రత్యేకత ఏమంటే ప్రాపంచిక వ్యవహారాలతోపాటు సాధనా క్రమం నడుస్తుంటుంది. అలాంటి వ్యక్తి సామాన్య ప్రాపంచిక కార్యాలను, కర్తవ్యాలను, యజ్ఞమును, ధర్మమును భగవంతుని ఆజ్ఞగా భావించి నిర్వర్తిస్తాడు. భోజనం చేసే సమయంలో భగవంతుని పవిత్రమైన నివాసమైన ఈ శరీరమును యదావిధిగా ఉంచడానికి భోజనం చేస్తున్నానని భావిస్తాడు. తినే పదార్థాలను ఎంచుకునే ముందు అవి శరీరానికి ఆరోగ్యకరమైనవేనా కాదా అని చూస్తాడు. పదార్థాల రుచిని పట్టించుకోడు. కుటుంబపాలన పోషణ విషయంలో అది పరమాత్మ ఇచ్చిన అందమైన ఉద్యానవనానికి మాలిగా తనకు తాను భావిస్తాడు. కుటుంబాన్ని తన సంపత్తిగా భావించడు. జీవనోపార్జనకు ఆవశ్యకతలను పూర్తి చేయడానికి ఒక సాధనగా మాత్రమే ఆలోచిస్తాడు. ధనవంతుడు కావటానికి ఎలాగో అలా డబ్బు సంపాయించాలని ఆలోచించడు. మాట్లాడటం, అటు ఇటు వెళ్ళడం, అన్నపానీయాలు, నిద్రపోవడం, లేవడం, జీవనోపార్జన, ప్రేమ, ద్వేషం మొదలైన అన్ని పనుల చేసే ముందు పరమార్థానికి, కర్తవ్యానికి, ప్రాధాన్యత ఇస్తూ మామూలు పనులను కూడా యజ్ఞరూపంగా నిర్వర్తిస్తాడు.

**ప్రతిపనిలో కర్తవ్యభావన ఉంటే ఆ కార్యములు పుణ్య కార్యములు అవుతాయి. సద్బుద్ధితో, సద్భావనతో చేసే కార్యముల వలన తనకు, ఇతరులకు సుఖశాంతులు లభిస్తాయి. అట్టి కార్యములు ముక్తిప్రదములు. బంధనంలో పడవేయవు.**

సాత్విక సిద్ధాంతములను జీవనానికి ఆధారం చేసుకొనటం వలన, దానికి తగిన ఆలోచనలు పనులు చేయడం వలన ఆత్మకు సత్‌తత్వమందు రమించే అభ్యాసం లభిస్తుంది. ఈ అభ్యాసం పరిపక్వమవుతున్నకొద్దీ సహజయోగం యొక్క రసాస్వాదన లభిస్తుంది, దానివలన ఆనందం కలుగుతుంది.

స్వల్ప ప్రయాసతో సమాధి యొక్క శాశ్వత సుఖం కావాలనుకునేవారు, ఆధ్యాత్మిక మార్గంలో పయనించే వారు భోగములను విడిచి యోగమందు కోరికలు నిలుపుకోవాలి. ఈ దిశలో ఎవరు ఎంత ప్రగతి సాధిస్తారో అంత పరిమాణంలో సమాధి యొక్క లోకోత్తర సుఖం యొక్క రసాస్వాదన చేస్తారు.

★★★


**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి !**

**చదివించండి !!**


**నువ్వు ఇతరులలో చూసే లోపాలు నిజానికి నీలోనివే**

గాయత్రీ చిత్రావళి - 19

# అదృశ్య సహాయము




మనుష్యుడు ఉన్నతుడవటానికి, సుఖసౌభాగ్యాలు పొందటానికి ఇతరుల సహాయము సహకారములు కూడా అవసరమవుతాయి. బాహ్య సహాయము ఏ స్థాయిలో లభిస్తుందో అంతే త్వరగా ఎత్తుకెదుగుతాడు. ఒంటరివ్యక్తి శక్తి పరిమితంగా ఉంటుంది. అందరి నుండి అన్ని విధాలా సహాయం లభిస్తే అతడు సాఫల్యపు అంచులు అందుకుంటాడు.

కొన్ని సహాయాలు ప్రత్యక్షము, కొన్ని అప్రత్యక్షముగా అందుతాయి. ప్రత్యక్ష సహాయము చేసిన వ్యక్తి విలువ, ప్రాధాన్యత అందరు తెలుసుకుంటారు. అప్రత్యక్ష సహాయము కళ్ళతో చూడలేము కానీ, ఏదో ఒక కారణాన అది లభ్యమయింది. మనము దాని విలువ, ప్రాధాన్యత తెలుసుకోలేనప్పటికీ దాని మహత్వము మాత్రము అసాధారణము. దైవీ సహాయము ఆగిపోయినప్పుడు తమకు అదృష్టము లేదని ప్రబల పురుషార్థము కూడా నిరర్థకమై పోవుచున్నదని అనేక మంది భావిస్తుంటారు.

దైవీ సహాయము లభించినప్పుడు ఒక విచిత్ర సదవకాశము ప్రాప్తించి, మన ప్రయత్నము యొక్క అవసరమే లేకపోవటాన్ని గమనిస్తాము. అటువంటి పరిస్థితులలో, అదే యోగ్యతలతో, అదే స్థానంలో అనేకమంది ఎక్కడున్నారో అక్కడే హీనావస్థలో పడిఉంటారు. ఆ సందర్భంలో ఒక మనుష్యుడు విశేషరూపంలో సఫలత, లాభం, సౌభాగ్యం ప్రాప్తించుకుంటే, ఆ లాభము దైవీ సహాయము వలన ప్రాప్తించిందని తెలుసుకోవాలి. దైవీ అనుకూలత ఉంటే మట్టి కూడా బంగారమవుతుందనే సూక్తి చరితార్థమైనట్లే.

ప్రారబ్ధము, భాగ్యము, విధి విధానము, ఈశ్వరేచ్ఛ, దైవీ సహాయము ఇవన్నీ మన మంచి, చెడు కర్మలతో ముడిపడి ఉంటాయి. గాయత్రీ తపస్సు వలన పాత, కొత్త సుకృతాలు శీఘ్రంగా పాకానికి వస్తాయి. తర్వాత ఎప్పుడో లభించవలసిన లాభము అప్పటికప్పుడే లభిస్తుంది. తపస్సు యొక్క అగ్నిలో అనేక పాపాలు, దౌర్భాగ్యాలు మాడి మసైపోతాయి. సాధనలో ముందుకు పోతున్న సాధకులకు అనేకసార్లు ఆకస్మిక సహాయాలు లభించటం చూస్తాము. మాతయే కంటికి కనపడని లోకాల నుండి ఆ సాధనములను, సౌకర్యాలు పంపిందని అనుకోవాలి.

– *అనువాదం : డా॥ తుమ్మూరి*

## సంఖ్య కన్నా సమర్థతే ముఖ్యం

*కౌరవపాండవ యుద్ధం నిర్ణయింపబడింది. కౌరవులు వంద మంది, పాండవులు ఐదుగురు. ఉద్దంక మహర్షి శ్రీకృష్ణుని ప్రశ్నించాడు "వందమంది కౌరవులతో ఐదుగురు పాండవులెలా గెలుస్తారు? ఈ యుద్ధం పాండవ వినాశనానికేనా?". "మహామునీ! ఇక్కడ చూడవలసినది సంఖ్య కాదు, సామర్థ్యం. సూర్యుడు ఒక్కడు చేస్తున్న పనిని వందలాది నక్షత్రాలున్నా చెయ్యగలవా?" మహాముని మౌనం వహించాడు.*

**ఇతరులలో సద్గుణాలను మాత్రమే చూడాలి**



## బాలల భవితకు బంగారు బాట-38

# స్ఫూర్తి

రమణ 9వ తరగతి విద్యార్థి. అతడు పాఠాలు వింటూ తరగతి గదిలో కూర్చుంటాడేగాని మనస్సు మాత్రం ఎక్కడెక్కడికో పయనిస్తూ ఉంటుంది. మాష్టారు వ్రాయించిన నోట్సులు బట్టీపట్టి పాసు మార్కులు తెచ్చుకుంటాడు. బడి నుండి ఇంటికి వెళ్ళాక ఈ రోజు ఉపాధ్యాయులు ఏం చెప్పారు? అని ఆలోచించుకుంటే మనసంతా గజిబిజిగా అనిపించేది. ఎందుకిలా అవుతుందో ఎంత ఆలోచించుకున్నా అర్థం అయ్యేది కాదు. ఒకనాడు రమణ స్వామివివేకానంద పాఠంలోని ప్రశ్నలకు సమాధానాలు బట్టీ పడుతున్నాడు.

"వివేకానందుడు సర్వమత సమ్మేళనానికి అమెరికాలోని చికాగో నగరం వెళ్ళాడు. అక్కడ పేరు ప్రఖ్యాతులున్న ఒక ఆధ్యాత్మికవేత్త వివేకానందుని చూశాడు. చిన్న వయస్సులో ఉన్న స్వామిని చూడగానే ఆయనకు చులకన భావం ఏర్పడింది. ఆతని దగ్గరకు వెళ్ళి "నీకు ఏం తెలుసునని ఈ సభకు వచ్చావు? మాలాంటి వాళ్ళు చెప్పే విషయాలు వినడానికైనా నీకు అర్హత ఉన్నదా? విని అర్థం చేసుకునే శక్తి ఉన్నదా?" అని ప్రశ్నించాడు. వివేకానందుడు వినయంగా "మహానుభావా! నేను మీలాంటివారు చెప్పింది వినాలన్న ఆసక్తితోనే వచ్చాను!!" అన్నాడు. దానికాయన "అసలు నీకేమి తెలుసు? దానిని గురించి మూడు నిమిషాలలో వివరించు. వినడానికయినా అర్హత ఉందోలేదో అప్పుడు చెపుతాను" అన్నాడు అతిశయంగా. వివేకానందుడు మౌనంగా వేదిక పైకి వెళ్ళాడు. గొంతును సవరించుకుని "సోదర సోదరీ మణులారా!" అని సంబోధిస్తూ ఆత్మీయంగాను, గంభీరంగాను ప్రారంభించాడు. ఆ సంబోధన వింటూనే సభంతా చప్పట్లతో మారుమ్రోగి పోయింది. మూడు నిమిషాల కోసం ప్రారంభించిన ఉపన్యాసం ఆగకుండా గంటన్నరసేపు ధారాళంగా సాగిపోయింది. కేవలం ఆ సంబోధన లక్షల మెదళ్ళలో కోట్లాది ఆలోచనలను రేకెత్తించింది" ఇదీ ఆ పాఠంలోని సారాంశం.

రమణ దీర్ఘంగా ఆలోచించసాగాడు. అంటే ఒక్క సంబోధన లోని విశ్వ సౌభ్రాతృత్వం అనేకమందిని భారతదేశం వైపు త్రిప్పుకున్నదన్నమాట. విదేశీయులు సైతం భారతీయ సంస్కృతికి తలలు వంచడం అనేది రమణను ఇంకా ఇంకా ఆలోచింప చేసింది. అవును తన పాఠ్యపుస్తకాల్లో అనేకమైన అంశాలు వస్తూ ఉంటాయి. చారిత్రక విషయాలు, వైజ్ఞానిక విషయాలు, మహా కవుల జీవితాలు ఒకటేమిటి? ఎన్నెన్నో వస్తూ ఉంటాయి. అందరి లాగే అన్ని రకాల విషయాలు తాను వింటున్నాడు. రాసుకుంటు న్నాడు. బట్టీ పడుతున్నాడు. పరీక్షల్లో పేపరు మీద పెడుతున్నాడు. పాసవుతూ ఉన్నాడు. ఏం సాధించినట్లు? తాను నేర్చుకున్న జ్ఞానానికి తనదైన ఆలోచనను జోడించే ప్రయత్నం చేస్తున్నాడా? ఇదేనా చదువంటే? కాదు, కానే కాదు" అన్న నిర్ణయానికి వచ్చేశాడు.

మరునాటి నుండి రమణ ఆచరణలో చాలా మార్పు వచ్చింది. ముందుగా పాఠాలను శ్రద్ధగా వినడం మొదలుపెట్టాడు. తనకు కలిగిన ప్రతి ఒక్క సందేహాన్ని అడిగి తీర్చుకుంటున్నాడు. ప్రతి చిన్న అంశాన్ని అనేక కోణాల్లో ఆలోచించడం అలవాటు చేసుకున్నాడు. సైన్సు పాఠాల్లో ఇచ్చిన ప్రయోగాలకు తోడుగా సొంతగా ఆలోచించి నూతన ప్రయోగాలు ప్రారంభించాడు. ప్రకృతిని పరిశీలిస్తూ చిన్న చిన్న కవితలను వ్రాస్తున్నాడు. చరిత్ర పాఠాలలోని వాస్తవాన్ని తెలుసుకునేందుకు సంబంధించిన గ్రంథాలను చదువుతున్నాడు. అతనికి తెలియకుండానే ఆతనిలోని మేధాశక్తి మేల్కొంది. సందర్భం వచ్చినప్పుడల్లా వేదికపైన ఉపన్యాసాలు దంచేస్తున్నాడు. ఆటపాటల్లో ఉల్లాసంగా పాల్గొంటూ ఆరోగ్యంగా తయారయ్యాడు. దైవ భక్తుల కథల ద్వారా దైవత్వాన్ని గూర్చి ఆలోచించసాగాడు.

ఈ విధంగా ఎదిగి ఎదిగి 10వ తరగతిలో రాష్ట్రస్థాయిలో ఆదర్శ విద్యార్థిగా అవార్డును అందుకున్నాడు రమణ. అవార్డును అందిస్తూ రాష్ట్ర గవర్నరు గారు విద్యార్థులంతా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినడమే కాదు, స్వశక్తితో అభివృద్ధిని సాధించాలని, తాము అభివృద్ధిని సాధిస్తూ, సమాజానికి ఉపయోగ పడాలనీ, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని, వారి జీవితం స్ఫూర్తిదాయకంగా ఉండాలని సందేశాన్ని ఇచ్చి దీవించారు.

విన్నారు కదా! బాలలూ! ప్రతి చిన్న విషయాన్ని స్ఫూర్తిగా తీసుకుంటే, దాన్ని ఆచరణలో పెట్టగలిగితే దేశమాత రుణాన్ని తీర్చుకోగలుగుతాం.

*కం॥ స్ఫూర్తిని కల్గించు వాక్యము*
*నార్తిగ జపియించుచుండ నైజములోనన్*
*మార్పులు కలుగుట సహజము*
*స్ఫూర్తిగ జీవించువిధము చూపుము బాలా!*

– మధుర కవయిత్రి,
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**అశ్రద్ధ, బద్ధకం, నిర్లక్ష్యం - జీవితంలోని విలువైన క్షణాలను హరిస్తాయి**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-19

# "సైనిక" పత్రిక కోసం హూంకారం

శిబిర సంయోజకులలో శ్రీకృష్ణదత్ పాలీవాల్ ఒకరు. ఆగ్రాలోనేకాక మొత్తం ఉత్తరప్రదేశ్‌లో ఆయన స్వరాజ్య ఉద్యమానికి అగ్రశ్రేణి నాయకులు. ఆయన వయస్సులో శ్రీరామ్‌కన్నా బాగా పెద్దవారు. శిబిరంలో శిక్షణ పొందుతున్న కార్యకర్తలు ఆయనను భాయిసాహెబ్ అని, నేతాజీ అని పిలిచే వారు. పత్రికా రచనలో, విప్లవ సాహిత్య సృజనలో ఆయన సిద్ధహస్తులు. శ్రీరామ్‌ను చూడగానే ఇతర కార్యకర్తల కన్నా భిన్నమైన వాడనే, విలక్షణ వ్యక్తి అనే అభిప్రాయం ఆయనకు ఎందువల్లనో కలిగింది. శ్రీరామ్ అప్పుడు తాను వ్రాసిన కవితను సహచరులకు వినిపిస్తున్నారు. దేశభక్తితో పొంగి పొరలిన ఆ కవిత ఇలా ఉంది –

**కోయీభీ హో తేరా దుష్మన్,**
**నిశ్చయ్ హీ మిట్ జాఏగా,**
**త్రింశ కోటి హుంకారోం సే,**
**నభ మండల్ ఫట్ జాఏగా ॥**



అనగా నీ శత్రుకోటి నిర్మూలన ముమ్మాటికీ నిస్సంశయం, ముప్పై కోట్ల హుంకారాలతో ఆకాశం దద్దరిల్లటం ఖాయం.

పాలీవాల్‌జీ ఈ కవిత విన్నారు. శ్రీరామ్ వెన్నుతట్టి ఇలా అన్నారు.

"ఈ కవితను 'సైనిక' పత్రికలో ప్రచురిస్తే – చదివిన ప్రతి వ్యక్తీ పాడతాడు, మళ్ళీ మళ్ళీ పాడతాడు."

ఇలాంటి రచనలు మరిన్ని చేయగలననే ఉత్సాహాన్ని శ్రీరామ్ చూపారు. పాలీవాల్‌జీ అప్పుడు 'సైనిక్' పత్రిక సంపాదకులుగా, ప్రచురణకర్తగా ఉన్నారు. దేశభక్తితో, విప్లవ భావాలతో నిండిన ఆ పత్రిక మూడు సంవత్సరాలుగా ప్రచురితం అవుతోంది. సంఘటనకు, సేవకు సంబంధించిన అనేక బాధ్యతలు పాలీవాల్‌జీ భుజస్కంధాలపై ఉన్నాయి. ఆయన ఒక సహచరునికోసం అన్వేషిస్తున్నారు. శ్రీరామ్ దొరకడంతో ఆ అన్వేషణ పూర్తయిందని ఆయనకు తోచింది. ఆయన శ్రీరామ్‌ను ఇలా ప్రోత్సహించారు "వ్రాస్తూ ఉండు; అదే పనిగా వ్రాస్తూ ఉండు; నీ కవితలు ప్రజలలో దేశభక్తిని మేల్కొల్పుతాయి."

శ్రీరామ్ ఈ సందర్భంగా సాహిత్యపరంగా, ఉద్యమపరంగా తాను చేసిన రచనలను గ్రామాలలో పంచిన ప్రచార పత్రాలను ఆయనకు చూపించారు.

ఆగ్రా వచ్చి పత్రిక పనిలో సహకరించవలసిందిగా పాలీవాల్‌జీ శ్రీరామ్‌ను కోరారు. శ్రీరామ్ సరే అన్నారు.

శిబిరం ముగిసింది. శ్రీరామ్ ఆవల్‌ఖేడా తిరిగి వచ్చారు. తన సహచరులను తిరిగి సమీకరించారు. వారి తల్లిదండ్రులు వారిపై విధించిన ఆంక్షలు పనిచేయలేదు. స్వరాజ్య ఉద్యమ ప్రభావం ఎంతగా వ్యాపించిందంటే ఆ ఉద్యమానికి దూరంగా ఉండడం వెనుకబడినతనానికి, చేతకానితనానికి గుర్తుగా పరిగణించబడింది. జనం ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొనకపోయినా, ఇలాంటి వ్యాఖ్యలు మాత్రం చేస్తున్నారు. శ్రీరామ్‌తో కొద్ది సంపర్కం ఏర్పడగానే, యువకులలో నవోత్సాహం పెల్లుబికింది. తల్లిదండ్రుల మాటలను ఖాతరు చేయకుండా వారు ప్రభాత భేరీలలో పాల్గొనసాగారు. ఆ ఊరేగింపులలో శ్రీరామ్ రచించిన గీతాలను గానం చేసేవారు. అలా పాటలు పాడుతూ పాడుతూ యువకులు తన్మయులై మైమరచిపోయేవారు.

1929-30 సంవత్సరాలు స్వరాజ్య ఉద్యమం ఊపందుకున్న సంవత్సరాలు. 1929 డిసెంబరులో లాహోర్‌లో కాంగ్రెస్ మహాసభ పూర్ణస్వరాజ్యం తన లక్ష్యమని స్పష్టంగా ప్రకటించింది. శాసనసభల నుండి ప్రజాప్రతినిధులను వెనుకకు పిలిపించారు. ప్రభుత్వంతో చర్చలను పూర్తిగా నిలిపి వేశారు. మహాసభ సందర్భం ఆ డిసెంబరు 31 రాత్రి గడియారం 12 గంటలు కొట్టిన క్షణంలో, కొత్త సంవత్సరం తొలిరోజు ప్రారంభమైన క్షణంలో జవహర్‌లాల్ నెహ్రూ లాహోరులో జాతీయ జెండా ఎగురవేశారు. ఆ జెండా ఎగురవేయడంతో దేశం తన స్వతంత్రతను ప్రకటించుకున్నట్లు అయింది. ప్రతిచోట ఊరేగింపులు జరిగాయి. సమావేశాలు జరిగాయి. జనవరి 26న దేశమంతటా స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరపాలని, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని నిర్ణయించారు.

**కర్తవ్య నిర్వహణలో లోటు రానివ్వకూడదు**

ఆవల్‌ఖేడాలో శ్రీరామ్ ధ్వజారోహణ జరిపారు. పత్రికలలో ప్రచురితమయ్యే తన కవితలలో, వ్యాసాలలో శ్రీరామ్ తన పూర్తిపేరు వ్రాయసాగారు. భవంతి బయట మైదానంలో ఆయన జెండా ఎగురవేసే ముందు పండిత గేంద్‌రామ్ ఆయనను మొదటిసారిగా పూర్తిపేరుతో సంబోధించారు. "ఇప్పుడు పండిత శ్రీరామశర్మ ఉత్సవ ప్రాధాన్యత గురించి ప్రసంగిస్తారు" – అని ఆయన ప్రకటించారు.

## నూతన అవతారంలో శ్రీరామ్

పండిత శ్రీరామశర్మ ఆనాడు యువకులను ఉద్దేశించి చేసిన ప్రసంగం వివరాలు లభ్యం కాలేదు. ఏమైనా ఆ కార్యక్రమం పండిత శ్రీరామశర్మ నాయకత్వంలో జరిగిన ఉద్యమానికి ప్రారంభం. జనవరి 26న తొలి స్వరాజ్య దినోత్సవాన్ని జరిపిన తర్వాత పండిత శ్రీరామశర్మజీ బెల్లంతో తయారైన ప్రసాదాన్ని పంచి పెట్టారు. ప్రతి సంవత్సరం స్వరాజ్య దినోత్సవం జరుగుతుందని, సంస్థ సభ్యులు ఎక్కడ సమావేశం జరిపితే, అక్కడ ధ్వజారోహణ జరుగుతుందని ఆ సందర్భంగా ప్రకటించారు.

ఆ జనవరి 26 దేశ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది. ఆ రోజునే ఆవల్‌ఖేడాలో శ్రీరామశర్మగారి నూతన అవతారానికి నాంది పలికింది.

1930 ఏప్రిల్‌లో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభ మయింది. లాహోరు మహాసభ ఆమోదించిన తీర్మానాన్ని జన మానసంలో అంకితం చేయడానికి రూపొందించిన వ్యూహంలో అంతర్భాగమే ఈ ఉద్యమం. ఏప్రిల్ 6న మహాత్మాగాంధీ తమ సబర్మతీ ఆశ్రమం నుండి యాత్రను ప్రారంభించారు. సత్యాగ్రహులు వేలసంఖ్యలో ఆయనను అనుసరించారు. ఆయన సముద్రతీరాన ఉన్న దండి అనే స్థలానికి చేరారు. అక్కడ ఉప్పు తయారు చేశారు. ఆంగ్ల ప్రభుత్వం ఉప్పుమీద విధించిన ఆంక్షలను ఉల్లంఘిస్తూ జరిగిన ఈ ఉద్యమం మొత్తం ప్రభుత్వ వ్యవస్థకే గొప్ప సవాలు. ప్రభుత్వం ఈ విషయం పసికట్టింది. ఈ ఉద్యమం ఒక మహా విస్ఫోటనానికి సూచకమని గ్రహించింది. దమనకాండను ఉధృతం చేసింది. అరెస్టులు ముమ్మరం అయినాయి.

ఇలా దమనకాండ, అరెస్టులు తీవ్రతరం అయిన దశలో, కొందరు యువకులు పోలీసులకు పట్టుబడలేదు. పండిత శ్రీరామశర్మ వారిలో ఒకరు. ఆయన గ్రామం బయట ఒక స్థలంలో గొయ్యి త్రవ్వారు. దానిలో ఉప్పునీళ్ళు నింపారు. ఆ నీళ్ళ నుండి ఉప్పు తీయడానికి ప్రయత్నించారు. ఆయనకు ఉప్పు తయారుచేయడంలో అనుభవం లేదు. ఆ పనిలో శిక్షణ పొందను లేదు. సత్యాగ్రహులు వివిధ స్థలాలలో శిక్షణ శిబిరాలు నిర్వహించారు. అయితే, అందరు వాటిలో పాల్గొన లేకపోయారు. పండిట్‌జీ ప్రతీకాత్మకంగా ఉప్పు తయారు చేశారు. ఈ కార్యక్రమం పూర్తికాకముందే పోలీసులు వచ్చారు. యువకులను చెదరగొట్టడానికై పోలీసులు లాఠీచార్జి జరిపారు. శ్రీరామ్‌తోపాటు ముగ్గురు నలుగురు యువకులు ఆ గోతిలో ఉప్పు తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

గోతి నుండి బయటకు రమ్మని పోలీసులు వారిని అడిగారు. గొయ్యి బయట ఉన్న యువకులు లాఠీల ఝుళిపింపులకు భయపడి పారిపోయారు. నీటిలోకి దిగిన యువకులు కూడా జారుకోసాగారు. కానీ, శ్రీరామ్ పోలీసుల మాట వినిపించు కోలేదు. పోలీసులు మూడు నాలుగుసార్లు గద్దించారు. తమ మాటలను ఆయన ఏమాత్రం ఖాతరు చేయకపోవడంతో, వారు నీళ్ళలోకి దిగారు. శ్రీరామ్ మీద లాఠీదెబ్బల వర్షం కురిపించారు. ఆయన వీపుమీద, చేతులమీద, భుజాలమీద, తలమీద లాఠీదెబ్బలు తగిలాయి. ఈ దెబ్బలకు ఆయన నీళ్ళలో పడిపోయారు. పోలీసులు ఆయనను అలా వదలి వెళ్ళిపోయారు. సాయంత్రం అయింది. పోలీసులకు భయపడి శ్రీరామ్‌ను తీసుకువెళ్ళడానికి ఎవరూ రాలేదు. ఆయన రాత్రంతా ఆ ఉప్పునీళ్ళలో అలాగే పడి ఉన్నారు. మరునాటి ఉదయం ఆయనను ఇంటికి తీసుకువెళ్ళారు. పోలీసులు ఆయనను పట్టుకుని తీసుకువెళ్ళారని అనుకుంటూ తాఈజీ రాత్రంతా గడిపారు.

## గోరక్షణకై కఠోర శ్రమ

స్వరాజ్య సమరంలో పాల్గొనడంతోపాటు అనుష్ఠాన సాధన కూడా కొనసాగింది. రోజు మహాపురశ్చరణకు ఆరుగంటలు పట్టేది. ఉదయం ఆరు గంటలకు ముందు, సాయంత్రం సూర్యాస్తమయంలోగా శ్రీరామ్ ఈ సాధనను పూర్తిచేసేవారు. జపం అభ్యాసం అయిన తర్వాత ఈ సాధనకు అయిదు గంటలు సరిపోయేది.

శ్రీరామ్ 18–19 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు జరిగిన సంఘటన –

ముసలి ఆవులను అమ్మివేసే ప్రవృత్తి, పాలివ్వని ఆవులను

**ఇతరులతో స్నేహ సౌహార్ద్రాలతో వ్యవహరించాలి**

వీధిలో వదలివేసే ప్రవృత్తి ఆ రోజుల్లో కూడా ఉండేది. గ్రామంలో ఒక వ్యక్తి రెండు ఆవులను కసాయివాడికి అమ్మివేశాడు. ఆ ఆవుల కాళ్ళు చచ్చుబడ్డాయి. కసాయివాడు ఆ ఆవులను తీసుకుని వెళ్ళిపోయాడు.

శ్రీరామ్‌కు ఈ సంగతి తెలిసింది. ఆయన తమ బాలసేన సభ్యుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఏమి చేయాలో తక్షణం నిర్ణయించారు. శ్రీరామ్ ఒక సహచరుడిని వెంట తీసుకుని పరుగు పరుగున వెళ్ళి, కసాయివానితో మాట్లాడారు. ఆ ఆవులను చంపవద్దని కోరారు. తాను కొన్న ధర ఇస్తే ఆవులను అప్పగిస్తానని అతడు చెప్పాడు. రెండు ఆవుల ఖరీదు 18 రూపాయలని చెప్పాడు. తాఈజీని ఆ పైకం అడగవచ్చు. కాని, శ్రీరామ్‌కు అది ఇష్టం లేదు. ఆయన కొంత ఆలోచించి సరే అన్నారు. కొద్ది సమయం అడిగారు.

ఆ తర్వాత ఆయన గ్రామంలోని షావుకారు గుల్‌జారీ వద్దకు వెళ్ళారు. అతడి నుండి రూ.35/–లు అప్పు తీసుకున్నారు. ఈ యువకుని స్వభావం, నిష్ఠ అతడికి బాగా తెలుసు. అతడు వడ్డీ అడగలేదు. వస్తువు కుదవబెట్టమని అడగలేదు. కొద్ది రోజులలో తిరిగి ఇవ్వాలని, చేబదులుగా ఆ మొత్తం ఇచ్చాడు. ఆ పైకంలో ఆవుల ఖరీదు ప్రక్కన ఉంచి, శ్రీరామ్ ఒక ఎడ్లబండి అద్దెకు తీసుకొన్నారు. ఆవులను బండిలోకి ఎక్కించారు. కొంత దూరం వెళ్ళిన తర్వాత ఒక ఎద్దు చతికిలపడింది. దానికేదో వ్యాధి సోకింది. శ్రీరామ్ ఆ ఎద్దును కాడి నుండి తప్పించారు. దాని బదులు కాడిని తన భుజానికి ఎత్తుకున్నారు. కాడికి ఒకవైపున ఎద్దు, మరోవైపున శ్రీరామ్, ఈవిధంగా ఆవులను మోసుకుని బండి ముందుకు సాగింది. మూడు రోజుల పాటు సాగింది ఆ యాత్ర. శ్రీరామ్ ఆవులను తీసుకుని హాత్‌రస్ చేరారు. అక్కడి గోశాలకు ఆవులను అప్పగించారు. నాలుగవ రోజున తిరిగి వచ్చారు. షావుకారు అప్పు తీర్చడానికై శ్రీరామ్ బాలసేన సభ్యుల సహకారాన్ని తీసుకున్నారు. తలోకొద్ది మొత్తం వేసుకుని, అందరు కలసి గుల్‌జారీ అప్పు తీర్చారు.

### ఊహకందని సాహసం

ఆ రోజుల్లోనే జరిగిన ఒక సంఘటన.

గ్రామంలో ఒకే ఒక పచారీ కొట్టు ఉండేది. ఆ కొట్టు యజమాని సులేఖ్‌చంద్ ఇంటికి నిప్పంటుకున్నది. కొట్టు, ఇల్లు కలిసే ఉన్నాయి. ఇల్లు ఇటుకలు, అడుసుతో తయారైనది. అయితే, పై కప్పు వెదురుకర్రలో తయారైనది. పెంకులతో కప్పబడినది. చూస్తూ ఉండగానే పై కప్పుకు నిప్పు అంటుకుంది. అతడు తన పిల్లలను కాపాడుకోవడంలో కన్నా కొట్టులోని డబ్బును, సామానును కాపాడుకోవడంలో మరింత శ్రద్ధ చూపాడు. పిల్లలు తెలివిగలవారు. దూకుతూ అగ్ని జ్వాలల నుండి బయటికి వచ్చారు. వదిన లోపలే ఉండిపోయిందని కేకలు వేశారు. వదిన అంటే ఆ ఇంటి కోడలు. ఆమె గర్భవతి.

శ్రీరామ్ అక్కడికి చేరారు. ఆ కేకలు విని, పరిస్థితిని అర్థం చేసుకున్నారు. చుట్టుప్రక్కల పరకాయించి చూచారు. పొరుగు ఇంటిలోకి వెళ్ళారు. అక్కడ నుంచి నిచ్చెన బయటికి తెచ్చారు. గుమ్మంవద్ద మంటలు బాగా వ్యాపించి ఉన్నాయి. లోపలికి వెళ్ళడం కష్టం. నిచ్చెన సహాయంతో ఆయన పైకప్పు ఎక్కి, ఇంటిలోకి దూకారు. కొద్ది నిమిషాలలో ఇంటి కోడలిని భుజాలమీద వేసుకుని బయటికి వచ్చారు. ఆమె శరీరం కొద్దిగా కమిలిపోయింది. ఆమెకు ప్రథమ చికిత్స జరిపే ఏర్పాట్లు చేశారు. దుకాణదారు కుటుంబం ధన్యవాదాలు చెప్తూ ఉండిపోయింది.

అగ్ని జ్వాలలలో చిక్కుకున్న దుకాణదారు కోడలిని శ్రీరామ్ తన ప్రాణాలు ఒడ్డి కాపాడిన ఈ సంఘటన తర్వాత మరో సంఘటన జరిగింది.

వితంతువు అయిన ఒక యువతి మరో కులం యువకుని వల్ల గర్భవతి అయింది. పెళ్ళయిన కొద్ది రోజులకే ఆమె వితంతువు అయింది. అత్తింటివారు ఆమెను ఆమె పుట్టింటికి తిరిగి పంపివేశారు. ఆమె తన తల్లిదండ్రులతోపాటు నివసిస్తోంది. ఆ రోజుల్లో వితంతువు ఇంటిలో ఉండడమే అప్రతిష్ఠ పాలుకావడం అని భావించేవారు. పైగా ఆమె గర్భిణి అయింది. ఆమె తల్లిదండ్రులకు గ్రామంలో ఉండడం చాలా కష్టమయింది. ఇరుగు పొరుగు అమ్మలక్కల సూటిపోటి మాటలను వారు భరించలేకపోయారు.

శ్రీరామ్ ఈ వ్యవహారంలో జోక్యం కలిగించుకున్నాడు. ఆ యువతికి మళ్ళీ పెళ్ళి చేయవలసిందని సలహా ఇచ్చారు. జనం మొదట్లో ఈ సలహాను ఎగతాళి చేశారు. ఆ ఇంటివాళ్ళు కూడా ఒప్పుకోలేదు. మా మీద దయ ఉంచండి, అసలే కష్టాలలో ఉన్నాం; మరో ఉపద్రవం ఎందుకు కొనితెచ్చుకోవాలి అన్నారు. శ్రీరామ్ వారికి ఇలా నచ్చజెప్పారు. ఇందులో ఎలాంటి పాపము లేదు. ప్రాచీనకాలంలో ఇలాంటివి జరుగుతూ ఉండేవి. శాస్త్రాలు ఇందుకు సమ్మతించాయి.

**ఆపదలో ఉన్నవారికి చేయూత ఇవ్వాలి**

కొంచం ఆగి ఆయన ఇలా అన్నారు – "వితంతువులైన బాలికలు కోరుకుంటే మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చునని ప్రభుత్వం కూడా చెప్తున్నది. అలాంటి బాలికలకు తిరిగి కుటుంబాన్ని ఏర్పరచుకొనే హక్కు ఉన్నది". శ్రీరామ్ శాస్త్ర సంప్రదాయాలని, ప్రభుత్వాన్ని, మహాపురుషులను ప్రమాణాలుగా చూపారు. వారు ఒప్పుకున్నారు. ఆ అమ్మాయి కడుపులో ఉన్న బిడ్డను ఏమి చేయాలన్నదే వారి ఒకే ఒక సమస్య. తల్లిదండ్రులు తన సలహా పాటించడానికి సిద్ధపడడం చూచి, శ్రీరామ్ ఇలా అన్నారు – "దాన్ని కూడా ప్రపంచంలోకి రానివ్వండి. భగవంతుడు దాని బాగోగులు చూసుకుంటాడు."

సంరక్షకులు అంగీకరించిన తర్వాత శ్రీరామ్ ఆ యువతి తండ్రిని తీసుకుని మథుర వెళ్ళారు. అక్కడ ఆర్యసమాజ్ శాఖ ప్రధాన పండితుడు వేదవ్రతను కలిశారు. ఆయనకు మొత్తం పరిస్థితిని వివరించారు. మూడు నాలుగు నెలలపాటు సమాచారం సేకరించడం, చర్చించడం జరిగిన తర్వాత తగిన వరుడు లభించాడు. జీవన్ ప్రసాద్ అనే ఆ యువకుడు కూడా విధురుడే. అతడికి ఒక సంతానం ఉంది. యువతి పరిస్థితిని, ఆమె కుటుంబం పరిస్థితిని అతడికి స్పష్టంగా వివరించారు. సంబంధం కుదిరింది. ఆ యువతికి జన్మించిన సంతానం ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని ఒక పారిశ్రామిక నగరంలో జీవితపు చరమదశను గడుపుతున్నారు. ఆమె వంశంవారు సుఖ సమృద్ధులతో జీవిస్తున్నారు.

## గిరివర్ ఇంటిలో సత్యనారాయణ వ్రతం

శ్రీరామ్ కౌమార దశను దాటి యౌవనదశలో ప్రవేశిస్తున్న సమయంలో జరిగిన మరో సంఘటన.

ఆవల్‌ఖేడాలో భవంతి బయట ఊడ్చడానికి, తాఈజీ గుర్రానికి స్నానం చేయించడానికి గిరవర్ అనే ఒక పారిశుద్ధ్య కార్మికుడు వచ్చేవాడు. తన ఇంటిలో సత్యనారాయణ వ్రతం చేసుకోవాలనే కోరిక అతడికి కలిగింది. కానీ, పండితులెవ్వరు అందుకు ఒప్పుకోలేదు. అతడు ఎందరినో అడిగి చూసాడు. తగినంతగా దానదక్షిణలు ఇస్తానని కూడా చెప్పాడు. అయినా కడజాతివారి ఇంటిలో వ్రతం జరపడానికి అందరు వెనుకాడారు. గిరివర్ మనస్సు గాయపడింది. ఒక రోజున శ్రీరామ్ ముందు ఇలా తన బాధ వెళ్ళబోసుకున్నాడు. "మా ఇంటిలో సత్యనారాయణ వ్రతం జరపాలని అనుకున్నాం. కాని మా అదృష్టం బాగా లేదు."

"ఎందువల్ల? ఏమయింది అదృష్టానికి?"

అని శ్రీరామ్ అడిగారు. ఆ ప్రశ్నలో ఆత్మీయతతోపాటు ఆక్రోశం కూడా కలగలసి ఉంది. గిరివర్‌లోని నిరాశవల్ల కలిగిన ఆక్రోశం అది. అతడు ఇలా అన్నాడు –

"మేము అంటరానివాళ్ళం కదా. కనుక మా ఇంటిలో ఎవరూ వ్రతం చేయించరు."

శ్రీరామ్ కొద్ది క్షణాలు ఆగి ఇలా అన్నారు –

"రేపు స్నానాలు చేసి సిద్ధంగా ఉండాలి. ఇంటిలోని వాళ్ళందరు శుభ్రంగా ఉండాలి. మేము మీ ఇంటిలో వ్రతం చేస్తాము."

ఈ వాగ్దానం పొందడంతో గిరివర్ ముఖం వికసించింది. కానీ, మరుక్షణంలోనే అతడు క్రుంగిపోయాడు. అతడు ఇలా అన్నాడు.

"మిగతా పండితులు రానన్నప్పుడు మిమ్మల్ని ఎవరు రానిస్తారు. మీ తాఈజీ, మిగతావారు మిమ్మల్ని రానివ్వరు."

ఆ విషయంలో నిశ్చింతగా ఉండమని శ్రీరామ్ అతడికి చెప్పారు. అనుమానం, నమ్మకం కలగలిసిన అనుభూతితో గద్గదుడై గిరివర్ తన ఇంటికి తిరిగివెళ్ళాడు. ఇంట్లో ఉన్న అందరికీ చెప్పాడు. ఆ వెంటనే సన్నాహాలు ప్రారంభమైనాయి. ఇల్లంతా శుభ్రం చేశారు. బట్టలు, పక్కబట్టలు ఉతికారు. గిన్నెలు శుభ్రంగా తోమారు. ఇంటివాకిలి అలికి ముగ్గులు వేశారు. రాత్రి బాగా పొద్దుపోయేవేళకు గిరివర్ ఇల్లు మెరిసి పోయింది.

మరునాడు 18-19 సంవత్సరాల వయస్సుగల యువ పండితుడు సంచి, హవన కుండం, సామాగ్రి, శంఖం, సత్యనారాయణ స్వామి పటం, ప్రసాదం మున్నగునవి తీసుకుని అక్కడికి వచ్చారు. గిరివర్ తన బంధువులను, కులస్థులను కూడా వ్రతానికి పిలిచాడు. 25-30 మంది చేరారు.

విధి విధానం ప్రకారం వ్రతం ప్రారంభయింది. ఒక్కొక్క కథ పూర్తయిన తర్వాత శంఖం ఊదారు. అంతా జయజయ ధ్వానాలు చేశారు. కథలన్నీ పూర్తయిన తర్వాత గంట మ్రోగిస్తూ హారతి ఇస్తున్నారు. అక్కడ గుమికూడిన జనంలో ఉత్సాహం, ఉత్తేజం ఉరకలు వేస్తున్నాయి. 'ఓం జయ జగదీశ హరే' అని బిగ్గరగా భజన చేస్తూ వారంతా హారతి ఇస్తున్నారు. శంఖం ధ్వని, జయజయధ్వానాలు గ్రామంలోని ఇతర గృహాలకు

**చెప్పుడు మాటలను విని, తప్పుడు నిర్ణయం తీసుకోకూడదు**

వినిపించాయి. ఏమి జరుగుతోందో మొదట అర్థం కాలేదు. అర్థం కాగానే బ్రాహ్మణవాడల, ఠాకూర్‌వాడల జనంలో క్రోధం చెలరేగింది.

15-20 మంది తిట్లు తిడుతూ శాపనార్థాలు పెడుతూ ఆ హరిజనవాడవైపు పరిగెత్తారు. ఆ కేకలు, పెడబొబ్బలు దూరం నుండి వినిపిస్తున్నాయి. గిరివర్ ఇలా అన్నాడు. జనం కొట్టడానికి వస్తున్నారు. బాబుగారు! మీరు తప్పించుకుని వెళ్లిపోండి.

శ్రీరామ్ ఇలా అన్నారు. పారిపోను. మిమ్మల్ని వాళ్ళ క్రోధానికి ఎరలు కానివ్వను.

గిరివర్, అతడి కుటుంబ సభ్యులు అరిచారు. మొత్తుకున్నారు. ఒత్తిడి చేశారు. కాళ్ళావేళ్ళా పడ్డారు.

శ్రీరామ్ ఒక షరతు పెట్టారు -

మీరు మిమ్మల్ని దోషులుగా చేసుకోకండి. శ్రీరామ్ వ్రతం చేస్తానని పట్టుపట్టారని ఆ జనం ఏమి చెప్పకముందే మీరు స్పష్టం చేయండి.

అక్కడివాళ్ళు ఆ షరతుకు ఒప్పుకున్నారు. ఒట్టువేసుకున్నారు. ఆ తర్వాతనే శ్రీరామ్ వెళ్ళడానికి అంగీకరించారు.

బ్రాహ్మణ ఠాకూర్ గుంపు ఇంటికి చేరకముందే శ్రీరామ్ వ్రతం సామాగ్రి సర్దుకున్నారు. తాను తెచ్చిన దుప్పటిలో ఆ సామాగ్రి మూట కట్టారు. ఆ మూటను భుజాన వేసుకున్నారు. పొలాల మధ్య నుంచి సాగిపోయారు. జనానికి కనబడకుండా భవంతికి చేరారు.

అక్కడ గిరివర్, ఇతరులు తాము ఒట్టు వేసుకున్న ప్రకారం సంజాయిషీ ఇచ్చారు. శ్రీరామ్ మొండిపట్టు అందరికీ తెలిసిందే. కనుక వ్రతం చేస్తానని ఆయనే పట్టుపట్టారని వారు చెప్పారు. వారు భవంతికి వచ్చి, తాఈజీకి ఫిర్యాదు చేశారు. తాఈజీ శ్రీరామ్‌ను కొద్దిగా మందలించారు. అంతటితో ఆ కథ ముగిసింది.

## విప్లవవాద కార్యాలయం

సమాజంలో కొత్త సంస్కారాన్ని మేలుకొలపడానికై శ్రీరామ్ తన అభిప్రాయాలను రచనల ద్వారా, ప్రసంగాల ద్వారా వ్యక్తం చేయడం ప్రారంభించారు. స్వరాజ్య ఉద్యమాన్ని సమర్థిస్తూనో, ఆంగ్ల పాలనను వ్యతిరేకిస్తూనో వ్రాయడం ఆ రోజుల్లో సులభమైన విషయం కాదు. వ్రాసినా, దాన్ని అచ్చువేయడం కష్టమయ్యేది. శ్రీరామ్ ఎక్కువగా కవితలు వ్రాసేవారు. ప్రచురణ కోసం వాటిని ఆగ్రాలోని "సైనిక", కాన్పూర్‌లోని "ప్రతాప్", కలకత్తాలోని "విశ్వమిత్ర" మున్నగు పత్రికలకు పంపేవారు. "శిర్‌కత్", "మస్తాన్" మున్నగు పత్రికలలో కూడా ఆయన రచనలు ప్రచురించబడేవి.

స్వరాజ్య ఉద్యమం కోసం సమావేశాలు జరపడంతోపాటు సామాజిక కార్యాలకోసం కూడా చర్చలు అవసరమయ్యేవి. సమావేశాలు అక్కడక్కడ జరిగేవి. సత్యనారాయణ వ్రత సంఘటన జరిగిన తర్వాత సమావేశాల కోసం ఏదో ఒక స్థలాన్ని నిర్ణయించాలని శ్రీరామ్ తన సహచరులతో చెప్పారు. ఇళ్ళలో సమావేశాలు జరగడం కుదరదు. ఇళ్ళలో ఇతర వ్యక్తులు ఉంటారు. పెద్దవాళ్ళ ప్రభావం కూడా ఉంటుంది. వచ్చిపోయేవాళ్ళ వల్ల ఇబ్బంది కలుగుతుంది. ఏకాంతం ఉండదు.

ఈ సమస్యకు పరిష్కారాన్ని తాఈజీ కనుగొన్నారు. ఆమె భవంతిలోని ఒక భాగాన్ని సూచించారు. తమ సమావేశాలు ఇళ్ళకు దూరంగా ఉన్న స్థలంలో జరగాలనే తమ నిర్ణయాన్ని సైనికులు తెలిపారు. తాఈజీ ఇలా అన్నారు - 'ఇక్కడ మీకు ఎవరూ అడ్డం రారు. 24 గంటలు కూర్చున్నా, మిమ్మల్ని పిలవరు. అయినా బాలసేనలోని యువ సభ్యులు ఒప్పుకో లేదు. తాఈజీ తన మనస్సులోని బాధను ఇలా వారి ముందు ఉంచారు. - "అసలు శివాలయంలో శ్రీరామ్‌కు ప్రమాదం పొంచి ఉంది. అతడు మా చేతుల్లోనుంచి జారిపోయి, శివుడి చేతుల్లోకి వెళ్ళిపోతాడు."

తాఈజీ చెప్పిన ఈ మాట బ్రహ్మాస్త్రం అయింది. ఆమె సంకోచాన్ని గౌరవిస్తూ, భవంతిలోని ఒక భాగాన్ని తమ కార్యాలయంగా చేసుకోవడానికి అందరూ అంగీకరించారు. తమ సమావేశాల గురించి, పనుల గురించి ఎవరికీ చూచాయగా అయినా తెలియకూడదని వారు ఆమె నుండి మాట తీసుకున్నారు. తాఈజీ స్వయంగా వెళ్ళి, వారికి ఆ గది చూపించారు. 20-25 మంది విశ్రాంతిగా కూర్చునేందుకు ఆ గదిలో వీలున్నది. అవసరం అయినప్పుడు అల్పాహారం, భోజనం ఏర్పాటు జరుగుతుందనే వాగ్దానాన్ని కూడా వారు పొందారు. ఆవిధంగా ఆవల్‌ఖేడాలోని ఆ గదిలో ఒక విప్లవ వాద కార్యాలయం ప్రారంభమయింది.

★★★

**విధి మీ చేతులలోనే ఉన్నది**

యుగ నిర్మాణ యోజన

# మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 12

## స్త్రీ పురుషులం ఇరువురం పవిత్ర దృష్టిని కలిగి ఉంటాము

పురుషులు స్త్రీల పట్ల, స్త్రీలు పురుషుల పట్ల పవిత్రమైన ఆలోచనలను కలిగి ఉండడం వలన ఆత్మోన్నతి పొందడమే కాక సామాజిక ప్రగతి కలిగి సుఖశాంతులు విలసిల్లుతాయి. బ్రహ్మచర్య వ్రతమును పాటించేవారు, వివాహం కాని స్త్రీ, పురుషులు అందరూ ఆలోచనల యందు ఒకరిపట్ల మరొకరు పవిత్రభావమును కలిగి ఉండడం మంచి పద్ధతి. వీరేకాక మిగిలినవారు కూడా ఇటువంటి దృష్టికోణాన్నే కలిగి ఉండాలి.

'స్త్రీ ఈ ప్రపంచంలో సర్వోన్నతమైన పవిత్రమూర్తి'. తల్లి రూపంలో ఆమె అనంతమైన వాత్సల్యమును తనతోపాటే తీసుకొని ఈ పృథ్విపై అవతరిస్తుంది. భార్య రూపంలో త్యాగమును, బలిదానమును ఇస్తుంది. ప్రేమను అందిస్తుంది. తనను తాను ఆత్మదానము చేసుకున్న సజీవప్రతిమగా ఈ ప్రపంచంలో నిలిచిపోతుంది. సోదరిరూపంలో స్నేహమును, ఉదారతను ప్రదర్శిస్తూ మమతకు మారుపేరుగా నిలిచి పోతుంది. కుమార్తె రూపంలో కోమలత్వమునకు, మృదుత్వ మునకు, నిశ్చలతకు ప్రతిరూపంగా నిలిచి రసవిహీనమైన ఈ ప్రపంచాన్ని రసాత్మకంగా మార్చేస్తుంది. పరమాత్మ స్త్రీ యందు సత్యం, శివం మరియు సుందరములనే అనంత భాండారములను నింపాడు. ఆమె నేత్రములలోని అలౌకిక జ్యోతి కిరణాలు కొన్ని పడినంత మాత్రముననే కరుడుగట్టిన హృదయములందు ఉండే వాడిపోయిన పూదోటలు కూడా తిరిగి పుష్పిస్తాయి. బలహీనులు, అవిటివారైన మానవులను శక్తివంతులుగా, బలవంతులుగా తీర్చిదిద్దగలిగే కీర్తి ఆమెకు మాత్రమే దక్కుతుంది. ఆమె మూర్తీభవించిన ప్రేరణల రూపంలో, భావనలు మరియు స్ఫూర్తి రూపంలో మనకు ప్రత్యక్షమవుతుంది. ఆమె అచేతనంగా పడి ఉన్న వాటియందు కూడా చేతనత్వమును నింపగలదు. ఆమె సాన్నిధ్యమునందు ఎందుకూ పనికిరాని వ్యక్తి యొక్క భాగ్యము అఖండముగా వెలిగిపోతుంది. ఆ వ్యక్తి తానెంతో కృతార్థుడైనట్లుగా అనుభూతి చెందుతాడు.

స్త్రీ యొక్క గొప్పతనము అగ్నితో సమానమైనది. మన జీవితము అగ్ని నుండే ప్రారంభమవుతుంది. అగ్ని లేని మనిషి ప్రాణంలేని నిర్జీవులతో సమానం. అగ్ని యొక్క మహిమను గురించి ఎంత కీర్తించినా అది తక్కువే అవుతుంది. అటువంటి ఈ అగ్నికి రెండవ స్వరూపం కూడా ఉంది. అదేమిటంటే అది ఏ వస్తువును తాకినా వెంటనే కాలనాగువలె నాలుకలు చాస్తూ పైపైకి ఎగిసిపడుతుంది. దేనిని ముట్టుకున్నా భయంకరమైన ఉపద్రవమును తెచ్చిపెడుతుంది. అదేవిధంగా స్త్రీయందు కూడా అనంతమైన గుణములెన్ని ఉన్నా దోష గుణము కూడా ఒకటి ఉంది. అదే ఆమె యొక్క రమణీయమైన స్వరూపం. ఆ రూపమును ఎవరైనా తాకారో వెంటనే అపరిమితమైన వేదనను అనుభవిస్తూ గిలాగిలా కొట్టుకుంటారు. అటువంటి ఆమె యొక్క రూపాన్ని వ్యామోహ దృష్టితో చూచినా, ఆలోచించినా, తాకినా వెంటనే కాలనాగువలె విషం చిమ్ముతూ పైకి ఎగిసిపడి తన కోరలను వారి శరీరంలోకి దింపుతుంది. తేలు యొక్క రూపం చూడటానికి ఎంతో చక్కగా ఉంటుంది. కానీ దాని కొండె కనుక శరీరంలోకి దిగిందా పెద్ద ఆపద సంభవించినట్లే. తేనేటీగ ఎంత ఉపకారం చేస్తుంది, తుమ్మెద ఝుంకారం ఎంత మధురంగా ఉంటుంది, కాళ్ళజెఱ్ఱి ఎంత అందమైన కాళ్ళతో నడుస్తుంది. కందిరీగ మన ఇంటి కప్పుల మీద ఎంత అందమైన గూడు కట్టుకుంటుంది. వీటన్నింటిని ఎవరైనా తాకితే మాత్రం ఇక వారి పని అయిపోయినట్లే! అదేవిధంగా స్త్రీ యొక్క కామిని రూపం, రమణీయ రూపంలో కూడా ఒక చిన్న విషపాత్ర దాగి ఉన్నది. ఆ అందమైన కత్తి పదును నుండి ఎప్పుడూ మనలను మనం కాపాడుకుంటూ ఉండాలి.

వయస్సులో పెద్దవారైన స్త్రీలను తల్లిగాను, సమవయస్కులైన వారిని సోదరీమణులగాను, చిన్నవయస్సున్నవారిని కూతురు గాను భావించాలి. ఆ భావనలను అధికాధికంగా పెంచుకుంటూ ఉండాలి. అప్పుడు వారి సమక్షములో కూర్చున్నప్పుడు సరస్వతి,

**జీవన్మరణాల ప్రక్రియనే మీ చేతులలోకే తీసుకొనవచ్చు**

లక్ష్మి, దుర్గామాతల చరణముల వద్ద కూర్చుని వారి అనంత వాత్సల్యమును ఆనందంగా అనుభూతి చెందుతున్న ఆహ్లాద కరమైన భావన కలుగుతుంది. గాయత్రీ ఉపాసకులమైన మనము స్త్రీని భగవంతుని యొక్క అత్యున్నతమైన, సర్వశ్రేష్ఠమైన ప్రతిరూపంగా భావించాలి. స్త్రీయందు భగవంతుని కరుణ, పవిత్రత, సదాశయములను దర్శించడమనేది భక్తిభావనయనే తత్వమునకు ఆధారము. ఉపాసనయందే కాదు వ్యావహారిక జీవితములో కూడా ఇదే విధమైన దృష్టికోణమును కలిగి ఉండాలి. స్త్రీలందరిని మనం పవిత్రదృష్టితోనే చూడాలి.

దాంపత్య జీవితమునందు సంతానోత్పాదన అనే విశేషమైన ప్రయోజనమును పూర్తి చేయాలి కనుక భార్యాభర్తలు ఇరువురు కొద్ది క్షణాలు కోరిక అనే తేలికపాటి భావాన్ని అనుభవించవచ్చు. దీనిని గురించి శాస్త్రములయందు చిన్నపాటి తప్పు కూడా లేదు. వారు గర్భాదానము, యజ్ఞోపవీత, ముండన సంస్కారములను పవిత్ర ధర్మకృత్యములుగా భావిస్తారు. ఈ దృష్టితోనే ఆ క్రియను జరుపుకోవాలని ఆజ్ఞాపించడం జరిగింది. మానవుల బలహీనతను గమనించి ఒక పరిమితమైన మర్యాదకు లోబడి కోరికను తీర్చుకోవచ్చని కొంత వెసులుబాటు కల్పించారు. నిజానికి దాంపత్య జీవితమంటే ఇద్దరు సొంత అన్నదమ్ముల, అక్క చెల్లెండ్ర మధ్య ఉన్నంత పవిత్రమైన సంబంధముగా ఉండాలి. **వివాహమంటే రెండు శరీరాలు ఒక ఆత్మగా మారి జీవితమనే రథాన్ని రెండు భుజాలపై మోస్తూ నడవాలి** తప్ప దుష్ప్రవృత్తులను ప్రోత్సహించకూడదు. ఈనాడు వస్తున్న చలనచిత్రాలు, అశ్లీల చిత్రాలు, సాహిత్యములన్నీ పరమ పునీతమైన స్త్రీమూర్తిని అశ్లీల రూపంలో, రోత కలిగించే రూపంలో ఒళ్ళు గగుర్పొడిచేంత నీచంగా దిగజార్చివేశాయి. స్త్రీని కనీసం మోహపూరితమైన దృష్టితో చూసినా, ఆలోచించినా ఆమె యొక్క గౌరవాన్ని దిగజార్చిన వారమవుతాము. అవసరాన్ని తీర్చే ఉద్దేశ్యంతో చూసినవారమవుతాము. ఇది చాలా నీచమైన, దోషపూరితమైన ఆలోచనా విధానము. అంతేకాదు ఇది చాలా ప్రమాదకరమైన ఆపదలను తెచ్చి పెడుతుంది. ఇటువంటి ఆలోచనా విధానమును మన అంతరంగము నుండే కాదు, సమాజము నుండి కూడా పూర్తిగా తుడిచివేయాలి. ఏ స్త్రీ స్వరూపము యొక్క దృష్టి ప్రసరించినంత మాత్రముననే మానవప్రాణులందరు ధన్యులైపోతారో ఆ స్త్రీ స్వరూపాన్ని తిరిగి ప్రతిష్ఠించాలి.

పైన స్త్రీని ఏ దృష్టితో పురుషుడు చూడాలో చెప్పాము. అదేవిధంగా స్త్రీ కూడా పురుషుడిని ఏ విధమైన దృష్టికోణముతో చూడాలో కొద్దిపాటి తేడాతో వివరిస్తాము. జననేంద్రియాల నిర్మాణపరంగా ఆలోచిస్తే ఇరువురు దాదాపు సమాన సామర్థ్యం, బుద్ధి, భావనలు, స్థితులను కలిగి ఉంటారు. ఇద్దరికి ఎవరివైన గొప్పతనాలు వారికున్నాయి. అదేవిధంగా లోటుపాట్లు ఉన్నాయి. వీటిని సంపూర్ణం చేసుకునేందుకు ఒకరినొకరు ఆశ్రయించుకోక తప్పదు. ఈ ఆశ్రయమనేది భార్యాభర్తల మధ్య కాముకత అనే ప్రయోజనమును పూర్తి చేసేదిగా ఉండవలసిన అవసరం లేదు. స్త్రీ పట్ల పురుషునికి, పురుషుని పట్ల స్త్రీకి ఉండే కర్తవ్యాలను, నిర్వహించవలసిన బాధ్యతలను నిర్వహిస్తూ స్నేహంగా, సాత్వికంగా, స్వర్గతుల్యమైన సంబంధాలను కొనసాగించేవిధంగా ఉండవచ్చు. తల్లి, కూతురు, సోదరీ సంబంధాలు, స్నేహితులు, సహోదరులు లాంటి సంబంధాలను ఆత్మీయమైన అత్యంత శ్రేష్ఠమైన సంబంధాలుగా భావించి నిలుపుకొని తీరాలి. పవిత్రతయందు అసామాన్యమైన బలం ఉంది. వాసనామయమైన, నరక సదృశమైన బురదలో నుండి చూస్తే అది కనిపించదు. ప్రేమకు, మోహానికి మధ్య స్వర్గానికి, నరకానికి మధ్య ఉన్నంత తేడా ఉంది. అవి రెండూ ఒకదానితో మరొకటి విభేదిస్తాయి. వ్యభిచారులయందు ఈర్ష్యాద్వేషాలు, అధిపత్యము, నీచత్వము, కాముకత, రూపసౌందర్యము, శృంగారము, కలహము, నిరాశ, కుళ్ళు, పతనము, నష్టము, నిందవంటి లెక్కలేనన్ని దుర్గుణాలు ఉంటాయి. పవిత్రతయందు త్యాగము, ఉదారత, శుభకామన, సహృదయత, శాంతి తప్ప మరేమీ ఉండవు.

యుగనిర్మాణ సత్సంకల్పాల్లో 'ఆత్మవత్ సర్వభూతేషు (అందరిని తనలాగే భావించుకొనుట), పరద్రవ్యేషు లోష్ఠవత్ (ఇతరుల ధనమును ఆశించకుండా ఉండుట), పరదారేషు మాతృవత్ (పరస్త్రీలను తల్లిగా భావించుట)' అనే పవిత్ర భావాలు ఉన్నాయి. వీటి ఆధారంగానే నవయుగము సృష్టించ బడుతున్నది. దీనిని ఆలంబనగా చేసుకుని ప్రపంచాన్ని స్వర్గంగా మార్చాలనే స్వప్నమును సాకారము చేసుకోవచ్చు. ఈ సౌభాగ్యాన్ని ఎవరు సదుపయోగం చేసుకుంటారో వారు ఇంకా పైకెదిగి పూర్ణత్వమనే లక్ష్యమును చేరుకోగలుగుతారు.

*– అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**అందరితో మర్యాదగా ప్రవర్తించాలి**

**కుండలినీ మహావిజ్ఞానం-5**

# యోగం యొక్క రహస్యం - సిద్ధికి పరికరములు

ఆత్మను పరమాత్మతో కలపటాన్ని యోగం అంటారు. యోగం వలన ఆత్మ బలం ఎన్నో రెట్లు అధికమవుతుంది. మనుష్యుడు వానరజాతికి చెందిన పశువు. ఆదిమకాలం నుండి అతడు ఆ విధంగానే ఉండేవాడు. న్యూగినిలో ఇప్పటికి ఆదిమ కాలం నాటి సభ్యత కలిగిన ఆదిమవాసులున్నారు. అక్కడి స్త్రీ, పురుషులు నగ్నంగానే ఉంటారు. ఆహారంగా జీవ జంతువులను, వనస్పతులను కలిపి తింటారు. సభ్యతకు దూరంగా ఉంటారు. అందువలన వారికి భాష కూడా లేదు. కొన్ని శబ్దాలతో, సంకేతాలతో వ్యవహరిస్తారు. వారు శారీరిక దృష్టిలో చాలా బలవంతులు. ఎక్కువ చలిని, వేడిని సహించగలరు. మనిషి కూడా ఒక రకంగా అదే విధమైన ఆదిమకాల సభ్యతతో జీవిస్తున్నాడు. అతడు పొట్టకూటి కోసం, ప్రజనన (సెక్స్) కొరకు, లోభమోహ మొదలైన ప్రవృత్తులతో ప్రవర్తిస్తాడు. మానవ గరిమకు తగినట్టు ఆదర్శాలను పాటించడం అతనికి కష్టమనిపిస్తుంది.



సాధకుని జీవన్ముక్త స్థితి

ఉత్కృష్టత, ఆదర్శవాదం అనే విభూతులు పరమాత్మ సత్తాలో కలపబడి ఉన్నాయి. మనిషి తనంతట తాను ఆ శ్రద్ధా సముచ్ఛయంతో పాటు కలుపుకుపోగలిగితే ఆదిమ స్థితి నుండి ఎదిగి సభ్య సంస్కారవంతుడిగా మారగలడు. పతిపత్నులు అన్యోన్యంగా ఉండి గృహాన్ని స్వర్గంగా చేసుకోవచ్చు. అదేవిధంగా ఆత్మ పరమాత్మల సంయోగంతో మనిషి స్థాయి నుండి దేవతాస్థాయికి చేరుకుంటాడు. అందువలనే యోగసాధన యొక్క మహిమ గానం చెయ్యబడింది. ఆంతరిక ఉత్కర్ష యొక్క మహత్యాన్ని అర్థం చేసుకున్నవారు ఆ దిశలో ముందుకు వెళ్తారు.

యోగం రెండుగా విభజింపబడింది. ఒకటి బహిరంగ యోగం, రెండవది అంతరంగ యోగం. బహిరంగ యోగములో శరీర నిర్వహణకు అనేక పద్ధతులు అవసరమవుతాయి. ఆసనము, ప్రాణాయామం, బంధములు, ముద్రలు, జపం, హవనం, తీర్థపూజ, కీర్తనము మొదలైనవి బహిరంగ యోగం క్రిందకు వస్తాయి. దీనిని క్రియాయోగమని కూడా అంటారు. దీనిలో ఒక శాఖను హఠయోగమని అంటారు. దీనిలో క్రియ కృత్యములపై ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వబడింది. దీనిలోని పద్ధతులపై, అనుశాసనములను అనుసరించవలసి ఉంటుంది. క్రియాయోగం యొక్క ప్రభావం స్వాస్థ్యముపై (ఆరోగ్యం), ప్రతిభపై, బుద్ధి కౌశలంపై పడుతుంది. మనస్సుపై అంకుశం పడుతుంది.

రెండవ పక్షం అంతరంగానికి సంబంధించినది. ఇందులో చిందరవందరగా ఉన్న మనస్సును, ప్రాణాన్ని సంయమశీలిగా చేయడం జరుగుతుంది. చెడు సంస్కారములను కడిగివేయవలసి ఉంటుంది. ఆలోచనలను ఉత్కృష్టంగా చేసుకోవలసి వస్తుంది. ధ్యానంలో అనేక విధానాలు ఉన్నాయి. అవి అన్నీ అంతరంగ యోగం క్రిందికి వస్తాయి.

ధ్యానంలో ఏదైనా రూపముపై భక్తి భావాన్ని ప్రకటించి, దానికి దగ్గర కావడానికి ప్రయత్నించడం జరుగుతుంది. నాద యోగం, సోహం సాధనలో ధ్వని-ఖేచరీ ముద్రలో సోమరస రసాస్వాదన చేయబడుతుంది. చక్రబేధన, కుండలినీ ఉద్ధానము, గ్రంథి బేధనం వంటి ధ్యాన ప్రధాన అభ్యాసములు కూడా అంతరంగ యోగంలోనే లెక్కించబడతాయి. ఎందుకంటే వీటిలో ఆలోచనలకే దిశ ఇవ్వవలసి వస్తుంది.

క్రియాయోగం యొక్క పరిధి శరీరంలో పనిచేసే సామాన్యమైన అతీంద్రియ సామర్థ్యముల వరకే పరిమితం. ఇంద్రియములు స్థూలమైనవి. అవి శారీరిక అవయవముల లోకి వస్తాయి. వాటి శక్తి సామర్థ్యములు కూడా స్థూలంగానే ఉంటాయి. ఇంద్రియ క్షమతలను సూక్ష్మీకరణం చేయడం వలన మస్తిష్కం యొక్క జ్ఞానతంతువులు ఇంద్రియముల సహాయం లేకుండానే తమ పని తాము చేసుకోగలిగే దారి తయారు

**నమ్రతగా మాట్లాడాలి**

చేసుకోగలవు. కళ్ళు లేకపోయినా వేళ్ళతో తాకి అక్షరముల, వస్తువుల జ్ఞానము ప్రాప్తించుకోవచ్చు. పరా మనో విజ్ఞానంలో అంతర్గతంగా దూరశ్రవణం, దూరదర్శనం, ఇతరుల ఆలోచనలను తెలుసుకోవడం మొదలైనవి అతీంద్రియ సామర్థ్యములుగా భావిస్తారు. ఇవి అన్నీ మస్తిష్కం యొక్క ఆటలే. దీనిలో ప్రత్యక్ష మాధ్యమం (ఇంద్రియములు) లేకుండానే వేడి, శబ్దం, వెలుగుల ధ్వని తరంగములను గుర్తు పట్టడం, పట్టుకోగలిగే సామర్థ్యం హస్తగతమవుతుంది. వీటిని భౌతిక లాభములుగా, సఫలతలుగా చెప్పవచ్చు. ఈ ప్రత్యేకతలను ఆధ్యాత్మికమైనవిగా భావిస్తుంటారు. కానీ ఇవి అలాంటివి కావు. పరమాత్మ యొక్క క్రియాకలాపములు అలౌకికమైనవి, రహస్యమైనవి. ప్రఖ్యాత వైజ్ఞానికుడు ఐన్‌స్టీన్ ఏమన్నారంటే "పార్టికల్ ఫిజిక్స్" ఒక కుంటి సిద్ధాంతం. అది విరాటతత్వం యొక్క రహస్యాలను వివరించలేదు. సమస్త విశ్వబ్రహ్మాండం పైన ఒక విరాట్ చేతనత్వం ఉన్నది. ఈ చేతనత్వమును పరబ్రహ్మ అని, సృష్టికర్త అని, లేక విశ్వ సంచాలకుడని చెప్పవచ్చు. రిద్ధి సిద్ధులు ఈ సమిష్టిగత వ్యవస్థ యొక్క అద్భుత క్రియాకలాపములలో ఒక చిన్న విషయమే.

దార్శనికుడు సర్ జేమ్స్‌జీన్స్ కూడా భౌతిక జగత్తు యొక్క సమస్త సంఘటనలు ఒక ప్రణాళికాబద్ధంగా జరుగుతాయని అంటాడు. మనం దేనిని సంయోగం అని అంటామో అది వాస్తవానికి ఒక మహా గణితజ్ఞుడు, అతి సమర్థవంతమైన అదృశ్యశక్తి యొక్క క్రియాకలాపం మాత్రమే. దానిని పరమేశ్వరుడని చెప్పాలి. ఈ జగత్తు యాంత్రికమైన జడం కాదు. ఎందుకంటే దీనిలోని ప్రతి వస్తువు, ప్రతి ప్రాణి ప్రతి జీవజంతువులో చేతనత్వం ఉన్నది, ఆ చేతనత్వం క్రియాశీలమై (active) ఉన్నది. ఈ సమిష్టిగత సత్తాతో వ్యష్టి సత్తా ఎప్పుడయితే సరిగ్గా కలుస్తుందో దానిని యోగమని (harmony) చెప్పవచ్చు.

మహాభారతంలోని అశ్వమేధ పర్వంలో ఒక వర్ణన ఉన్నది. అందులో దివ్యదృష్టి కలిగిన సిద్ధ పురుషుడు తన దివ్య చక్షువులచే జీవుల చేత శరీరత్యాగం చేయించడం, మరల వారి చేత శరీరాన్ని ధరింపచేయడం లేదా ఇతర యోనులలో ప్రవేశింప చేయటం చూడవచ్చు. ఆత్మబల సంపన్నులు సూక్ష్మశరీర ధారియైన ఆత్మల మనుష్యుల మధ్య సద్భావం, సహయోగం స్థాపించగలరు. పరోక్ష జగత్తుతో నేరుగా సంబంధం ఏర్పరచుకున్న వారికి త్రికాల జ్ఞానం స్వంతమవుతుంది.

ఇది సమయాన్ని కట్టిపడేసే సిద్ధి. ఇది జాగృత కుండలినీ సాధన ఫలస్వరూపంగా కనిపిస్తుంది. అటువంటి వ్యక్తి జీవన-మరణ బంధనం నుండి కూడా ముక్తి చెందుతారు. సంత్ జ్ఞానేశ్వరుని సమకాలికుడైన చాంగ్‌దేవ్ యొక్క వయస్సు యోగసాధనా బలం వలన 400 సంవత్సరముల కన్నా ఎక్కువ. తరువాత జ్ఞానేశ్వరుని సలహా మేరకు సమాధి అయ్యారు. సూక్ష్మశరీరధారి అయిన మా గురుదేవులు దుర్గమ హిమాలయములలో ఉంటారు. వారి వయస్సుకు పరిమితి లేదు.

త్రైలింగస్వామి వారణాసిలో 280 సంవత్సరాల వయస్సులో 1944 సంవత్సరంలో శరీరాన్ని త్యాగం చేశారు. ఆయన 1664 సంవత్సరంలో ఒక బ్రాహ్మణ జమీందారిలో జన్మించారు. ఆయన పుష్కర క్షేత్రంలో భగీరథ స్వామి నుండి దీక్ష తీసుకున్నారు. గురువుగారు ఆయనకి ఇచ్చిన పేరు గణపతి స్వామి. కానీ త్రైలింగస్వామిగా ఖ్యాతిగాంచారు. ఆయన మహా సాధకుడు, లోక సేవకుడు. ఆయన జీవితంలో చమత్కారములు కోకొల్లలు. స్వామి వివేకానంద కూడా ఆయన గురించి వ్రాశారు.

ఆయన దయానంద సరస్వతి సమయంలో కూడా ఉన్నారు, యోగ సాధనలో చరమస్థితిని ప్రాప్తించుకున్నారు, అగణిత సిద్ధులకు స్వామి అయ్యారు. ఒకసారి ఇలా జరిగింది. త్రైలింగ స్వామి నేపాల్‌లోని అడవులలో తపస్సు చేసుకుంటున్నారు. నేపాల్ రాజు సేనాపతితో సహా వేటకు బయలుదేరారు. ఆ వేటలో దెబ్బతిన్న ఒక పులి పారిపోయింది. సేనాపతి దానిని వెంట తరుముకుంటూపోయాడు. ఆ పులి త్రైలింగ స్వామి ఆశ్రమం లోనికి వెళ్ళి స్వామి చరణాలపై తలపెట్టి కూర్చున్నది. స్వామి దానిని చేతితో నిమురుతున్నారు. వెనుక వచ్చిన సేనాపతి, రాజు ఆ దృశ్యాన్ని చూచి నిశ్చేష్టులయ్యారు.

ఈ సంఘటన ఒక కథలాగా చెప్పుకోవడానికి మాత్రమే కాదు. తపశ్చర్య ద్వారా ఆర్జించిన సామర్థ్యంతో అదృశ్యంగా ప్రవహిస్తున్న ప్రవాహాల దిశను మార్చవచ్చు. భవిష్యత్తును మార్చవచ్చు. జరుగవు అన్నవాటిని జరిపించవచ్చు. శాపం, వరదానం అనే శక్తులు దేవతల చేతులలో ఉన్నాయని

**ఒక చెడు అలవాటు పోవాలంటే దాని స్థానంలో ఒక మంచి అలవాటు చేసుకోవాలి**

భావిస్తుంటారు. కానీ ఉన్నతస్థాయికి చేరిన యోగులు తపస్వులు, సిద్ధ పురుషులు కూడా ఇలా చెయ్యగలరు. విద్యుచ్ఛక్తి ప్రవహిస్తున్న తీగకు ఇంకొక తీగను కలిపితే దానిలో కూడా విద్యుచ్ఛక్తి ప్రవహిస్తుంది. పరబ్రహ్మ యొక్క దైవీశక్తులతో ఎవరు జోడింపబడ్డారో అతను పరబ్రహ్మతో సమతుల్యులు అవుతారు. అతను పరబ్రహ్మ దైవీశక్తులు నివాసముండే ప్రదేశానికి ప్రవేశించగలడు. పరబ్రహ్మతో భాగస్వామి కాగలడు.

బహిరంగ యోగం, క్రియా యోగం సంబంధం దృశ్య జగత్తుతో ఉంటుంది. దీనితో వస్తువులను ఎత్తవచ్చు, కదిలించవచ్చు. పెద్దవి చేయవచ్చు. చిన్నవి చేయవచ్చు. వస్తువులను మాయం చేయవచ్చు లేక కనిపించేటట్టు చేయవచ్చు. కానీ ఎవరి అంతఃకరణలోనికి లోతుగా ప్రవేశించలేదు. నికృష్ట మార్గంలో వెళ్ళి పతనం చెందడం ఎవరికైనా సంభవమే. దొంగ, వ్యభిచారి, జూదరి, వ్యసనపరుడు కావచ్చు. కానీ ఉన్నతికి వెళ్ళడం, బంధనముల నుండి ముక్తి చెందడం వేరే విషయం. శబ్దబేధి బాణం లక్ష్యాన్ని ఛేదిస్తుంది. బాణం వదిలితే ఏ దిశలోనైనా చాలాదూరం వెళ్తుంది కానీ దానిపై నియంత్రణ ఉండదు. ప్రయోగం ఉపసంహారం, దానిని నియంత్రించడం బాగా సాధన చేసిన అనుభవజ్ఞుడికి మాత్రమే సాధ్యమవుతుంది. ఎవరైనా రాయిను బాగా పైకి విసిరవచ్చు. కానీ పృథ్వికి బాగా పైకి వెళ్ళి దానిని కవచాలను ఛేధించి అంతరిక్షంలోనికి పోవాలంటే బహుమూల్యమైన రాకెట్లకు మాత్రమే సంభవం. ఆంతరంగిక యోగం ద్వారా ఆత్మను పరమాత్మతో జోడింపబడిన సంబంధం అలౌకికమైన రిద్ధి సిద్ధులను పరిచయం చేయగలుగు తుంది. సిద్ధ పురుషులను దేవమానవులని కూడా అంటారు. వారి వివేకంతో కూడిన దయ ఎవరినైనా ఎత్తుకు లేపగలదు, సుఖంగా ఉంచగలదు. ఇటువంటి వారే ఉన్నత స్థాయికి చెందిన సిద్ధులను పొందగలరు.

దృశ్యజగత్తువలె అదృశ్యజగత్తు కూడా ఉన్నది. ఈ అదృశ్య జగత్తు స్వప్నంలో, నిర్వికల్ప సమాధిలో అనుభవం లోనికి వస్తుంది. శాస్త్రకారులు దీనిని లోకలోకాంతరమని అంటారు. అది సూక్ష్మస్థాయికి చెందినది. అదృశ్యస్థాయికి చెందినది. ఆకాశంలో కనుపించే గ్రహనక్షత్రాలలో స్వర్గము, నరకం, బ్రహ్మలోకం, కైలాసమువంటివి లేవు. సప్తలోకములు కలిగిన బ్రహ్మాండ స్థితి అదృశ్యంగా ఉన్నది. వాటిని నేత్రముల ద్వారా లేదా ఇతర పరికరముల ద్వారా తెలుసుకోలేము. ఈ అదృశ్య లోకములలో అదృశ్యస్థాయికి చెందిన దేవతలు, పితరులు, సిద్ధులు, ముక్తులు నివాసముంటారు. అక్కడి పరిస్థితి పదార్థ పరమైనది కాదు, సంవేదనాత్మకమైనది. ఆ వాతావరణంలో నివసించే వారు ఆనందంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా, తృప్తిగా, తుష్టితో, శాంతితో ప్రతిక్షణం ఉంటారు. ఈ లోకంలోనే జీవన ముక్తులు ఉంటారు. బ్రహ్మప్రేరణతో ప్రేరేపించబడి, ప్రపంచంలో అసంతులనాన్ని సంతులంగా మార్చడానికి సమయానుసారం వారు మహాపురుషులుగా, ఉద్ధారకులుగా, అవతార పురుషులుగా, సంస్కర్తలుగా వస్తుంటారు. వారి దృశ్యమాన (కనుపించే) శరీరం అభీష్ఠ ప్రయోజనములు పూర్తి అయ్యేవరకు కార్యరతులు అవుతాయి. తరువాత అదృశ్యమయిపోతాయి. ఈ పరివారం చిన్నదేమీ కాదు. ఈ ప్రపంచంలో ఎంతమంది మనుష్యులు ఉన్నారో ఆ అదృశ్యలోకంలో అదృశ్యంగా జీవించేవారి సంఖ్య తక్కువేమి కాదు. ఈ లోకంలో ప్రజలకు తమతమ పద్ధతులను అనుసరించి ఎలా సంపదలు ప్రతిభలు ఉంటాయో, అదే విధంగా అదృశ్యలోకాలలో అదృశ్య ఆత్మలు తమతమ స్థాయి అనుసరించి అగణిత విభూతులు, సిద్ధులు, దివ్య సంపదలు ఉంటాయి. ఈ వైభవాలను వారు దాచిపెట్టుకోరు. సత్పాత్రులను సత్ప్రయోజనముల కొరకు ఉదారంగా పంచిపెడతారు.

వివేకానందుని ఆత్మ తనకు ఎన్నో ప్రేరణలను ఇచ్చిందని అరవిందులు చెప్పారు. 1901 సంవత్సరంలో రామకృష్ణ పరమహంస ఆత్మ వారిని సమిష్ఠిగత సాధన కొరకు ప్రేరణ ఇచ్చింది. శ్రీ మాత కూడా ఏదో అదృశ్య సత్తా ప్రేరణతోనే పాండిచ్చేరిలో ఆయన దగ్గరకు వచ్చింది. సుకరాత్ తన దగ్గర ఒక దయ్యం ఉందని తన పనులన్నీ చేస్తుందని ఎప్పుడూ చెప్తుండేవారు. తాను చేసిన సత్కార్యాల గొప్పదనాన్ని ఆ దయ్యానికే ఆపాదించారు.

ప్రముఖ థియోఫిసిస్ట్, అన్వేషకుడు సి.డబ్ల్యూ. లెడ్‌బీటర్ జీవితమంతా పరోక్ష జగత్తు మీద రీసెర్చి చేస్తుండేవారు. ఆయన కథనం ప్రకారం పితరులు సజ్జనులను, పిల్లలను ఆపదలో ఆదుకునేవారు, వారికి అనేక విధాలుగా లాభం చేకూర్చేవారు. ఒకసారి ఒక ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. ఇల్లంతా కాలిపోయింది. ఆ ఇంట్లో ఒక చిన్నపిల్లవాడు గాఢనిద్ర

**ఈనాటి అలవాటే రేపటి వ్యసనం**

పోతున్నాడు. కానీ అతను రక్షింపబడ్డాడు. ఒక దివ్యతేజస్సు అతనిని రక్షించింది. (Invisible Helpers by C.W. Lead Beater పుస్తకంలో ఇలాంటి అనేక సంఘటనలు వివరించ బడినాయి) 1958లో ప్రసిద్ధ రచయిత, బెర్నార్డ్ హటన్ రచించిన "హీలింగ్ హాండ్స్" అనే పుస్తకంలో ఒక సంఘటన వివరింపబడినది. బెర్నార్డ్ హటన్ కంటిచూపు పోయి గుడ్డి వాడయ్యాడు. డాక్టర్లందరు చూపు రాదన్నారు. స్వర్గీయ డా॥లేంగ్ యొక్క ప్రేతాత్మ చేప్‌మెన్ అనే వ్యక్తి మాధ్యమంగా చేసుకుని అసాధ్య నేత్ర రోగములను ఆపరేషన్ ద్వారా నయం చేస్తున్నదని తెలిసింది. అతను అక్కడికి వెళ్ళాడు. చేప్‌మన్ కళ్ళకు గంతలు కట్టుకుని ఆపరేషన్ చేశాడు. హటన్‌కు కంటి చూపు తిరిగి వచ్చింది.

దీనివలన మనకు అర్థమయ్యేదేమిటంటే అంతర్‌యోగ సాధకుడు తన అంతరాత్మను ఎంత స్వచ్ఛంగా, ఎంత తేలికగా, ఎంత తీక్షణంగా చేసుకుంటాడంటే, దాని ద్వారా అదృశ్య జగత్తులోనికి తేలికగా చేరుకోగలడు. శరీరాన్ని ధరించినప్పటికి కూడా తన సూక్ష్మకారణ శరీరాలను దివ్యలోకముల వరకు పంపించగలుగుతాడు. తన అవసరానికి కావలసిన దివ్య ప్రభావములను వెతకగలుగుతాడు. అభీష్ట అనుదానములను తేలికగా హస్తగతం చేసుకోగలుగుతాడు. యోగసాధన యొక్క ప్రథమ చరణము ఆత్మశోధన. దాని తరువాత సిద్ధ పురుషుల అనుదానములు సహజంగా ప్రాప్తిస్తాయి. ఈ అనుదానము లతో ఆత్మకళ్యాణం, లోకకళ్యాణం చేయగలుగుతాడు. ఈ విధంగా తను ధన్యుడవుతాడు, ఇతరులను ధన్యులను చేయగలుగుతాడు. కుండలినీ సాధన ఫలశృతి ఈ తథ్యంపై ఆధారపడి ఉన్నది.

*- అఖండజ్యోతి, జనవరి 1987*

---

## పరమ వందనీయ మాతాజీ : సాక్షాత్తు అన్నపూర్ణదేవి

*ఇది 1967-68 కాలము నాటి మాట. గుజరాత్ రాష్ట్రంలోని భావనగర్ మరియు రాజకోట మధ్య యజ్ఞాన్ని నిర్వహించుటకై ఒక పర్యాయం పూజ్య గురుదేవులతో కలసి, వందనీయ మాతాజీ వెళ్ళారు. పూజ్య గురుదేవుల మిషన్ పట్ల ప్రజలలో శ్రద్ధాసక్తులు అధిక స్థాయిలో ఉండుటచే, ఈ పవిత్ర మూర్తులు ఎచ్చటికి వెళితే అచ్చట అత్యధిక సంఖ్యలో ప్రజలు వారి దర్శనార్థమై వచ్చేవారు.*

*ఒకరోజున ఒక అతి సామాన్యుని ఇంట భోజన ప్రసాద వితరణ ఏర్పాటు చేయుట జరిగింది. గురుయుగ్మం అచ్చటికి చేరుకునే సరికి అత్యధిక సంఖ్యలో ప్రజలు వీరి దర్శనార్థమై వచ్చారు. మాతాజీ సాక్షాత్తు అన్నపూర్ణాదేవి ప్రతిరూపం. తన బిడ్డలందరు భోజనం చేసిన తర్వాత మాత్రమే, మాతాజీ భోజన ప్రసాదములు స్వీకరించేది. తత్ఫలితంగా హాజరైన జనులందరికి భోజనానికి ఏర్పాట్లు చేయవలసిందిగా ఆదేశించింది.*

*మాతాజీ స్వయంగా భోజనశాలలోనికి విచ్చేసి చూడగా, అచ్చట 8 నుండి 9 మందికి సరిపడా భోజనం మాత్రమే ఉన్నది. పరిస్థితిని గమనించిన మాతాజీ, పూజ్యగురుదేవుల వంక చిరునవ్వు సారించి, ఇలా అన్నది - "మొదట అందరు భోజనానికి కూర్చోండి, తరువాత మేము భోజనం చేస్తాం" పూజ్య గురుదేవులు కూడా చిరునవ్వుతో స్పందించారు.*

*ఎచ్చటైతే భోజన సామాగ్రి ఉన్నదో అచ్చట మాతాజీ ఒక దీపాన్ని వెలిగించారు. ఆ తరువాత అందరికి వడ్డించమని చెప్పారు.*

*భోజనము ఒక్కొక్కరికి వడ్డించసాగారు. దాదాపు 200 మంది భోజనం చేశారు. గురుయుగ్మమును దర్శించి అందరూ వెళ్ళిపోయారు. గురుయుగ్మం కూడా భోజనాన్ని స్వీకరించారు. ఆ తరువాత వంటశాలలోనికి వెళ్ళి చూడగా, అందరూ భోజనం చేసిన తరువాత కూడా, మొదట ఉన్న 8-9 మందికి సరిపడా భోజనం అలాగే ఉన్నది.*

*- హిందీ మూలం: ప్రజ్ఞా అభియాయన్ - 16 సెప్టెంబర్ 2013*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

---

**ముందు తమని తాము బాగుచేసుకోకుండా ప్రపంచాన్ని బాగుచేద్దామంటే ఎలా?**

స్వామి వివేకానంద జయంతి ప్రత్యేకం

# లోకసేవా పరాయణుడు - వివేకానందుడు

దేశవిదేశాల్లో శ్రీరామకృష్ణ మిషన్ పేరుతో లోకసేవ అనే మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించిన స్వామి వివేకానందుని అసలు పేరు నరేంద్రనాథ్. ఆయన కలకత్తాలో 1863లో జనవరి 12వ తేదీన విశ్వనాథదత్తుగారి కుమారునిగా జన్మించారు.

ప్రాథమిక విద్యాభ్యాసమంతా ఇంటివద్దనే పూర్తిచేసిన తరువాత విద్యాభ్యాసానికై కలకత్తాలోని మెట్రోపాలిటన్ ఇన్స్టిట్యూట్‌లో చేరారు. ఆయన మొదటి నుండి విద్యాభ్యాసంలో అపారమైన తెలివితేటలను, ఏకాగ్రతను కనపరచేవారు. ఆయన ఏది చదివినా మనస్సు లగ్నంచేసి చదివేవారు, ఏ అంశమైనా సరే పూర్తిగా అర్థమై హృదయానికి పట్టేంత వరకు వదిలిపెట్టేవారు కారు.



బాలవివేకానందుడు కలకత్తాలో మెట్రిక్ పరీక్షకు సిద్ధమౌతున్నప్పుడు చాలా జబ్బు చేసింది. ఆ స్థితిలో కూడా ఆయన తన అధ్యయనాన్ని కొనసాగిస్తుండే వాడు. అందువల్ల ఆయన ఆరోగ్యం మరీ క్షీణించింది. అది చూసి ఆయన అధ్యాపకులు చాలా బాధపడి 'నరేంద్రా! నీ ఆరోగ్యం బాగా పాడైంది, ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలంటే నీవు కొంతకాలం చదువు ఆపివేసి విశ్రాంతి తీసుకో' అని సూచించారు.

వివేకానందుడు ఇంటికి వెళ్ళి అధ్యాపకుడు తనకు చెప్పిన మాటలనే తన తల్లికి చెప్పాడు. అలా చెప్తున్నప్పుడు ఆయన ముఖంలోని నిరాశను, కళ్ళల్లో తిరుగుతున్న నీటిని చూసి తల్లి ఇలా అంది-'ఇందులో నిరాశపడవలసినది ఏముంది? ఇప్పుడు నీకు వయస్సు ఎంతని, కొన్ని రోజులు విశ్రాంతి తీసుకొని ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకునే ప్రయత్నం చెయ్యి' అంది.

వివేకానందుని తండ్రిగారు ఆ సమయంలో మధ్యప్రదేశ్‌లో ఉద్యోగం చేసేవారు. ఆయన నరేంద్రుని తన వద్దకు పిలిపించుకున్నారు. తండ్రిగారు నరేంద్రుని ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్త వహించారు. దానితో ఆయన ఆరోగ్యం మెల్లిమెల్లిగా కుదుటపడడం మొదలైంది. అప్పుడు తండ్రిగారే స్వయంగా నరేంద్రుని కొద్దికొద్దిగా చదివించడం ప్రారంభించారు, కారణమేమంటే అభ్యాసం చేయకపోతే నేర్చుకున్న విద్య కూడా పోతుంది.

రెండు సంవత్సరాలు నరేంద్రుని తన వద్దనే ఉంచుకొని ఆరోగ్యాన్ని, విద్యను బాగా మెరుగుపరచిన తరువాత శ్రీవిశ్వనాథదత్తు గారు పిల్లవాడిని తిరిగి చదివించేందుకై కలకత్తాలోని మెట్రోపాలిటన్ ఇన్స్టిట్యూట్‌లో చేర్పించారు. కానీ ఈ ఆరోగ్యసమస్యల వల్ల నరేంద్రుని చదువు రెండు సంవత్సరాలు వెనుకపడింది. అది నరేంద్రునికి చాలా బాధ కలిగించింది. కానీ గడిచిన కాలం తిరిగిరాదు కదా! అయితే ఆ నష్టాన్ని పూరించేందుకు ఏదైనా ఉపాయం ఆలోచించ వచ్చును. అలా ఆలోచించి నరేంద్రుడు ఆరోగ్యానికి ఏ మాత్రం ఇబ్బంది కలుగని రీతిలో కొన్ని నియమాలు పాటిస్తూ రోజువారీ పడేశ్రమకంటే కొద్దిగా ఎక్కువగా శ్రమపడాలని నిర్ణయించుకున్నాడు.

ఇప్పుడు నరేంద్రునికి 16 సంవత్సరాల ప్రాయము. మెట్రిక్ పరీక్షల్లో ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలనే పట్టుదలతో చాలా సంయమనముతో, సంతులనముతో కష్టపడి చదువుతున్నాడు. చివరికి ఆయన ప్రయత్నం ఫలించి సర్వప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు.

మెట్రిక్ పాసైన తరువాత నరేంద్రుడు కాలేజీలోకి ప్రవేశించాడు. జ్ఞానం యొక్క లోతుల్లోకి ప్రవేశించే సమయం దగ్గరపడిందని ఆయన హృదయం పులకించింది. 'నేను నా జ్ఞానమును ప్రపంచంలోని అంధకారాన్ని దూరం చేసేందుకు జీవితంలోని ప్రతిక్షణాన్ని వినియోగిస్తాను' అనుకున్నాడు. ఈ శుభసంకల్పం యొక్క అనుభూతి నరేంద్రుని హృదయంలో బాధ్యత అనే భావాన్ని నిద్రలేపింది. దాంతో ఆయన మానసిక స్థితి సామాన్యస్థాయి నుండి అసామాన్యస్థాయికి పెరిగిపోయింది. ఆయనకు ఆత్మయందు మహానత అనే భావం వల్ల ఒళ్ళు గగుర్పాటు పొందడం, మనస్సంతా కళ్యాణకారక భావాలు వెల్లువెత్తడం మొదలైంది.

**మనిషి సంతోషంగా ఉంటే దానినే ప్రపంచానికి పంచుతాడు**

లోకకళ్యాణము కొరకు ఏ జ్ఞానమైతే అవసరమని నరేంద్రుడు భావించాడో దాన్ని పొందేందుకు భారతీయ దర్శనాలను, పాశ్చాత్య దర్శనాలను అధ్యయనం చేశాడు. చాలా సంవత్సరాలు దర్శనశాస్త్రాలు చదవడంలోనే గడిచిపోయాయి. అప్పుడు ఆయనకు ఆంగ్లేయులు మన భారతీయ తత్త్వజ్ఞానాన్ని, బుద్ధిశక్తిని చులకన చేసి ప్రపంచంలో భారతదేశానికి హేయమైన స్థానాన్ని కల్పించేందుకై ప్రయత్నిస్తున్నారని అర్థమైంది. భారతీయ తత్త్వజ్ఞానమే ప్రపంచంలో అన్నింటికంటే సత్యమైనది, నిత్యమైనది, అత్యధిక శ్రేష్టతను కలిగినది. ఇది అర్థమయ్యాక ఆయన భారతీయ తత్త్వజ్ఞానాన్ని ప్రపంచానికి, ఆంగ్లేయులకు తెలియచేసి భారతీయులపై జరుగుతున్న కుట్రను నిర్మూలించాలి అని అనుకున్నాడు. ఆంగ్లేయులు భారతీయులను జడులుగా, అంధవిశ్వాసపరులుగా, అవివేకులుగా, స్వరాజ్యానికి అనర్హులుగా చూపించి, ప్రపంచాన్ని నమ్మించి ప్రపంచలోని వారంతా భారతీయుల పక్షాన నిలబడకుండా ఉండేందుకై ప్రయత్నించారు.

అంతకుముందుగా ప్రపంచానికి భారతీయత యొక్క వెలుగును పరిచయం చేసేందుకై ఆధ్యాత్మిక అభియానమును ప్రారంభించాలనుకున్నాడు. అందుకొరకు సుయోగ్యుడైన గురువు యొక్క నీడన యోగాభ్యాసము చేసి తద్వారా తన ఆత్మను, జ్ఞానమును నిరూపించుకోదలచారు. ఆ విధంగా స్వామి వివేకానంద రామకృష్ణ పరమహంసను శరణుపొంది ఆయన కృపతో తేజస్సును-సంపూర్ణ తపస్సుతో జ్ఞానసాగరమును కూడా తన ఆత్మయందు నింపుకున్నాడు.

ఇప్పటివరకు నరేంద్రనాధుడు గురువు యొక్క సమ్ముఖములో విద్యార్థిగానే ఉన్నాడు. గురుదేవులు శరీరమును త్యజించిన తరువాత వివేకానందునిగా మారిపోయారు. గురువు పట్ల స్వామి వివేకానందుని అనన్యశ్రద్ధ ఆయనను శ్రీరామకృష్ణ పరమహంస చేతిలో యువసంస్కర్తగా మారేందుకు తోడ్పడింది. అది చూసిన చాలామంది యువత ప్రేరితులై దేశానికి-ధర్మానికి సేవ చేసేందుకై తపస్వులుగా మారిపోయారు.

వివేకానందులవారు దీనులు-దుఃఖితులు, అనాధలు, విధవల సేవ చేసేందుకు ముందుకురావలసినదిగా పిలుపునిచ్చారు. అందుకొరకై అనేక మఠాలు స్థాపించారు. అందులో ఎక్కడా ఆశ్రయం దొరకని వారికి ఆశ్రయం ఇవ్వడం, శిష్యులకు, లోకసేవకులకు శిక్షణను ఇచ్చి ప్రావీణ్యులను చేస్తుండేవారు. మహత్తర జ్ఞానానికి సాకారరూపమైన వివేకానందులవారు ఏకాంతసాధనలో లభించే ఆత్మానందాన్ని అంగీకరించలేదు సరికదా అసలైన యోగికి, నిజమైన పరమార్థపరాయణునికి లోకకళ్యాణము కంటే పరమ పదము గొప్ప విలువైనది కాదు అని నిరూపించారు.

1888లో స్వామివివేకానంద శ్రీరామకృష్ణమఠ కార్యకలాపాలన్నింటిని మిగిలిన గురుసోదరులకు అప్పగించి ఆయన తన జీవితానికి నిర్ధారించుకున్న పని పూర్తిచేసేందుకై బయలుదేరారు. అందులో మొట్టమొదటి కార్యక్రమమేమంటే దేశమంతా ఒక్కసారి పర్యటించి ప్రజల యొక్క దశను, ప్రవృత్తులను అధ్యయనం చేసి వారిని ఉద్ధరించి ప్రగతిపథంలో ముందుకు నడిపేందుకు ఒక మార్గాన్ని నిర్ధారించుకోవాలను కున్నారు. ఆయన తన యాత్రను వ్రజభూమి నుండి మొదలుపెట్టి రాజస్థాన్, గుజరాత్, బొంబాయి, మద్రాసులో కొంత భాగం నడక ద్వారా, అక్కడక్కడా రైలుద్వారా ప్రయాణించి కన్యాకుమారికి చేరుకున్నారు. ఈ యాత్రకు దాదాపు 4 సంవత్సరాలు పట్టింది. త్రోవలో ఆయనకు రాజులు, మహారాజులు, సామాన్యప్రజలతో పరిచయం ఏర్పడింది. అన్నిరకాల భేదములను త్యజించి అందరినీ సమానభావనతో చూసేందుకు చక్కని అవకాశం లభించింది. అందరినీ సమదృష్టితో చూడడమే సన్యాసి యొక్క ధర్మం. స్వామీజీ సన్యాసం స్వీకరించారు కానీ దాన్ని ఆచరించేందుకు బృందావనానికి వెళ్ళే త్రోవలోనే వీలు కలిగింది. బృందావనానికి వెళ్తున్న త్రోవలో ఒక వ్యక్తి హుక్కా పీలుస్తూ కనిపించాడు. వెంటనే స్వామీజీకి కూడా హుక్కా పీల్చాలనిపించింది. వెంటనే అతని వద్దకు వెళ్ళి తనకు కూడా చిలిమ్ కావాలని అడిగారు. అందుకతడు తాను పాకీపని చేసేవాడినని చెప్పగానే స్వామీజీకి కొద్దిపాటి సంకోచం కలిగింది. దాంతో కొంతదూరం ముందుకు పోయారు. కొద్ది క్షణాల తరువాత ఆయనకు పాకీవాడిని నీచజాతివాడని అంగీకరించిన తనది సన్యాసమేనా? అని అనిపించి వెంటనే వెనక్కు వచ్చి అతడినుండి వినయంగా చిలిమ్ అడిగి తీసుకొని పీల్చారు.

ఈ విధంగా పర్యటిస్తున్న ఆయనకు ఒక గ్రామంలో మూడురోజుల పాటు అన్నపానీయాలు లభించలేదు. ఆయన స్థితిని గమనించిన ఒక వృద్ధ మాదిగ వ్యక్తి ఆయన వద్దకు వెళ్ళి భోజన విషయమై ప్రశ్నించాడు. తాను ఏమీ తినలేదని వీలుంటే కొన్ని రొట్టెలు తెచ్చిపెట్టమని స్వామీజీ అడిగారు. అందుకతను తాను మాదిగవాడినని స్వామీజీకి తను భోజనం

**అతి ముఖ్యమైన బాధ్యత తనను తాను తీర్చిదిద్దుకోవడం**

పెట్టానని ఊళ్ళో తెలిస్తే తనను ఊరినుండి వెళ్ళగొడతారని చెప్పాడు. స్వామీజీ అతనిని భయపడవద్దని అందుకు తనది బాధ్యత అని భరోసా ఇచ్చిన తరువాతనే అతను స్వామీజీకి భోజనం తెచ్చిపెట్టాడు. కొద్దిరోజుల తరువాత ఆ రాజ్యమేలే రాజువద్దకు స్వామీజీ ఆతిథ్యం స్వీకరించేందుకై వెళ్ళారు. అప్పుడు తనకెదురైన ఈ సంఘటన గురించి తెలిపారు. రాజు వెంటనే ఆ మాదిగవానిని పిలిపించారు. అతను చాలా భయపడి ఏడుస్తూ, క్షమించమని ప్రార్థించాడు. రాజు అతనికి ధైర్యం చెప్పి అతనికి మంచి బహుమతినివ్వడమే కాకుండా అతను జీవించి ఉన్నంతవరకు పోషణభారమంతా తానే వహించి అందుకవసరమైన ఏర్పాట్లు చేశారు.

స్వామివివేకానంద సౌరాష్ట్ర రాజ్యంలో పర్యటిస్తున్నప్పుడు 1893లో అమెరికాలోని చికాగోలో సర్వధర్మ పార్లమెంట్ జరగబోతున్నదని ఎవరో చెప్పారు. అప్పుడే ఆయన మనస్సులోకి ఒక ఆలోచన వచ్చింది. పరాధీనతలో ఉన్న భారతదేశం యొక్క ఆధ్యాత్మిక ప్రకాశాన్ని కనుక విదేశీయుల ధర్మవేదిక ద్వారా విభిన్న దేశాలకు ప్రసరింపచేస్తే అది చాలా గౌరవప్రదంగా ఉంటుందని భావించారు. ఒకరోజు కన్యాకుమారిని దర్శించి సముద్రపు ఒడ్డున కూర్చుని ఎగసిపడుతున్న అలలను చూస్తూ ఆనందిస్తున్న సమయంలో అక్కడ ఒక పెద్ద శిలాఖండం కనిపించింది. దానిపై కూర్చుని ఆయన ధ్యానంలోకి వెళ్ళిపోయారు. సాధన అయిపోయిన తరువాత చికాగో తప్పక వెళ్ళితీరాలనే దృఢసంకల్పం కలిగింది.

మద్రాసుకు వెళ్ళి ఈ సంకల్పాన్ని అందరిముందు ప్రకటించారు. చూస్తుండగానే నౌకలో చికాగో వెళ్ళవలసిన ఐతిహాసికయాత్రా సమయం రానే వచ్చింది. 1893 మే 31వ తేదీన ఆయన ఎక్కిన నౌక భారతదేశం నుండి వీడ్కోలు తీసుకుంది. ఆయన వెన్‌కువర్ చేరుకుని అక్కడి నుండి రైలులో చికాగోకు ప్రయాణించి యాత్రను సంపూర్ణం చేశారు. అక్కడికి చేరుకున్న తరువాత ఆయనకెదురైన పరిస్థితి చాలా నిరాశా జనకంగా కనిపించింది. స్వామీజీ కష్టాలను నిలువరించేవారే కానీ భయపడేవారు కాదు. ఒక్కోసారి చేతిలో ఒక్కపైసా కూడా లేకుండా రాత్రంతా ఆకలితో ఉండిపోయేవారు. చలి విపరీతంగా ఉండి, మంచు కురుస్తున్నప్పుడు ఆయన వద్ద కప్పుకునేందుకు కూడా ఏమీ లేక రోడ్డు ప్రక్కన ఉన్న కాలువపై పగిలిపోయి ఉన్న పైపుగొట్టంలో ఉండి చలినుండి కాపాడు కున్నారు. ఉదయాన్నే లేచి భిక్షకు వెళ్ళి భిక్ష అడిగితే పరాధీన దేశానికి చెందిన ఒక భారతీయ సాధువుకు ఎదురయ్యే అవమానాలు, అసభ్యపదాలు ఆయనను స్వాగతించాయి. వారంతా ఆయనకు సహాయం చేసే మాట అటుంచి కనీసం మాట్లాడేందుకు కూడా ఇష్టపడలేదు.

మద్రాసు ధర్మసమ్మేళనం సెప్టెంబర్ నెలలో జరుగుతుందని, అందులో పాల్గొనే వక్తల పేర్లు కూడా ముందుగానే రిజిస్టర్ అయిపోయాయని తెలిసింది. ఏదో ఒక గౌరవప్రదమైన, నమ్మకమైన సంస్థకు చెందిన ప్రతినిధులకు మాత్రమే అందులో పాల్గొనేందుకు అవకాశం ఉందని తెలిసింది. స్వామీజీకి అవేమీ లేవు, అయినా కార్యక్రమానికి ఇంకా రెండు నెలల వ్యవధి ఉంది. ఆయన వద్ద అక్కడ రెండు నెలలు ఉండేందుకు కావలసిన డబ్బు లేదు. ఆయన ఒక విశిష్టమైన వ్యక్తి కనుకనే అటువంటి కష్టస్థితిలో కూడా విచలితుడు కాలేదు. స్వభావరీత్యా కూడా ఆయన చాలా ఆశాజీవి, సాహసవంతుడు. బోస్టన్ అమెరికాలో ఒక ప్రాంతంలో నివసిస్తే చాలా తక్కువ ఖర్చు అవుతుందని తెలుసుకొని ఆయన అక్కడకు వెళ్ళారు. తన దగ్గరున్న కొద్దిపాటి డబ్బుతో అక్కడ కొన్ని రోజులు గడపవచ్చు, తరువాత సంగతి తరువాత చూసుకోవచ్చు అనుకున్నారు.

దేదీప్యమానమైన స్వామీజీ ముఖవర్చస్సు, మధురమైన ఆయన వాక్కు అందరినీ ఆయనవైపుకు ఆకర్షించింది. ఆయన వ్యక్తిత్వమే ఆకర్షణీయమైనది. రైలులో ఆయనతో పాటు ప్రయాణిస్తున్న సంపన్న కుటుంబానికి చెందిన ఒక యువతి ఆయన స్వభావాన్ని చూసి మంత్రముగ్ధురాలైంది. ఆమె వినతిని స్వీకరించి ఆమె నివసించే కృషిఫార్మ్‌మెటకాఫ్ అనే ప్రాంతానికి వెళ్ళి ఆమె ఆతిథ్యం కొద్ది రోజుల పాటు స్వీకరించవలసి వచ్చింది.

ఇప్పటివరకు స్వామీజీ పేరు సర్వమత పార్లమెంట్‌లో నమోదు చేయబడలేదు. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన గ్రీకు సాహిత్య ప్రాధ్యాపకుడైన ప్రొ॥ జాన్‌హెన్రీరైట్ మొదటిసారి స్వామీజీని కలిసినప్పుడు చాలా ప్రభావితుడైనాడు. అంతటి మహావిద్వాంసుడిని, ఆలోచనాపరుడిని జీవితంలో మొదటిసారి కలిశాననే భావం ఆయనకు కలిగింది. సర్వధర్మ పార్లమెంట్‌లో స్వామీజీ పాల్గొనాలని ఆయన తన పిలుపుగా విన్నవించారు. అక్కడ ప్రతినిధులను ఎంపికచేసే సమితికి అధ్యక్షుడు తనకు స్నేహితుడని చెప్పి స్వామీజీని ఆయనకు పరిచయం చేస్తూ – 'నా విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్లందరికంటే కంటే స్వామీజీ చాలా ఎక్కువ విద్వత్తు కలవారు' అని చెప్పాడు. చివరగా

**మనం చేసే పుణ్యకర్మలతో గతంలో మనం చేసిన పాపకర్మలు నశిస్తాయి**

స్వామీజీకి వీడ్కోలు చెప్తూ ప్రొఫెసర్ జాన్ చికాగో వరకు టిక్కెట్టు కూడా కొనిపెట్టారు.

1893 సెప్టెంబర్ 11 వతేదీ సోమవారం, చికాగోలోని కళాసంస్థాన్ యొక్క కొలంబస్ హాలులో సరిగ్గా ఉదయం 10 గంటలైంది. ఆశ్చర్యమేమంటే ఆ ధర్మవేదికపై 10 ధర్మాలకు చెందిన ప్రతినిధులు కొలువుతీరి కూర్చున్నారు. అది ప్రపంచ ఇతిహాసములోనే ఒక అద్భుత సంఘటన. వేదిక మీద మధ్యలో రోమన్ క్యాథలిక్ సంప్రదాయానికి చెందిన ఆచార్యుడు కార్డినల్ గివన్స్ కూర్చుని ఉన్నారు. ఆయనకు కుడివైపు రోమన్ క్యాథలిక్, ప్రొటెస్టెంట్, ప్రెస్బిటిరియన్ వంటి క్రీస్తుధర్మానికి చెందిన ఫాదర్‌లంతా నల్లని దుస్తులతో వచ్చారు. వారికి ఎడమవైపుకు తూర్పు దేశాలకు చెందిన ప్రతినిధులు రంగురంగుల దుస్తులను ధరించి ఆసీనులై కూర్చున్నారు. శ్రీలంక నుండి వచ్చిన ధర్మపాల్ అనే బౌద్ధభిక్షువు, జైనధర్మానికి సంబంధించి గాంధీజీ బంధువు ఒకరు ప్రతినిధిగా వచ్చారు. బ్రహ్మసమాజమునకు ప్రతినిధులుగా బెంగాల్‌కు చెందిన ప్రతాప్‌చంద్రమజుందార్, బొంబాయికి చెందిన నాగర్‌కర్‌లు వచ్చారు. థియోసఫీ సొసైటీకి ప్రతినిధులుగా శ్రీమతి అనిబిసెంట్, శ్రీచక్రవర్తి వచ్చారు. వీరందరి మధ్యలో అత్యంత ఆకర్షణీయంగా కనపడుతున్నవారు స్వామి వివేకానందులే.

వేదికనెక్కిన స్వామీజీ 'సిస్టర్స్ అండ్ బ్రదర్స్ ఆఫ్ అమెరికా' అని సంబోధించగానే హాలంతా కరతాళధ్వనులతో మారుమ్రోగి పోయింది. శ్రోతలంతా గౌరవసూచకంగా లేచి నిలబడ్డారు. అప్పటివరకు ఎంతోమంది చెప్పిన ఉపన్యాసాలు విన్నా కూడా ఆత్మీయతతో, మధురంగా స్వామీజీ పలికిన ఆ పలుకులు మరెవ్వరి ప్రసంగములోను వినపడలేదు. ఇంకా తానేమీ మాట్లాడకపోయినా ప్రజాసమూహము నుండి వస్తున్న ఆ కరతాళధ్వనులు, హర్షాతిరేకాలు చూసి స్వామీజీ ఆశ్చర్య పోయారు. స్వామీజీ యొక్క ఈ ప్రథమఉపన్యాసము చాలా సంక్షిప్తంగా ఉన్నది. మామూలు మాటల్లో చెప్పాలంటే పరాధీన దేశానికి చెందిన వెనకబడ్డ ఒక వ్యక్తి ఒక సుశిక్షిత సమాజము ముందు తన మాటలను ఎలా వినిపించగలడు? అనేది పాశ్చాత్యుల అభిప్రాయం. కానీ ఆయన ఒక చిన్న మాటతోనే అటువంటివారంతా తమ అభిప్రాయాలను మార్చుకునేలా చేశారు.

స్వామీజీ ఇలా చెప్పారు – 'ఏ విధంగా విభిన్న ఉద్గమ స్థానాల నుండి వెలువడుతూ, విభిన్న మార్గాల ద్వారా ప్రయాణించే నదులు అన్నీ సముద్రంలో ఎలా కలిసిపోతాయో, అదేవిధంగా మన యొక్క అభిరుచులలో ఉన్న విభిన్నతల కారణంగా ఎత్తుపల్లాలున్న మార్గం ద్వారాను, సరైన మార్గం ద్వారాను నడిచి మనం చేరుకునేది ఆ పరమతత్వము దగ్గరకే'. ఆ తరువాత స్వామీజీ ఉపన్యాసాలు వినేందుకై వేలమైళ్ళ దూరంనుండి ప్రజలు రావడం మొదలైంది. వారందరు స్వామీజీ ప్రసంగం ఎప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూడడం మొదలుపెట్టారు. పార్లమెంట్ వ్యవస్థాపకుడు కూడా చాలా తెలివైనవాడు కనుకనే స్వామీజీ పట్ల ప్రజలకున్న ఆకర్షణను చూసి ఆయన కార్యక్రమాన్ని అందరికంటే చివరనే ఏర్పాటుచేసేవాడు. అప్పుడు మిగిలినవారి ఉపన్యాసాలు ప్రజలు వినక తప్పదు, హాలు కూడా నిండుగా ఉంటుంది. అక్కడ ఉపన్యసించే ప్రతి వక్తకు అర్థగంట సమయమే కేటాయించబడింది. కానీ వివేకానందునికి మాత్రం ఆ నియమం మినహాయించబడింది.

ఆ రోజుల్లో చికాగోలో ఉన్న స్వామీజీకి సంబంధించిన సమాచారమంతా దినపత్రికలలో ప్రచురితమయ్యేది. న్యూయార్క్ హెరాల్డ్ పత్రిక సంపాదకీయ లేఖలో "స్వామీజీ వ్యక్తిత్వము సర్వధర్మ పార్లమెంట్‌లో పాల్గొన్న వారందరికంటే అద్వితీయమైనదని ప్రశంసించబడింది. ఆయనవంటి విద్వాంసుడి ఉపన్యాసము విన్న తరువాత భారతదేశం యొక్క ఆధ్యాత్మికత, విద్వత్తు ఎంత గొప్పదో అర్థమౌతున్నది. అటువంటి దేశానికి ధర్మప్రచారం కొరకు క్రీస్తుమిషనరీలను పంపడం ఎంత పెద్ద మూర్ఖత్వమో తెలుస్తున్నది." అని ప్రచురింపబడింది.

భారతదేశం నుండి రెండు సంవత్సరాల పాటు దూరంగా ఉండి స్వామీజీ ఈ క్రొత్త ప్రపంచమంతటా పర్యటించారు. వేలాదిప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందేశాలు వినిపించారు. కానీ ఆయన ఉపన్యాసాల్లో చెప్పిందే మరలమరల చెప్పడమనేది ఎక్కడా కనిపించదు. ప్రతి ఉపన్యాసం క్రొత్తక్రొత్త ఆలోచనలతో అద్భుతంగా ఉంటుంది. 1897 వ సంవత్సరం ఆయన తిరిగి భారతదేశానికి వచ్చేశారు. ఇక్కడ 4 సంవత్సరాల పాటు దేశంలోని నలుమూలలకు వెళ్ళి **"దేశవాసులారా లేవండి, మేల్కొనండి, ఎప్పటివరకు మన లక్ష్యం పూర్తికాదో అప్పటి వరకు ఎక్కడా ఆగకండి"** అని సందేశాలిచ్చారు.

– అనువాదం: *శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**నాలుకను నియంత్రించుకున్న వ్యక్తి సమస్తాన్ని నియంత్రించగలడు**

# ఏడుపు వస్తే మనసారా ఏడవండి

కన్నీటికి మనోభావాలకు సూటియైన సంబంధమున్నది. కొన్ని మార్లు సంతోషములోను, కొన్నిమార్లు దుఃఖములోను అకస్మాత్తుగా కన్నులనుండి కన్నీరు వెల్లువెత్తుతుంటుంది. అయితే దేశకాలములను అనుసరించి ప్రచారములో ఉన్న అభిప్రాయాల వలన మనం బహుశః కన్నీరు పొంగిపొర్లటాన్ని నిరోధిస్తాము. జనులు మనలను చిన్నపిల్లాడిగా, దుర్బలుడిగా భావించకూడదని అలా చేస్తుంటాము. కన్నీటిరూపంలో పొంగిపొరలే భావాలను ఈ విధంగా అణచి పెట్టడమనేది ఆరోగ్యమునకు మంచిది కాదని వైద్యుల అభిప్రాయము. వారి అభిప్రాయానుసారం కనులనుండి వెలువడే కన్నీటి సహజ మరియు స్వేచ్ఛా ప్రవాహము శారీరికంగా, మానసికపరంగా చూసినప్పుడు ఆరోగ్యమునకు అమిత మేలును చేకూరుస్తుంది.

మినిసోటా విశ్వవిద్యాలయానికి చెందిన డా॥ విలియమ్ 'భావనాత్మక అణచివేత శరీరములో విషతత్వములను ఉత్పన్నము చేస్తుంది. ఈ విషతత్వములు బయటకు వెళ్ళి పోవటానికి ఏడవటము, అరవటము దోహదపడతాయి' అనే విషయమును ప్రప్రథమముగా తెలియచేశాడు. కన్నీటిని ఆపటంచేత అణచి వేయబడిన భావాలు పలు వికృతమైన రూపాలు ధరించి మరింత బలవత్తరమవుతాయి. ఈ విషయమును గురించే డా॥ రాబర్ట్ తన పుస్తకము 'ఎమోషన్స్–ఎ సైకో ఎవల్యూషనరీ సింథసిస్'లో ఇలా వ్రాశాడు. 'కన్నీటిని కారుస్తూ, దానితో పాటుగా ఏడవటము, అరవటము అనేవి సహాయము కోసము పిలిచే పిలుపుకు ఒక సంకేతము. అవి తప్పకుండా భగవంతునికి వినిపిస్తాయి. వీటిని అణచిపెట్టడము వలన అలసట, నిరాశ, ద్వంద్వప్రవృత్తి, ఒత్తిడి మరియు పలు ఇతర చెడు బుద్ధులు (మనోవికారములు) తలెత్తుతాయి. **కన్నీటిని బలవంతంగా ఆపటం వలన హృదయము మరియు మస్తిష్కము మీద భారం పడుతుంది.** అవి శరీరములో అల్సర్, కొలాయిటిస్ వంటి వ్యాధులకు కారణమౌతాయి.'

ఘోరమైన ఆపద మరియు దుఃఖ సమయములలో ఏ వ్యక్తి కన్నులనుండైనా కన్నీరు రాకపోతే ఆ మనిషి అనారోగ్యంతో ఉన్నాడని వైద్యులు భావిస్తారు. ఒకవేళ భరించలేని శోకము లేక కష్టకాలంలో ఏ స్త్రీ కన్నులనుండైనా కన్నీరు చిందకపోతే ఆమె శుష్కాగ్ని అనే అసాధ్యవ్యాధితో పీడింపబడుతున్నదని భావిస్తారు. ఈనాటి వాతావరణ పరిస్థితులలో ఒక వంశ పారంపర్య రోగము పిల్లలలో కనుగొనబడినది. కొంతమంది పిల్లలలో ఏడుస్తున్నప్పుడు వారి కన్నులనుండి కన్నీరు రాదు లేక అతి తక్కువ వెలువడుతుంది. దీనినొక అతి భయంకరమైన వ్యాధిగా పరిగణిస్తారు. ఈ కారణంగా బాలుని యొక్క సముచిత వికాసము జరుగదు. అతను పెద్దవాడైన తదుపరి బహుశః ఆక్రమణ చేసే మనస్తత్వమును (దురుసు స్వభావం) కలిగి ఉంటాడు.

కనుదోయి నుండి కన్నీరు చిందని కారణంగా అనేకరకాల వికారాలు చెలరేగుతాయి. కన్నులలో గుచ్చుకొన్నట్లు లేదా మంటపెట్టడము, చూపు కష్టమగుట, రెండు కళ్ళల్లో నొప్పి, శ్వాసనాళము శుష్కించుట, ముక్కు ఎండినట్లు అవుట, తలనొప్పి మొదలైన బాధలు తలెత్తుతాయి. ఈ కారణముగానే ఆయుర్వేద, అల్లోపతి వైద్యుల అభిప్రాయము ప్రకారం **'కన్నీరు చిందిస్తే దీర్ఘకాలంగా బాధిస్తున్న జలుబు, గొంతువాపు, కళ్ళు మరియు తలనొప్పి నుండి ఉపశమనము లభిస్తుంది.**

నూతన పరిశోధనల ప్రకారము కన్నీళ్ళుకూడా నిజమైనవి, నకిలీవి అని రెండురకాలుగా ఉంటాయి. వేర్వేరు పరిస్థితులలో పొంగిపొరలే కన్నీటి సంరచన అనేకరకాలుగా ఉంటుంది. అమెరికాకు చెందిన నేత్ర చికిత్సకుడు డా॥ జేమ్స్ అభిప్రాయము ప్రకారము పొగవలన, ఉల్లిపాయను తరగటము మరియు కళ్ళలో ఏదైనా నలుసు పడటం వలన కారే కన్నీరు నకిలీది. దుఃఖము, బాధలలో ఉప్పొంగే కన్నీరు నిజమైనది. **ఈ కన్నీటితో పాటు అనేక మలినాల యొక్క వ్యర్థపదార్థములు బయటకు పోతాయి.** 5 లీటర్ల నీటిలో 3 చెంచాల కన్నీళ్ళను కలిపితే ఆ నీరంతా ఉప్పునీరుగా మారుతుంది. విఖ్యాత వైజ్ఞానికుడు ఫ్లెమింగ్ ప్రయోగాల సారాంశము ఏమిటంటే 'కన్నీటిలో సూక్ష్మ క్రిములను నిర్మూలించే తత్వం ఉంటుంది. ఈ విధంగా కన్నీళ్ళు కేవలము కళ్ళను శుభ్రపరచటమే కాదు, వాటిని సూక్ష్మక్రిముల నుండి రక్షిస్తాయి.'

**ఓర్వలేనితనం కూడదు**

మనోవైజ్ఞానికుల అభిప్రాయమును అనుసరించి మన అంతర్ మనస్సులో భావనల యొక్క సర్క్యూట్ ఉంటుంది. అది మనోభావనలను గ్రహిస్తుంటుంది. ఈ సర్క్యూట్ భావనలను నిభాయించుకోలేని సమయములో వాటిని తప్పక బయట పెట్టవలసి ఉంటుంది. ఈ స్థితిలో ఏడ్వటము లేదా అరవటము వలన సమస్యలతో జోడింపబడిన ఈ భావనాత్మక ఒత్తిడి తగ్గుముఖం పడుతుంది. మనోభారము తగ్గుతుంది, మనస్సు తేలిక పడుతుంది. ఈవిధంగా కన్నీళ్ళు ప్రకృతిద్వారా అందివ్వబడిన సురక్షా కవచములవలె పని చేస్తాయి. పురుషులతో పోలిస్తే స్త్రీలు అధిక ఒత్తిడికి గురవ్వక పోవటమును మనము చూస్తూనే ఉంటాము. దీనికి ముఖ్య కారణము వారు పురుషులవలె భావసంవేదనలను అణచి పెట్టరు, పైగా కన్నీరు చిందించి తమ మనోభారమును తగ్గించు కుంటారు! అమెరికాలోని ఒక సంస్థనుండి విడుదలైన ఒకానొక నివేదికను అనుసరించి పురుషులతో పోలిస్తే మహిళలు 5 రెట్లు ఎక్కువ ఏడుస్తారు.

జీవనయానంలో కూడా కన్నీటికి ఉన్నతమైన స్థానమున్నది. ఈ సందర్భంగా 'చిడిస్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైకోలాజికల్ ఫాక్టర్స్ అండ్ హెల్త్' వారి నివేదికననుసరించి అరవలేక పోవటము లేదా కన్నీరు కార్చలేకపోవటము అనేది వ్యక్తిగత శక్తి సామర్థ్యములను నిరోధిస్తుంది. అనగా వాటికి అడ్డుకట్ట వేస్తుంది.

ఏడ్వడం, అరవడం మరియు భావాల అభివ్యక్తి అనేది పారంపర్య మరియు సాంస్కృతిక పృష్ఠభూమి ద్వారాకూడా ప్రభావితమై నిర్ధారించబడుతుంటుంది. ప్రాచీన ఈజిప్ట్ దేశంలో కన్నీటికి అధికాధిక గొప్పతనమియ్యబడినది. అక్కడి స్త్రీలు తమ కన్నీటిని జీవితాంతము ఒక గాజుసీసాలో సేకరించి నిల్వ చేసేవారు. మరణించిన పిదప శవంతోపాటు కన్నీరు ఉన్న గాజుసీసాను కూడా పూడ్చిపెట్టేవారు.

కొన్ని ఆదివాసీ తెగలలో ఉదా॥ మడగాస్కర్‌కు చెందిన వారా జాతీయులు తమ కన్నీటిని త్రాగి దుఃఖములను నిశ్శబ్దంగా భరిస్తుంటారు. వారు ప్రత్యేకరీతిలో నిర్మించిన 'కన్నీటిగది' లోనే తమ దుఃఖము లేదా శోకమును వ్యక్తపరుస్తారు.

చారిత్రాత్మకమైన మరియు పరంపరాగతమైన జనాభిప్రాయం ఒకటి ఉన్నప్పటికీ, పరిపక్వత చెందిన మనుష్యులు ఎల్లప్పుడు 'ఏడ్వటము మరియు అశ్రువులను జాలువార్చే ప్రక్రియ గొప్పతనమును' గ్రహిస్తూనే ఉన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గొప్ప ధీరుడు, వీరుడు మరియు దృఢవ్రతుడు అయిన లింకన్ ఈ పనిని ఒక పద్ధతి ప్రకారము పూర్తిచేసేవాడు. అతను సంగీత కళాకారుడైన తన స్నేహితుడిని తన దగ్గరకు పిలిపించుకుని అతనిని వైట్‌హౌస్‌లోని ఒక ప్రశాంతమైన గదిలోకి తీసికెళ్ళేవాడు. అక్కడ పియానోమీద వ్యధాభరితమైన హృదయ వేదనను కలిగించే గీతాలాపన చెయ్యమని అడిగేవాడు. లింకన్ దానిని వింటూ కన్నీటిని కార్చటముతోపాటు తన మనస్సులోని ఉద్వేగాలను కూడా బయటకు వెలువరించి జీవితభారమును తగ్గించుకొని మనస్సును తేలికపరచుకొనేవాడు.

విశేషజ్ఞుల భావానుసారము సాధారణంగా పలుమార్లు ఏడ్వటము వలన ఏవిధమైన నష్టము వాటిల్లదు. పైగా దీని వలన పలులాభాలు ఒనగూడుతాయి. మనం కూడా కన్నీటిని అణచిపెట్టి దిగులుతో ఓటమి నిండిన జీవితమును గడిపే బదులు ప్రకృతిద్వారా ఇవ్వబడిన ఈ సురక్షితనాళమును తెరచి మనదైన రీతిలో కన్నీటిని చిందిస్తూ మనోమాలిన్యమును తొలగించుకొని మనస్సు శరీరములను రెంటినీ తేలికపరచుకొని ఆరోగ్యవంతంగా ఎందుకు జీవించకూడదు? ఆలోచించండి!!

*– అఖండజ్యోతి, ఏప్రియలు 2001*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## నవ్వాలి - నవ్వించాలి

*విద్యార్థి మహాసభ నడుస్తోంది. ప్రసిద్ధ నవలా రచయిత ముంశీ ప్రేమ్‌చంద్ విద్యార్థులను నవ్విస్తూ, నవ్వుతూ ఉపన్యాసం చెప్తున్నారు. ఉపన్యాసం పూర్తికాగానే ఒక విద్యార్థి ప్రేమ్‌చంద్‌ను ప్రశ్నించాడు. "అన్నింటికన్నా మీకు ఎక్కువ ఇష్టమైనదేది?" "నవ్వుతూ తుళ్ళుతూ ఉండే వాతావరణం" మహా ఉత్సాహంగా జవాబిచ్చారు ముంశీ. కొంపలన్నీ మునిగి పోయినట్లు ముఖం వేలాడ వేసికుని కూర్చునే వారి మధ్య ప్రేమ్‌చంద్ కొన్ని నిమిషాలు కూడా గడపలేకపోయేవారు.*

*– అనువాదం: పొన్నూరు హైమవతీ శాస్త్రి*

## ఏకాగ్రతతో పని చేయాలి

వ్యక్తి వికాసం-2

# జీవించే కళ

వ్యక్తిత్వం లేక పర్సనాలిటి అనే పదం లాటిన్ భాషలోని 'పరసోనా' అనే పదం నుండి వచ్చింది. పూర్వకాలంలో మనిషి యొక్క వస్త్రధారణ, రంగు-రూపం, వ్యవహారాల బట్టి అతడి ఆంతరిక స్వభావం తెలిసేది. కాని ఇప్పుడు వేషభాషలకు, ఆంతర్యానికి సంబంధం ఉండటం లేదు.

మనిషి ఆలోచించే విధానాన్ని బట్టి అతని స్వభావం ఉంటుంది.అదే అతని వ్యక్తిత్వ నిర్మాణానికి ఆధారం అవుతుంది. వర్తమానాన్ని గమనించి భవిష్యత్తును అంచనా వేయవచ్చని కొందరు భావిస్తుంటారు. కాని ఇది చాలావరకు భ్రమ. కొందరు బక్కచిక్కిన శరీరాల వారు ఉంటారు. వారిని చూస్తే పెద్దగా అభిప్రాయం కలుగదు. కానీ అటువంటి వారు కూడా గొప్ప గొప్ప కార్యాలను చేసి చూపించవచ్చు. కారణం వారిలో ఉన్నటువంటి అచంచల విశ్వాసమే. కానీ చూసేవారికి ఆ పని ఆ బక్క శరీరాలకు అసాధ్యమనే అనిపిస్తుంది. గాంధీ గారు ఐదు అడుగుల రెండు అంగుళాలు ఎత్తు ఉండేవారు, సన్నగా పీలగా ఉండేవారు. కానీ ఆయన ప్రచండ సంకల్పశక్తి ఎదుట ఎంత పెద్ద శక్తి అయినా నిలిచేది కాదు.

ఆకర్షణీయమైన వ్యక్తిత్వం కొరకు శారీరిక సౌందర్యం పట్ల, అలంకారాల పట్ల ఎక్కువ శ్రద్ధ చూపిస్తారు. ఎంతో సమయం, ధనం వెచ్చిస్తారు. కానీ వయస్సు పెరుగుతున్న కొద్దీ ఈ అందం, ఆకర్షణ తగ్గుముఖం పడతాయి. కానీ ఆకర్షణీయ వ్యకిత్వం కొరకు తన ఆలోచనలను, నడవడిని ఆదర్శాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకుంటే అతను అమరుడు అవుతాడు, సమాజంలో అతని ప్రభావం చాలాకాలం వరకు ఉంటుంది. అలాంటి వారే మహాపురుషులు అవుతారు, వారి కీర్తి, యశస్సు స్థిరంగా ఉంటాయి.

## వ్యక్తిత్వ వికాస మార్గాలు

ఆలోచనలు, భావనలు మనిషి అంతరంగాన్ని ప్రభావితం చేస్తాయి. ధృడమైన అంతరంగం గల వ్యక్తి పరిస్థితులను, లేమికి తలొగ్గడు. బలహీనమైన భావనలుగల వ్యక్తి, ఆత్మబలం లోపించిన వ్యక్తి, కష్టాల ముందు చతికిలబడతాడు. అందువలన ఎలాంటి పరిస్థితులు ఉన్నప్పటికి ఆత్మవిశ్వాసం పెంచుకొనడం ఎంతో అవసరం.

స్టీఫెన్ కోవే అనే సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత తన పుస్తకం "ది సెవెన్ హాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ టీన్స్"లో ఆకర్షణీయమైన వ్యక్తిత్వం కొరకు ఆరు నియమాల గురించి ప్రస్తావించారు. నిత్య జీవితంలో వీటిని అమలుపరచుకోగలిగితే జీవితం సమృద్ధి, సాఫల్యాల వైపు పయనిస్తుందని ఆయన నొక్కి వక్కాణించారు.

*1) మాట నిలుపుకోవడం*

*2) రోజు ఏదో ఒక మంచి పని చేయడం*

*3) విశ్వాసపాత్రుడు అవడం*

*4) ఇతరుల మాట వినడం*

*5) తప్పులు చేస్తే ఒప్పుకోవడం*

*6) ఉచితమైన కోరికలు*

**1) మాట నిలుపుకోవడం :** మనిషి తను చెప్పే ప్రతిమాట విశ్వసనీయంగా ఉండాలి. చెప్పిన ప్రతిమాట నిలబెట్టుకోవాలి. అంటే ఏదైనా ఒక పని చేస్తానని చెప్తే అది చేసి తీరాలి. అప్పుడే ఇతరులు నిన్ను, నీ మాటలను విశ్వసిస్తారు.

**2) రోజు ఏదో ఒక మంచి పని చేయడం :** ప్రతి ఒక్కరు రోజంతా తమ తమ పనులలో నిమగ్నమయి ఉంటారు. కానీ వ్యక్తిత్వం మంచిగా మలచుకోవాలంటే కొంచెం ఇతరులకు కూడా సహాయపడే విధంగా తనను తాను తీర్చిదిద్దుకోవాలి. ఇంకొకరికి చేసిన సాయం ఊరికే పోదు. స్నేహితులను తయారుచేసుకొనే మార్గం ఇదే.

**3) విశ్వాసపాత్రుడు అవడం :** ప్రతి మనిషికి ఎంతోమందితో సంబంధ బాంధవ్యాలు ఉంటాయి. కుటుంబ సభ్యుల నుంచి సమాజం వరకు జీవితమంతా విశ్వాసం మీదనే నడుస్తుంది. అందువలన మన ప్రవర్తన ఎదుటివారు విశ్వసించేదిగా ఉండాలి. విశ్వాసపాత్రుడికే ఎవరైనా ఏదైనా బాధ్యత అప్పగించేది.

**కార్యసాధనలో బద్ధకం, సోమరితనం, వాయిదాలు వేసే తత్వాన్ని వీడాలి**

విశ్వాసం కోల్పోతే అతనిని ఎవరు పట్టించుకోరు. ఎవరు మర్యాద ఇవ్వరు.

**4) ఇతరుల మాట వినడం :** మనం చెప్పేదే ఇతరులు వినాలని కోరుకోవడం అనేది సామాన్య మానవ నైజం. తన చాతుర్యంతో ఉన్నవి లేనివి కూడా కల్పించి కథలు కథలుగా చెప్తుంటారు. కాని ఉత్కృష్ట వ్యక్తిత్వం గలవారు ఎక్కువ వింటారు, తక్కువ మాట్లాడతారు. ఇతరులు తమ బాధను, కష్టాలను చెప్పుకుంటుంటే ముందు వినాలి. తరువాత చేయగలిగినది చేయాలి.

**5) తప్పులు చేస్తే ఒప్పుకోవడం :** మనిషి తప్పు చేయవచ్చు. తప్పు తెలిసి చేయవచ్చు, తెలియకుండా చేయవచ్చు. ఎవరైనా మనం చేసిన తప్పును ఎత్తి చూపినప్పుడు, ఆ తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. అనేకమంది చేసిన తప్పులను సమర్థించుకుంటుంటారు. అలా చేస్తే ఎదుగుదల ఆగిపోతుంది. మనం చేసిన తప్పుకు ఇతరులకు కష్టం కలిగితే, ఇబ్బంది కలిగితే వారికి వినమ్రంగా క్షమించమని అడగాలి. అలా చేయగలిగితే సంబంధ బాంధవ్యాలు మెరుగుపడతాయి.

**6) ఉచితమైన కోరికలు :** ప్రతి మనిషికి ఏదో సాధించాలని ఉంటుంది. తన పాత్రత, అర్హత, నైపుణ్యం మొదలైనవి దృష్టిలో పెట్టుకుని, తగిన కోరిక కోరుకుంటే, అది ప్రయత్నం మీద తప్పక నెరవేరుతుంది. మీమీద మీకు విశ్వాసం పెరుగుతుంది. అప్పుడు ఇంకొంచం పెద్ద కోరికలను నెరవేర్చుకోవటానికి ప్రయత్నం చేయవచ్చు. ముందరే పెద్ద పెద్ద కోరికలను మనస్సులో పెట్టుకుంటే అది గాలిలో కట్టిన పేక మేడలాగానే ఉంటుంది.

## సమగ్ర వికాసం - అంతఃప్రజ్ఞ

ఆంగ్ల పదం ఇంట్యూషన్ (intuition = tuition from inside)కి పర్యాయమే అంతఃప్రజ్ఞ. దీని కార్యక్షేత్రం మనస్సు, బుద్ధి పరిధికి అతీతమైనది. దానిని మూడవ నేత్రం, అతీంద్రియ జ్ఞానం లేక ఆరో ఇంద్రియం (sixth sense) అని కూడా అంటారు. చేతన మనస్సు (conscious mind) కి సంబంధం లేకుండా వచ్చే ఆలోచనను అంతఃప్రజ్ఞ లేక ఇంట్యూషన్ అనవచ్చు. ఏదో ఒక సమస్యకు అనేక కోణముల నుంచి ఆలోచించి ఆలోచించి అలసిపోయినప్పుడు లోపలి నుంచి సమస్యకు పరిష్కారం ఉన్నట్టుండి తళుక్కుమంటుంది. ఇదే అంతఃప్రజ్ఞ అంటే. అంటే భౌతికమైన చేయవలసిన ప్రయత్నము లన్నీ చేసిన తరువాతనే అంతఃప్రజ్ఞ జాగృతమవుతుంది.

## మానవ జీవిత ఉద్దేశ్యం

ప్రతి ఉదయం జీవితంలో కొత్త జన్మ అని రాత్రి సమయం జీవితానికి మరణమని భావించాలి. ఉన్నది ఒకే రోజు అయినప్పుడు ఎలా జీవించాలి? ప్రకృతిని అర్థం చేసుకొన గలిగితే తన జీవిత లక్ష్యాన్ని తెలుసుకోగలుగుతాడు. కానీ జీవితం కనిపించే శరీరం మాత్రమేనని అనుకుని దాని సుఖాలకు, సంతోషాలకు పరిమితం చేసుకుంటే వాస్తవిక లక్ష్యం గుర్తు కూడా ఉండదు. మనం ఈ కనిపించే శరీరం మాత్రమే కాదు. ఇంకేదో ఉన్నదని గుర్తించి దానిని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఇది తెలియాలంటే ఇతరుల మంచి, మేలు గురించి ఆలోచించడం అవసరమే.

## ఉత్కృష్ట ఆలోచనల వికాసం

ప్రణాళికాబద్ధమైన జీవితాన్ని గడపగలిగే నేర్పు ప్రతి మనిషికి కావాలి. ఇది నేర్చుకున్నవారు అన్ని పరిస్థితులలో, బాధలలో, కష్టాలలో ఉన్నప్పటికి ప్రగతి మార్గాన్ని అన్వేషిస్తారు, ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు.

కొందరిలో కనిపించే ప్రతిభకు, విజయానికి కారణం వారి తపన, నిరంతర ప్రయత్నం. సామాన్యంగా ప్రతిభ, యోగ్యత అనేవి పుట్టుకతో రావు. వీటిని తగు ప్రయత్నంతోనే సాధించుకోవాలి. దీనికి సమర్థవంతుడైన మార్గదర్శకుడు లభ్యం అవడంతోపాటు విశేష ప్రయత్నం అవసరమవుతుంది. ఒకే క్లాసులో ఒక టీచరు చెప్తున్న పాఠాలు విని ఒకడికి యూనివర్సిటీ ఫస్టు రావచ్చు. ఇంకొకడు పరీక్షలో తప్పవచ్చు. అందువలన నేర్చుకోవాలి, సాధించుకోవాలి అన్న తపన చాలా ముఖ్యం అవుతుంది.

## ఆలోచనలు మారితే పరిస్థితులు మారతాయి

మనిషి ఏ విధంగా ఆలోచిస్తాడో అదేవిధంగా తయారవు తాడు. మంచి మంచి ఆలోచనలతో ప్రతిభావంతమైన వ్యక్తిత్వాన్ని వికసింపచేసుకోవచ్చు. ఏదైనా పని చేయగలమను కుంటే, అది చేయటానికి ప్రయత్నించాలి. ఆ పని మనవల్ల

**అనవసర చర్చలు, వాదులాటలు మానివేయాలి**

ఏమవుతుందనుకుంటే అడుగు ముందుకు పడదు. ఏ పనికి అయినా ఆలోచనలే బీజాలు. అందులోనించి అంకురించేదే స్వభావం, సామర్థ్యం, ప్రతిభ. ఈ అంకురమే భవిష్యత్తులో మంచి మంచి ఫలాలను ఇస్తుంది.

చెడు ఆలోచనలు వ్యక్తిత్వానికి అనేక రకాల కీడును కలుగ జేస్తాయి. చెడు ఆలోచనలు చెడు అలవాట్లకు దారితీస్తాయి. చెడు అలవాట్లను వదిలించుకోవాలంటే మంచి ఆలోచనల ఆశ్రయం తప్ప వేరే మార్గం లేదు.

### జీవన లక్ష్యం

మనుష్య జీవన ప్రథమ లక్ష్యం తన కుటుంబ పాలన –పోషణ అవుతుంది. తరువాత పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు వస్తాయి.

నిజానికి మానవ జీవన ఉద్దేశ్యం పైన చెప్పిన పనులు కావు. పైన చెప్పిన పనులు అతని బాధ్యతలవుతాయి. మానవ జీవిత ఉద్దేశ్యం మొదట తనకు, తరువాత తన కుటుంబానికి తరువాత సమాజానికి ఉపయోగపడాలి. దాని కొరకు ఎన్నో గుణములను, సామర్థ్యములను పెంచుకోవాలి. మన దగ్గర ఉన్నదే ఇతరులకు ఇవ్వగలుగుతాము. మన దగ్గర తగిన జ్ఞానము ఉంటే ఇతరులకు మార్గదర్శనం చేయగలుగుతాము. కుటుంబంలో స్నేహం, సౌభ్రాతృత్వం, ఉల్లాసం, క్రమశిక్షణ, నెలకొల్పగలిగితే చాలా గొప్పపని చేసినట్లే. ఇవి ఉంటే అష్ట ఐశ్వర్యాలు ఉన్నట్లే.

### మానవ జీవితం యొక్క సదుపయోగం

మానవ జీవితాన్ని తనకు, తన కుటుంబానికి తరువాత సమాజానికి ఉపయోగపడేటట్లు తీర్చిదిద్దుకోవాలి. మనిషి సామాజిక ప్రాణి, మనిషి సమాజంలో ఉంటేనే అతనికి సుఖం, శాంతి లభిస్తాయి. మనిషికి సమాజం నుంచి అనేకం లభిస్తున్నాయి. వాటిని గుర్తించగలగాలి. మనం కూడా సమాజానికి ఏదైనా చెయ్యగలగాలి. సహృదయత ఒక గొప్ప శక్తి. అది హృదయ అంతరాళాలలో నుంచి ఉదయించే భావన. సహృదయంతో, ఉత్కృష్టతతో, సానుభూతితో ఎదుటివారికి మంచి చేస్తూ, జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

నువ్వు సంతోషంగా ఉండు – ఇతరులను సంతోషపెట్టు ఇంత కన్నా కావాలసినది ఇంకేమి లేదు.

★★★

## సురదుర్లభమైన మానవజన్మ వ్యర్థం చేసుకోరాదు

*ఋషి మండలి సమావేశమయి వర్తమాన యుగంలో రానున్న ఆపదల గూర్చి చర్చించసాగింది. ఆ చర్చా, ఆలోచనా క్రమంలో వారి మధ్య ఒక ప్రశ్న ఉదయించింది. "మనుష్యులకు నేటియుగంలో ప్రత్యక్షమయ్యే అత్యంత పెద్ద సమస్య ఏమిటి? దీనికి సమాధానంగా, ఆ ఋషిగణంలో, మంచి ఆలోచనాపరుడైన ఋషి ఈ రీతిగా సమాధానమిచ్చాడు. "ఈ యుగానికి సంబంధించి అత్యంత పెద్ద సమస్య ప్రత్యక్షవాదం (ప్రతిదానికి ఋజువు, సాక్ష్యాల కోరుట) మరియు త్వరితగతిన ఫలితాలను ఆశించుట". పనిని ప్రారంభించుటకు పూర్వమే దాని నుండి పొందబోయే లాభాల గురించి బేరీజు వేస్తూ వానిని పొందుటకై ఏమి చేయటానికైనా వెనుకాడరు. ఆదర్శాలకు, జీవిత విలువలకు తిలోదకాలనిచ్చి, కుట్రలు, కుతంత్రాలతో తమ జీవితాలను నింపుకొని, అనైతికతతో కూడిన మార్గాన్నే తమ జీవన పథంగా మార్చుకొని నడుస్తారు. ఇట్టి వారి తీరును సహించి, ఏదో రీతిగా సర్దుకొనిపోయినా, ప్రత్యక్షవాదులు శరీరానికి మరియు విలాస వైభవాలకు ప్రథమ పీట వేయుట ద్వారా భౌతిక కన్నులతో చూసేదే యదార్థమనే భావనకు అత్యంత ప్రాచుర్యం లభిస్తుంది. దీనితో ఆత్మ–పరమాత్మల అస్థిత్వంపై విశ్వాసం సడలిపోతుంది. సత్యం, ధర్మం మరియు న్యాయ మార్గాలననుసరించుటకు ఎవ్వరు సాహసించరు" ఈ విషయాలన్నింటిని సూక్ష్మంగా చర్చించి ఋషి గణం ఒక సంకల్పాన్ని తీసుకొన్నది. అది "ఋషుల యొక్క తపస్సు ద్వారా జనించే తపశ్శక్తి, మనుష్యుల అంతఃకరణలో సాత్వికగుణాల పెంపొందింపజేసి, వారిని జాగృతపరచి, సురదుర్లభమైన ఈ మానవ జన్మను నష్టపడనివ్వకూడదు."*

*అఖండజ్యోతి, ఆగస్టు 2013*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**ప్రశాంతంగా ఉండండి, కష్టాలు, బాధలు, ఇబ్బందులు అన్నీ వాటంతటవే కుదుటపడతాయి**

## మెస్మరిజం-6

# నిద్రాస్థితిలోకి పంపే విధానాలు

ఏ వ్యక్తిపైన మనం మెస్మరిజంను ప్రయోగిస్తామో వారికి ఒక రకమైన నిద్ర ఆవహిస్తుంది. దానిని యోగనిద్ర అని కానీ సమ్మోహన తంద్రాస్థితి అని కానీ అంటారు. ఇది మనం ప్రతిరోజు పడుకున్నప్పుడు నిద్రించే గాఢనిద్రాస్థితిలాంటిది కాదు. ఇందులో శరీరము మేల్కొన్నస్థితిలో కానీ, అర్థ జాగృతావస్థలో కానీ ఉంటుంది. శరీరపరంగా చూస్తే దీన్ని అర్థనిద్రాస్థితి అనే అనాలి. కళ్ళు మూతలు పడతాయి, శరీరం మీద పట్టు ఉండదు, దేహములోని కదలికలు తగ్గిపోతాయి కానీ స్పృహ ఉంటుంది. చేతనత్వము మాత్రం కొంచెం తక్కువగా ఉంటుంది కానీ కొద్దిసేపటికి అది కూడా క్షీణించి పోతుంది. మానసిక దృష్టితో చూసినా ఇది అర్థనిద్రావస్థే. బాహ్యమనస్సు నిద్రిస్తుంది. ఏ విషయంపైనైనా తర్కించడం, అనుమానించడం, పరీక్షించడం, వెదకడం అనే శక్తి పనిచేయదు కానీ విశ్వాసమును స్వీకరించేందుకు కావలసిన అవయవాలు పనిచేస్తూ ఉంటాయి. కలలలో అయితే అంతర్ మనస్సు నిద్రిస్తుంది, బాహ్య మనస్సు షికార్లు చేస్తూ ఉంటుంది. కానీ యోగనిద్రలో ఇందుకు వ్యతిరేకంగా జరుగుతుంటుంది అంటే అంతర్ మనస్సు మెలకువగా ఉంటుంది, బాహ్య మనస్సు నిద్రిస్తుంది. ఈ ప్రకారంగా చూస్తే ఈ యోగనిద్ర అంటే శరీరపరంగా చూసినా, మనస్సు పరంగా చూసినా సగం నిద్ర మాత్రమే, అంటే ఇందులో మనిషి సగం మెలకువతోను, సగం నిదురలోను ఉంటాడు.

ఏ వ్యక్తిపై ప్రయోగము చేయాలనుకుంటున్నామో అతనిని ప్రయోగము కొరకు ఒప్పించాలి. దీనివల్ల అతనికి ఎటువంటి హాని కలుగదు. పైపెచ్చు మస్తిష్కము మరింత వికసితమవుతుంది. అనేక మానసిక శక్తులు జాగృతమౌతాయి. మనం ఈ ప్రయోగము ద్వారా అతనియందు స్థాపించాలనుకున్న మంచి సంకల్పాల వల్ల అతని యందున్న సద్గుణములను వృద్ధి పొందుతాయి, అవి దుర్గుణాలను, రోగములను తీసిపారేస్తాయి. పూలచెట్లున్న తోటలకు దగ్గరలో ఉండేవారు ఆ తోట నుండి వచ్చే సువాసనను పీల్చుకోగలుగుతారు.

ఎవరు నిద్రలోకి వెళ్ళమని మొండిగా ఎదురు తిరుగుతారో వారిని నెమ్మదిగా నిద్రలోకి ఎలాగోలా పంపాలి తప్ప బలవంతంగానో, ఒత్తిడి చేయడం ద్వారానో నిద్రలోకి పంపితే వచ్చే పరిణామాలు మంచి ఫలితాలను ఇవ్వవు. నిద్రలోకి పంపేముందు ప్రయోగానికి ఎంపిక చేయబడ్డ వ్యక్తిని (అతనిని మనం పాత్రుడు అని చెప్తాము. ముమ్ముందు రాబోయే వ్యాసమంతా అలానే సంబోధించడం జరుగుతుంది) తన శరీరమును వదులుగా ఉంచుకోమని ఆదేశించాలి. పాత్రుడిని ఏదైనా పడక కుర్చీలో కానీ, లేదా మెత్తని పరుపుమీద కానీ విశ్రాంతిగా పడుకోమని చెప్పాలి. ఆ తరువాత తన శరీరము అంతా ప్రాణం లేకుండా పడిపోయినట్లుగా భావించమని చెప్పాలి. మనస్సు అంతా 'లోతైన సముద్రములో అలా తేలియాడుతున్నట్లు' గా భావిస్తూ శరీరమును పూర్తిగా శిథిలావస్థలోకి తీసుకు రమ్మని చెప్పాలి. ఇలా రోజూ కనీసం 10 నుండి 15 నిమిషాలు చొప్పున ఒక వారం రోజులపాటు అభ్యసింప చేయాలి. ఆ తరువాతనే అతనిని నిద్రలోకి తీసుకువెళ్ళాలి. అలా కుదరకపోతే ఒక్క రోజులోనే అనేకసార్లుగా శిథిలాసనమును అభ్యసింపచేసి రెండవరోజు ప్రయోగానికి తీసుకువెళ్ళాలి. ఇలా కూడా కుదరకపోతే ప్రయోగానికి ముందు 10, 15 నిమిషాలపాటు ప్రతి వ్యక్తితోను శిథిలాసనమును వేయించాలి. దీనివలన వారి చిత్తము ప్రశాంతంగా ఉండి ఏకాగ్రతను పొందుతుంది. ఇటువంటి మానసికస్థితిలో ప్రయోగం చేయడం సులభమవు తుంది.

ప్రయోగము కొరకు పాత్రుడిని విశ్రాంతిగా కూర్చుండేందుకు వీలయ్యే కుర్చీలోకానీ, మెత్తని పరుపు మీద దిండుకు ఆనుకుని కానీ కూర్చోమని చెప్పాలి. నడుముకు, తలకు వెనుక ఏదైనా ఆనుకునేందుకు వీలుగా చూసుకోవాలి. ఎందుకంటే తంద్రాస్థితి అనగా నిద్రలోకి జారిన తరువాత ఇటు, అటూ దొర్లకుండా జాగ్రత్తపడాలి. ఏ విధమైన శబ్దాలు లేని ఏకాంతస్థలాన్ని ఇందుకొరకు ఎంపిక చేసుకోవాలి. ప్రాతఃకాలము ఇందుకు చాలా అనుకూలంగా ఉంటుంది, మంచిది కూడా. తప్పకపోతే

**నిదానమే ప్రధానం. ఏ పనిలోను తొందర కూడదు**

సాయంకాలమైనా ఫరవాలేదు. సాధారణంగా మెస్మరిజం చేయడానికి కుర్చీలనే వాడతారు. ప్రయోగానికి కూర్చునే వ్యక్తికి విశ్రాంతిగా ఉండే కుర్చీని, ప్రయోగము చేసే వ్యక్తికి నిటారుగా ఉండే కుర్చీని వాడతారు. అది చెక్కతో చేసినదై ఉండాలి తప్ప ఏ రకమైన లోహములతోను చేసినదై ఉండకూడదు ఎందుకంటే ప్రయోగము చేసేప్పుడు వెలువడే విద్యుచ్ఛక్తిలో అధికభాగం ఆ లోహంలోకి వెళ్ళిపోతుంది. దానితో కోరిన ఫలితం రాదు. పాత్రుడు తూర్పు లేదా ఉత్తరం వైపుకు తిరిగి కూర్చోవాలి. ప్రయోగము చేసే వ్యక్తి (ఇతనిని ప్రయోక్త అని అంటారు) అతనికి దగ్గరగా జరిగి అతని కుర్చీపై చేయి ఆనించి కూర్చోవాలి.

ప్రారంభంలో ఇద్దరు తమ చిత్తమును ప్రసన్నంగా ఉంచుకోవాలి. ప్రయోక్త పాత్రుని ముఖంపై గంభీరంగా దృష్టి సారించాలి. ఆ తరువాత అతని ఎడమకంటి రెప్పపై దృష్టి సారించాలి. ప్రారంభంలో ఈ దృష్టిపాతము చాలా తేలిగ్గా ఉండాలి. తరువాత మెల్లమెల్లగా తీవ్రతను పెంచాలి. ఏ విధంగా నల్లని రంగుగల గోళంపై త్రాటకం చేస్తామో అదే విధంగా పాత్రుని ఎడమకన్ను రెప్పలపై త్రాటకము చేయాలి. సంపూర్ణ ఏకాగ్రతతోను, ఇచ్ఛాశక్తితోను 'నా విద్యుచ్ఛక్తి ప్రవాహము చాలా వేగంగా పాత్రుని నేత్రమార్గం ద్వారా అతని మస్తిష్కము లోనికి ప్రవేశిస్తున్నది' అని భావించాలి. దానితో అతను చాలా త్వరగా నిద్రలోకి జారుకుంటాడు అని భావన చెయ్యాలి. ఈ ప్రయోగము చేసిన 5 నుండి 15 నిమిషాల లోపు పాత్రుని కళ్ళు మూతపడడం మొదలవుతుంది. మత్తు ఆవరిస్తుంది. దీన్నే తంద్రాస్థితి అంటారు. అందువల్ల మనం ముందుగానే పాత్రునితో ఆ స్థితి ఆవరించినట్లనిపించినప్పుడు బలవంతంగా ఆపుకోకుండా శరీరాన్ని అలాగే వదిలేసి విశ్రాంతిగా పడిపో నివ్వమని చెప్పాలి.

ఇచ్ఛాశక్తి మరియు ఏకాగ్రత ద్వారా ప్రయోక్త శరీరము నుండి వెలువడే విద్యుచ్ఛక్తి పాత్రుని శరీరంలోకి బలవంతంగా ప్రవేశిస్తుంది. దానికి స్థానం కల్పించేందుకై అతని శరీరంలోని మరోశక్తి తన స్థానాన్ని ఖాళీ చేయవలసివస్తుంది. అంటే పాత్రుని బాహ్యామనస్సు తన స్థానం నుండి ప్రక్కకు తొలగిపోతుంది. కనుక నిద్ర వస్తుంది. ఈ స్థితిలో ప్రయోక్త తన ఇచ్ఛాశక్తి ద్వారా పాత్రుని యొక్క మస్తిష్కముపై పట్టును సాధించి తన ఇచ్ఛానుసారం పనిచేయించడం మొదలుపెడతాడు. ఈ ఆధారంతోనే మెస్మరిజంలో కావలసిన ఫలితాలను సాధించడం జరుగుతుంటుంది.

పాత్రుని నిద్రలోకి పంపిన తరువాత అతనిని 'మార్జనము' అనగా (దీనినే హీలింగ్‌లో క్లీనింగ్ అంటారు) శుభ్రపరచుట చేసిన తరువాత ఆదేశములను ఇవ్వాలి. ఇందుకొరకు ప్రయోక్త తన కూర్చున్న కుర్చీలోంచి లేచి నిలబడాలి. ముందుగా ఒక మగ్గులో నీరు తీసుకుని, దానిలో కొంచెం ఉప్పు వేసుకుని ప్రక్కన ఉంచుకోవాలి.

చేతులను ముందుకు చాపి వ్రేళ్ళను నిటారుగా ఉంచు కొంటూ ఈ క్రియ చేయాలి. మానసికమైన దోషములను తీసివేసేందుకై ప్రయోగము చేస్తుంటే కనుక మస్తిష్కముపై మార్జనము చేయాలి. శరీరమంతటా దోషములు వ్యాపించి ఉంటే కనుక వాటిని దూరం చేసేందుకై మొత్తం శరీరమును మార్జనం చేయాలి, లేదా ఏదో ఒక శరీరభాగములోనే నొప్పి ఉంటే అక్కడే మార్జనం చేయాలి. రెండు చేతి వ్రేళ్ళను సమానంగా జాపి ఉంచాలి. తరువాత పాత్రుని శరీరము నుండి అరఅంగుళం దూరంలో నుండి వ్రేళ్ళను కదిలిస్తూ మార్జనం చేయాలి. అది ఎలాగంటే ఏదైనా పాత్రలో పేరుకున్న నేతిని వ్రేళ్ళతోటి ఎలా తీస్తామో అలాగే నిర్ధారిత శరీరభాగంపై వ్రేళ్ళను క్రిందివైపుగా తీసుకురావాలి. తరువాత ఒక ప్రక్కగా ఆ వ్రేళ్ళను మగ్గులో ఉన్న ఉప్పునీటిలో విదిలించి మళ్ళీ పై ప్రకారంగానే చేయాలి. ఈ విధంగా అవసరాన్ని బట్టి 10 నుండి 15 సార్లు చేయాలి. ఈ క్రియ చేస్తున్నప్పుడు ఆ చెడు తత్వాలను తన ఆకర్షణశక్తి ద్వారా లాగి బైటపడవేసి ఆ ప్రదేశమును దోషరహితముగా తయారుచేస్తున్నాననే భావన చేయాలి. ఇటువంటి భావనను దృఢమైన ఇచ్ఛాశక్తితో, శ్రద్ధతో, విశ్వాసముతోను చేయాలి. నొప్పి ఉన్న ప్రదేశముపై సంపూర్ణ ధ్యాస ఉంచి అక్కడ ఆరోగ్యము చేకూరుతున్నదనే భావన చేయాలి. ఈ క్రియను అత్యంత విశ్వాసముతో చేయాలి. మార్జనమును ముగించేముందు చివరగా చేతులను మూడు సార్లు గట్టిగా మగ్గులోని ఉప్పు నీటిలోకి విదిలించాలి. దానివల్ల మనము శుభ్రం చేసినవేవీ శరీరానికి అంటకుండా ఉంటాయి. మగ్గులోని నీటిని లెట్రిన్‌లో పారపోయాలి.

మార్జనం చేసేప్పుడు పాత్రునికి అత్యంత శాంతి లభించడం

**ఆలస్యం చేస్తే అమృతం కూడా విషంగా మారవచ్చు**

వల్ల గాఢనిద్ర వస్తుంది. అప్పుడు ఆదేశాలు ఇవ్వడం ప్రారంభించాలి. నిద్రించిన పాత్రుని వెనుక ప్రక్కగా నిలబడి గంభీరమైన, స్థిరమైన, నిశ్చితమైన, స్పష్టమైన మంద్ర స్వరముతో అతను రోగరహితునిగా, ఆరోగ్యంగా ఉంటూ ఉన్నతిని పొందుతున్నాడు అనే అనుభూతిని పొందేలా చేయాలి. ఎడమ చేతిని నొప్పి ఉన్న ప్రాంతముపై తేలికగా ఉంచి పాజిటివ్‌గా ఉంటూ, నెగటివ్ అనేది లేకుండా ఉండే పద్ధతిలో ఆదేశాలను ఇవ్వాలి. ఉదా: 'నీవు రోగగ్రస్థుడివి కావు' అని కాకుండా 'నీవు ఆరోగ్యవంతుడివి' అని చెప్పాలి. రోగికి 'నీ నొప్పి తగ్గిపోయి ఆరోగ్యము పెంపొందుతున్నది. నేను నీ రోగాన్ని తీసివేస్తున్నాను, దాన్ని మొదళ్ళ నుండి లాగిపడవేస్తున్నాను, నీవు లేచినప్పుడు చాలా ఆరోగ్యవంతుడిగా లేస్తావు.' అని ఆదేశించాలి.

'నా ప్రాణశక్తిని నీ శరీరములోకి ప్రవేశపెట్టి నూతన బలమును, ఆరోగ్యమును, కొత్త ఉత్సాహమును ఇస్తున్నాను. వీటి వల్ల నీవు నీ చైతన్యమును మరియు శక్తిని అనుభూతి చెందుతావు.'.

నిద్రిస్తున్న పాత్రుని శిరస్సుపై చేయి ఉంచి ఈ రకమైన ఆదేశాలనివ్వాలి 'నేను నా చేతివ్రేళ్ళ ద్వారా నీ మస్తిష్కములోని బుద్ధికి శక్తిని అందిస్తున్నాను. ఈ బుద్ధి అలల రూపంలో నీ మస్తిష్కములో జమ అవుతున్నది. ఇప్పుడు నీ బుద్ధియందు అవసరమైనంత ఉన్నతి కలిగి అది సరైన పద్ధతిలో పెరుగుతుంది. ఇక నీవు ప్రతి విషయమును చక్కగా అర్థము చేసుకోగలవు, గుర్తుంచుకోగలవు. ఇప్పటినుండి, ఈ క్షణం నుండి నీ బుద్ధిశక్తి పెరుగుతుంది. దానిని నీవు అనుభూతి చెందగలవు.' ఈ రకమైన ఆదేశాలను శారీరిక రోగములున్నా, వ్యక్తిత్వ సంబంధ రోగములున్నా, మానసికరోగములున్నా ఇవ్వవచ్చు. సద్గుణములను బీజారోపణ చేసేందుకై ఇటువంటి ఆదేశములను తయారుచేయాలి. వీటిని ఇలాగే అనుసరించాలని లేదు. సమయాసారం పరిస్థితులకు అనుగుణంగా ఆదేశములను తయారుచేసుకోగలిగే సామర్థ్యము ప్రయోక్తకు ఉండాలి.

ఆదేశములను పలుమార్లు చెప్తూ ఉండాలి. ఆ తరువాత ప్రయోగము పూర్తిచేసి ప్రక్కకు వచ్చేయాలి. పాత్రుడు గాఢనిద్రలో ఉంటే అతనిని అలాగే పడుకోనివ్వాలి. కొంతసేపటి తరువాత అతను నిద్ర నుండి లేస్తున్నాడా లేదా, అతని శరీరములో చైతన్యము కలుగుతున్నదా లేదా అని గమనించాలి. అలా కలుగుతున్నదనుకున్నప్పుడు తల నుండి పొట్ట వరకు ఐదుసార్లు మార్జనం చేసి నెమ్మదిగా పిలిచి నిద్రనుండి లేపాలి.

నిద్రనుండి లేచిన తరువాత పాత్రుని ఏదైనా ఆటపాటల గురించి కానీ వ్యక్తపరచలేని ఏవైనా విషయాల గురించి కానీ అడగవచ్చు. అతడిని ఏ మార్గంలో నడిపించాలన్నా లేదా ఏదైనా పనిచేయించాలన్నా ఆ విషయం ముందే తెలుసుకొని ఆ భావనలతో ఆదేశములను ఇవ్వాలి. ఏ కోరికతో ప్రయోగం చేస్తామో అటువంటి ఫలితాలే వస్తాయి.

నిద్రింపచేసేందుకు ఇంకా కొన్ని విధానాలున్నాయి. అవి క్రింద తెలుపబడ్డాయి.

1. కుడిచేతి చూపుడు వ్రేలు పాత్రుని రెండు కనుబొమల మధ్య భృకుటి స్థానంలో తేలికగా ఉంచి 'నాకు నెమ్మది నెమ్మదిగా నిద్ర వస్తున్నది' అనే సంకల్పమును భావన చేస్తూ ఉండమనాలి. దాంతో కొద్దిసేపట్లో నిద్ర వస్తుంది.

2. అద్దము యొక్క మెరుపును బొటన వ్రేలుపై పడేట్లు చేయాలి. ఆ వెలుగు పాత్రుని కళ్ళల్లో పడే విధంగా చూసుకోవాలి. ఆ బొటనవ్రేలు గోరుపై దృష్టిని నిలిపితే నిద్ర వస్తుంది.

3. రెండు చేతులను గుప్పిట పట్టి అందులో పాత్రుని రెండు బొటన వ్రేళ్ళు కలిపి పట్టుకోవాలి. అతని బొటనవ్రేలు మొదట్లో మీ బొటనవ్రేలు గోరుతో నెమ్మదిగా గీరాలి. అతని ముఖమును చూస్తూ అతనిని నిద్ర పోవాలని కోరితే అతనికి నిద్ర వస్తుంది.

4. ఒక సాధారణమైన అద్దమును తీసుకొని దాని వెనుక భాగంలో నల్లని రంగు వేసి చుట్టూ చెక్కతో బిగించాలి. అప్పుడది 'త్రికాలదర్శి దర్పణం' అవుతుంది. ఆ నల్లని అద్దము మధ్యలో ఒక రూపాయి నాణెమంత మేర నూనె అద్దాలి. ఆ అద్దానికి ముందుగా ఏదైనా ఎత్తైన ప్రదేశములో దీపాన్ని ఉంచి ఆ కాంతి అద్దముపై నూనె అద్దిన ప్రాంతంలో పడేలా చేయాలి. ఆ కాంతిపై పాత్రుని దృష్టిసారించి నిద్రపోవాలనే ఆదేశాన్నిస్తే కొద్దిసేపట్లో నిద్ర వస్తుంది.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం 19 (9.13) నుండి*

*అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**కాలక్షేపపు కబుర్లతో పొద్దుపుచ్చకండి**

# ప్రతిభకు వయస్సుతో పనేముంది?

శారీరిక పరిపక్వత వయస్సు మీద ఆధారపడి ఉంటుంది. 20 సం॥లు వచ్చేసరికి ప్రతివ్యక్తి ఈడుకు వచ్చినట్లు కనిపిస్తాడు. 25 నుండి 30 సం॥ల మధ్యలో శారీరిక దృష్టిలో పరిపక్వత చెందినట్లు అనుకోవాలి. ప్రౌఢ వయస్సు దీని తరువాత 40 సం॥ల వరకు నడుస్తుంది. అయితే మానసిక దృష్టి పరంగా చూస్తే ఎంత వయస్సున్న వారిని పరిపక్వత చెందినవారుగా నిర్ణయించటం కష్టమవుతుంది. చాలామంది వ్యక్తులలో వయస్సు పెరిగినా కూడా బాల్య చేష్టలు వదలకుండా ఉంటాయి. చిన్నపిల్లలలాగా చాలామంది జీవితాంతం ప్రవర్తిస్తూ ఉంటారు. ఇటువంటి వారిలో అమాయకత్వం కనిపిస్తూ ఉంటుంది. కొంతమందిలో చిన్న వయస్సులో ఎంతో పరిణతి చెందిన ప్రౌఢత్వం కనిపిస్తుంటుంది. వీరు అద్భుతమైన తెలివితేటలు చూపటంతోపాటు, పెద్దవారిలాగా బాధ్యతలు నిర్వర్తించటం కనిపిస్తుంటుంది. వయస్సుకు మించిన తెలివితేటలు వీరిలో కనిపిస్తాయి.

మనోశాస్త్రం ద్వారా బౌద్ధిక క్షమతను కొలవటానికి I.Q. (intelligence quotient) అని పరీక్షలు చేస్తుంటారు. దీని ఆధారం మీదనే వ్యక్తుల ప్రతిభను అంచనా వేస్తుంటారు. అయితే బౌద్ధిక క్షమతను కొలవటానికి ఈ సిద్ధాంతం సరైనది కాదు. మానసిక ప్రఖరత కలిగిన అనేకమందిని నిశితంగా పరిశీలించిన పిదప అసాధారణ ప్రతిభా సంపన్నుల అనేక ఉదాహరణలు కనిపిస్తూ ఉంటాయి. అటువంటి వారిలో ప్రఖ్యాత వైజ్ఞానికవేత్త, సాపేక్ష సిద్ధాంత కర్త అయిన 'ఐన్‌స్టీన్' కూడా ఉన్నారు. అతనిని విద్యార్థిదశలో మందబుద్ధి కలిగిన వాడిగా అనుకొనేవారు. ఈ కారణంగానే ఒకనాడు అతనిని స్కూలు నుండి పంపివేశారు. అయితే తరువాత కాలంలో చిన్న వయస్సులో మందబుద్ధిగా ఉన్న ఈ బాలుడే, తరువాత సుప్రసిద్ధ విజ్ఞానిగా ఎదిగి, ప్రపంచ దృష్టిలో అత్యంత గొప్ప మేధావిగా గుర్తింపు పొందాడు.

ఇటువంటి విలక్షణమైన ప్రతిభ గురించి లెక్కలేనన్ని ప్రమాణాలున్నాయి. ఇటువంటి ప్రతిభ గలవారికి I.Q. తో ఏ విధమైన సంబంధం ఉండజాలదు. ఇటువంటి 'ప్రతిభ' పుట్టుకతోనే లభించే వరంగా అనుకొనే మాట కూడా పాతదని తెలిపోయింది. 'ఆర్థర్ లిండా' అభిప్రాయం ప్రకారం ఎంతో మందిలో వారి జీవిత విధానంలో I.Q. పరిమాణం పెరుగుట గమనించాడు. స్కూలులో I.Q. పరీక్ష ఆధారం మీద మేధావిగా గుర్తింపు పొందిన విద్యార్థి, కొంత కాలానికి ఎందుకూ పనికిరాని వానిగా మారిపోయాడు. ప్రతిభ విషయంలో మనోవిజ్ఞానికులకు సవాలు విసరగల అనేక ఉదాహరణలు కూడా ఉన్నాయి. అందుచేత ఈ విధానం కూడా ఎంతో అసంపూర్ణంగాను, ఏకపక్షంగాను ఉన్నట్లు తేలుతుంది. మొదట్లో మందబుద్ధులుగా అనుకొన్నవారే, మరికొంత కాలానికి అద్భుత మేధా సంపన్న వ్యక్తులుగా తేలిన ఉదాహరణలు గమనించినప్పుడు, మరో క్రొత్త కోణంలో ఈ పరీక్షలను చేయుటకు ప్రేరణనిస్తుంది.

1939లో న్యూయార్క్ నగరంలో ఒక స్త్రీకి నెలలు నిండకుండానే (3 నెలలు ముందుగానే) కవల పిల్లలు పుట్టారు. వారి పేర్లు చార్లెస్-జార్జిలు. 3 సంవత్సరాలు వయస్సులో ఉన్నప్పుడు వీరి తెలివితేటలను పరీక్షించినప్పుడు ఎంతో మంద బుద్ధులని తేలింది. అప్పుడు వీరి I.Q. 6-7 మధ్యలో ఉన్నది. ఇది సామాన్యం కన్నా తక్కువ. న్యూయార్క్ స్టేట్ సైకియాట్రిక్ ఇన్‌స్టిట్యూట్‌లో 'డా. విలియం హార్విజ్' 1963 వీరివురిని తిరిగి పరీక్షించాడు. అప్పుడు వీరి I.Q.లో ఎంతో మార్పు ఉన్నట్లు గమనించాడు. ఆయన జార్జితో ఒక పుట్టినరోజుని చెప్పి, అది ఏ రోజు వచ్చేది, ఆ క్రమంలోనే ముందు రాగల విభిన్న తారీఖులను, రోజులను చెప్పమని అడిగాడు. కొన్ని సెకండ్లలోనే జార్జి ఆ రోజులను తప్పులేకుండా వివరించుట జరిగింది. వందల వేల సంవత్సరాల వెనుక వచ్చే ఫలానా రోజు ఏ తారీఖు, మాసం వస్తుందని సరిగ్గా చెప్పగలిగాడు. రాబోయే వందల సంవత్సరాల తరువాత వచ్చే రోజులను కూడా నూటికి నూరు శాతం సరిగ్గా చెప్పగలిగాడు. అయితే వారెవరికి క్యాలండర్ నియమాలు గురించి ఎటువంటి కనీసజ్ఞానం కూడా లేదు. డా. హార్విజ్ ఎంతోకాలం ఇందుకు

**మనిషిలో అంతులేని అంతర్గత శక్తి ఉన్నది**

గల కారణాన్ని తెలుసుకొనటానికి ప్రయత్నించినా, ఆ విలక్షణత లోని రహస్యకోణాన్ని తెలుసుకోలేకపోయాడు. చివరకు 'ప్రతిభ' అనేది మానవ మస్తిష్కంలో తెలియని రూపంలో నిక్షిప్తమై ఉన్నందున దానిని గురించి తెలుసుకోవటం అనేది ఏ మనో విజ్ఞానానికి సాధ్యం కాదని చెప్పి మౌనం వహించాడు.

ఇంగ్లాండ్‌లోని 'జెడెదియా బక్సన్' పేరుగల వ్యక్తికూడా చార్లెస్ జార్జి తరహాలోనే అద్భుత మేధా సంపన్నుడు. చిన్నప్పుడు ఎంతో మూర్ఖుడుగా ఉన్నందున అతని తల్లిదండ్రులు అతడిని స్కూలుకి పంపి చదివించాలనుకోలేదు. మూర్ఖ బాలునకు చదువు చెప్పించటం వ్యర్థమని అనుకొన్నారు. ఆ విధంగా అతనికి కనీస అక్షరజ్ఞానం కూడా లేదు. ఆశ్చర్యం! కొన్ని సంవత్సరాల తరువాత అతడు అత్యంత క్లిష్టమైన గణిత సమస్యలను చాలా తేలికగా పరిష్కరించగలిగేవాడు. అతని జ్ఞాపకశక్తి అసాధారణమైన రీతిలో ఉండేది. ఒకసారి అతడు థియేటర్‌లో డ్రామా చూస్తున్నాడు. ఒక గంట తరవాత ఆ నాటకంలోని హీరో ఎన్ని సంభాషణలు పలికింది, ఆ శబ్దాల సరైన సంఖ్యను, నర్తకి చేసిన నృత్యంలో ఎన్ని రకాల పద విన్యాసాలు చేసింది. మొత్తం సంఖ్యలను తప్పులేకుండా చెప్పి అందరిని ఆశ్చర్యపరిచాడు. ఇంతకు క్రితం తనకు ఎంతో అభ్యాసం ఉన్నట్లుగా అలవోకగా అన్ని సంభాషణలను యదాతథంగా వర్ణించగలిగాడు. అతని బుద్ధి మీద ప్రామాణిక పరీక్షలు వైజ్ఞానికులు ఎన్నిసార్లు జరిపినా, అన్నిసార్లు వారందరికి 'బక్సన్' యొక్క ప్రతిభని ఒప్పుకోవలసి వచ్చింది. ఒకసారి అతనికి 365,365,365,365 సంఖ్యలనిచ్చి ఒకేసారి వాటిని హెచ్చించి చెప్పమని కోరారు. ఒక్క నిముషంలోనే అతడు సరిగ్గా గుణించి చెప్పి అందరిని దిగ్భ్రాంతికిలోను చేయగలిగాడు. ఇంతకు తేలిన విషయమేమనగా అతనికి గణితం గురించి, ఆధునిక నియమాల కనీస ప్రారంభజ్ఞానం కూడా లేదు.

తమ పరిశోధనకాలంలో డా॥ డి.సి.రీఫ్ మరియు యల్.హెచ్.స్నీడర్ కలసి ఒక వ్యక్తిని ఉదాహరణగా చూపారు. 4 అంకెల వర్గమూలం (square root), ఇంకా 6 సంఖ్యల ఘనమూలం (cube root) గురించి చెప్పమనగా, ఆ వ్యక్తి క్రమంగా 4 సెకండ్లు, 6 సెకండ్లలో పరిష్కరించి చూపాడు. ఈ ఘటన 1931లో జరిగింది.

1970లో డేవిడ్ ఎస్. విస్కోట్ పేరుగల ఒక విజ్ఞాని బోస్టన్‌లోని ఒక మహిళ 'హైరియర్' అనే సంగీతాన్ని అధ్యయనం చేసింది. ఆమె ఒక అసాధారణ ప్రతిభగలదిగా ప్రఖ్యాతిగాంచింది. 'మోజార్ట్', 'బియోవన్', 'స్కవర్ట్', 'డెబూసీ', 'ప్రోకోఫిఏవ్' వంటి విశ్వవిఖ్యాతులు; ఇతర లెక్కలేనంత సంగీతజ్ఞుల సమక్షంలో ఆమె సంగీతపు ధ్వనులను వినిపించింది. ఆశ్చర్యకరమైన విషయం ఆమె సంగీతాన్ని ఎన్నడూ అభ్యసించి ఎరుగదు. ఆమెకు లయ, తాళ, స్వర రాగాల గురించి కొంచెము కూడా తెలియదు.

'జాన్ వాన్ న్యూమేన్' పేరుగల విద్వాంసునకు గౌరవనీయమైన గణితజ్ఞ పదవి లభించింది. ఆయన కఠినాతికఠినమైన గణిత ప్రశ్నలకు ఏ విధమైన హెచ్చవేతలు, భాగాహారాలు చేయకనే, ఏ యంత్ర సాధన సహాయం లేకుండానే జవాబులు ఇవ్వటంలో ప్రఖ్యాతి వహించాడు. యూరోపియన్ విద్వాంసులు, గణితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఈయన వద్దకు వచ్చేవారు. మన భారతదేశంలోని సుప్రసిద్ధ గణికురాలైన శకుంతలాదేవి మాదిరిగానే అమెరికాలోని ఛీఫ్ జస్టిస్ చార్లెస్ ఇవాన్ హ్యూజెస్ మస్తిష్కాన్ని కూడా 'ఎలక్ట్రానిక్ కంప్యూటర్' అని అనుకొనేవారు. ఒకసారి ఆయన తన స్టెనోగ్రాఫర్‌కి ఒక ఉపన్యాసాన్ని రెండు గంటలసేపు డిక్టేటు చేసాడు. రెండు గంటల తరవాత ఆయన ఆ నోట్సు చదవకుండానే, ఒక్క తప్పు లేకుండా తిరిగి చెప్పేవాడు. ఆయన అద్భుత మేధా చర్చనీయాంసమైనది. ఆయన గురించి అమెరికాలో ఎంతో గొప్పగా చెప్పుకొనేవారు.

వైజ్ఞానికుల ఊహల్లో, ఇంకా మనోవైజ్ఞానిక క్షేత్రపు ప్రయోగ పరీక్షల్లో తేలిన ఖచ్చితమైన ఆధారాల మీద మానసిక ప్రతిభ యొక్క కారణాలను స్పష్టంగా వ్యాఖ్యానించుట ఎంతో కష్టం. బుద్ధి విశ్లేషణ, దాని తీక్షణతను నిర్ధారించుటకు తెలియజెప్పే I.Q. వంటి కొలమానం అత్యంత చౌకబారు విధానమని తేలింది. యదార్థమేమంటే ఈ పరిశీలనలో, పరీక్షలలో బుద్ధి కుశలతలోని ఒక స్థూలభాగం మాత్రమే మనకు పట్టులో కొస్తుంది. అసలైన తెలివి (Intelligence) యొక్క పక్షం ఎంతో గొప్ప, మహత్వపూర్ణమైన ఆవిష్కారాలకు జన్మధాత్రి. ఎటువంటి పరీక్షలకు అది అందదు. శక్తివంతమైన కల్పనలు, (ప్రఖర)

**రిటైర్ అయిన తరువాత కూడా జీవితం ఉన్నదని తెలుసుకున్నవారికి వృద్ధాప్యం రాదు**

తీక్షణమైన ఆలోచనల ద్వారా వీటిని తెలుసుకోవటం అసాధ్యం. ధృవప్రాంతాలలో కనిపించే మంచుకొండల విశాల భాగం 3/4 వంతు జలంలో మునిగి, 1/4 వంతు మాత్రమే బయటకు కనిపిస్తున్నట్లు, మస్తిష్కపు ప్రతిభ కూడా దాదాపు ఇటువంటి స్థితిలోనే ఉంటుంది. దానిలోని అతి చిన్నభాగం బుద్ధిగా వ్యక్తమవుతూ ఉంటుంది. దీనితోనే మానవుడు తన దైనందిన జీవితపు క్రియాకలాపాలను నిర్వర్తిస్తుంటాడు. దీని అధిక భాగం మాత్రం ప్రసుప్తస్థితిలో ఉంటూ, మనిషికి ఉపయోగ పడకుండా ఉండిపోతుంది.

పుట్టుకతోనే వచ్చే అసాధారణ ప్రతిభ గురించి కొన్ని సునిశ్చిత కారణాలను మానసిక విజ్ఞానవేత్తలు, న్యూరాలజిస్టులు చెప్పలేరు. వంశపరంగా 'ప్రతిభ' వస్తుందని అనుకోవటానికి కూడా అవకాశాలు కనిపించవు. మూర్ఖ తల్లిదండ్రులకు మేధావి సంతానం, అలాగే ఎంతో మేధావులైన తల్లిదండ్రులకు మూర్ఖ సంతానం కలుగవచ్చు. అన్నింటికన్నా అత్యంత రహస్యమైన, ఇంకా దిగ్భ్రాంతిని కలుగచేయు సంఘటనలలో ఎటువంటి శిక్షణ లేకపోయినా, విశిష్టరీతిలో ప్రకటితమయ్యే ప్రతిభ కొంతమంది వ్యక్తులలో అకస్మాత్తుగా ఎగసిపడి వ్యక్తమవుతుంది.

ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నులు, దీని సంబంధం జన్మ జన్మాంతరాల సంస్కారాలతో కలసి ముడిపడి ఉంటుందని చెప్తూ ఉంటారు. ఈ విధంగా అనాయాసంగా లభించే తెలివి తేటలు, ప్రతిభ రూపంలో కనిపించే విశేషాలన్నీ పూర్వజన్మలో సంపాదించుకొన్న వరాలు. శరీరం మరణించినా కూడా, సంస్కారాల కర్మలు సూక్ష్మరూపంలో తయారై, తిరిగి క్రొత్త జన్మతో కలిసి ప్రకటితమవుతూ ఉంటాయి. ఈ క్రొత్త జీవితంలో అటువంటి ప్రతిభా సంపన్నతగల వ్యక్తికి ఏ శిక్షణ లభించినా కూడా ఈ వరదానం పూర్వజన్మపు సంచిత జ్ఞానంగానే అభివ్యక్తీకరించబడుతుంది.

*– అఖండజ్యోతి, జనవరి 1984*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

## మోక్ష సుఖం

*విక్రమాదిత్యుని రాజ్యంలో సదాచారి, సంతోషి అయిన ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు పేదవాడవటంతో భార్యా ప్రేరణతో, ధన సంపాదన కొరకు ఇంటి నుండి బయలుదేరి, అరణ్యంలో ఉన్న ఒక మహాత్ముడిని కలిశాడు. ఆయన ఇతని బాధ విని కొంత ఆశ్వాసన కలిగించి, విక్రమాదిత్యునికి ఒక లేఖలో ఇలా వ్రాసాడు. "నీ కోర్కె తీరే సమయం ఆసన్నమైంది. నీ రాజ్యాన్ని ఈ బ్రాహ్మణునకిచ్చి, ఇక్కడకు వచ్చి చేరు..."*

*బ్రాహ్మణుడి నుండి అందుకొన్న లేఖను విక్రమాదిత్యుడు చదివి ఎంతో ఆనందం పొందాడు. బ్రాహ్మణునకు తన రాజ్యాన్ని సమర్పించుటకు సన్నాహం ప్రారంభించాడు. రాజ్యం త్యాగం చేయుటలో ఇంత ఉత్సాహం, ఇంత ఆనందం పొందుతున్న రాజుని చూసిన ఆ బ్రాహ్మణుడు ఆలోచనలో పడ్డాడు. రాజుగారే ఈ రాజ్యాన్ని తృణప్రాయంగా ఎంచి దానంచేసి ఆ మహాత్ముని చెంతకు చేరుటకు ఇంతగా ఉత్సాహాన్ని చూపుతున్నాడంటే, రాజ్యం సుఖం కంటే గొప్ప సుఖం ఏదో ఆ మహాత్ముని వద్ద ఉండే ఉంటుంది అని నిశ్చయించుకొని రాజుతో ఇలా అన్నాడు. మహారాజా! నేనిప్పుడే మహాత్ముని వద్దకు తిరిగి వెళ్తున్నాను, తిరిగి వచ్చి రాజ్యాన్ని స్వీకరిస్తాను" అని చెప్పి యోగి వద్దకు చేరి "భగవాన్! రాజుగారు రాజ్యాన్ని త్యాగం చేసి తమరి వద్దకు వచ్చుటకు అత్యంత ఆతురత చూపుతూ పొంగిపోతున్నాడు. అందువలన రాజ్యంకంటే కూడా ఏదో పెద్ద వస్తువు మీ వద్ద ఉన్నట్లుగా అనిపిస్తున్నది. అదే నాకు ఇవ్వండి!" అని అన్నాడు.*

*మహాత్ముడు ప్రసన్నుడై ఆయనకు యోగక్రియను నేర్పించాడు. అప్పుడా బ్రాహ్మణుడు పరిపూర్ణ తపస్విగా మారి మోక్ష సుఖాన్ని పొందాడు. మోక్షసుఖం ముందు రాజ్యసుఖం ఎంతో తుచ్ఛమైంది!*

*– అఖండజ్యోతి, మార్చి 1984*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**పేదవాడిగా పుడితే బాధపడకు. పేదవాడిగా చనిపోతుంటే బాధపడక తప్పదు**

# పురుషార్థం

చేపలన్నింటిలోను ఒక రకమైనటువంటి విద్యుత్తు ఉత్పన్న మవుతుంది. అలా తమలో ఉత్పన్నమైనటువంటి విద్యుత్తు (శక్తి)ని సవ్యమైనటువంటి రీతిలో ఉపయోగించుకుని అవి వేటాడే సమయంలో తమ ఎదురుగా ఉన్న ఎరను (శత్రువును) ఒకే దెబ్బతో స్పృహ కోల్పోయేటట్లుగా చేసి, తమ ఆహారాన్ని సంపాయించుకుంటాయి. ఈ రకమైనటువంటి శక్తి (విద్యుత్తు) చేపలన్నింటిలో ఉంటుంది. ఇటువంటి వేట చేపలన్నింటికి చాలా సులభంగా ఉంటుంది. ఈ రకమైనటువంటి వేటలో 'షార్క్' అనే చేప చాలా ప్రసిద్ధికెక్కినది. తన యొక్క ఆకృతిని అనుసరించి 600 ఓల్ట్స్‌శక్తిగల విద్యుత్తును ఉత్పన్నం చేసుకుంటుంది. ఇంత శక్తిగల విద్యుత్తు ఘాతానికి ఎటువంటి ప్రాణి అయినా మాడి మసయిపోవాల్సిందే!

కొంతమంది పరిశోధకులు (సైంటిస్ట్) అసలు ఈ చేపలలో ఇలాంటి అద్భుతమైనటువంటి (విద్యుత్తు) శక్తి ఎలా ఉత్పన్నమవుతుంది? అని పరిశోధించిన తరువాత వారు తేల్చి చెప్పినదేమిటంటే ఈ రకంగా విద్యుత్తు ఉత్పాదన చేసేటటు వంటి అవయవము ప్రతిచేప శరీరంలో ఉంటుంది. కానీ కొన్ని చేపలు ఆ శక్తిని సవ్యమైనటువంటి రీతిలో కాకుండా ఇతర కార్యక్రమాలకు ఉపయోగించుకోవటం మొదలుపెట్టాయి. షార్క్ చేపలాగా తనలోని శక్తిని సమర్థవంతంగా ఉపయోగించి ఎదుట ఉన్న ప్రత్యర్థిని మట్టుపెట్టలేవు. అందుచేత అవి షార్క్ చేపలాగా చమత్కారాలు చేయలేవు. కానీ ఈ షార్క్ చేపలాగా మిగతా చేపలు కూడా తమలో ఉన్నటువంటి ఈ శక్తిని గుర్తించి, తమశక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తే దీన్ని సాధించగలవు!

మానవుడు శక్తుల యొక్క భాండాగారము. దానిని కనుక మనం గుర్తించగలిగితే ఎంత ఆశ్చర్యము కలుగుతుందంటే దానిని మాటలలో వర్ణించలేము. కానీ అవి కొంతమందిలో మాత్రమే కనిపిస్తాయి, కొంతమందిలో కనిపించవు. దానికి కారణం ఒకటే అదేమిటంటే తనలో ఉన్న శక్తుల యొక్క భాండాగారాన్ని గుర్తించినవాడు, ఆ శక్తులను బాగా పరిశోధించి తన అభ్యున్నతికి ఉపయోగపడే విధంగా కృషిసల్పడం మొదలు పెట్టాడు. అలాకాకుండా రెండవ కోవకు చెందిన వారు అలా చేయలేదు.

భూమి సారవంతమైనది అన్నమాట నిజమే. కానీ పురుష ప్రయత్నమనేది (మానవ) చేయకుండా అనాయాసంగా భూమిలో పంటను పండించగలమా? 'పురుషార్థము' అంటే పురుష ప్రయత్నము. ఇది ప్రతిచిన్నపనికి, పెద్దపనికి కూడా అవసరమే కదా! ఆ పురుష ప్రయత్నమనేది లేకపోతే, ఎదురుగా ఉన్న కంచంలో నుంచి ఒక్క ముద్దనైనా నోటికి రావటం జరగదు. అసలు పురుష ప్రయత్నము అంటే ఏమిటంటే ఏదైతే శక్తి తనలోపల ఉన్నదో, దానిని సవ్యమైనటువంటి రీతిలో ఉపయోగించుకోవడం. మానవుని యొక్క పురుష ప్రయత్నాన్ని ప్రశంసించడం ఎందుకంటే అతను చేసే ప్రయత్నంలోనే అతని అభ్యున్నతి అనేది ఆధారపడి ఉంటుంది.

ప్రపంచంలో లెక్కకు అందనంత మంది విశిష్టమైనటువంటి వ్యక్తులు ఉన్నారు. వాళ్ళలో తమ తమ కోరిక తీవ్రతను బట్టి, తమ తమ పరిధులలో అసాధారణమైనటువంటి ఫలితాలను పొందగలిగారు. అలాంటి ఫలితాలను చూచిన ప్రజలు వారిని చమత్కారులుగాను, అదృష్టవంతులుగాను లేక వరాలు పొందినవారుగాను పరిగణిస్తారు. నిజానికి అటువంటివి ఏవి ఉండవు. కేవలం వారి యొక్క తెలివితేటలు, శ్రద్ధ, కఠిన పరిశ్రమ పేరే చమత్కారము. ఇలాంటి వైభవము (తెలివి తేటలు) ప్రతి వ్యక్తిలోను కావలసినన్ని ఉన్నాయి. కానీ దీనిని తెలుసుకోవాలని, ఎలాగైనా సరే సాధించి పొందాలని కొంత మంది మాత్రమే ప్రయత్నిస్తారు.

మానవులలో శారీరిక ఆకృతి దృష్ట్యా అందరి శరీరాలు ఒకే రకంగా ఉంటాయి, అలాగే మస్తిష్కం కూడా ఒకేరకంగా ఉంటున్నది. చివరకు కష్టసుఖాల విషయంలో కూడా అందరిలోను సమానంగానే ఉంటాయి. సహకరించేవారు, అడ్డుపడేవారు ప్రతి ఒక్కరికి ఉంటారు. అయినప్పటికీ ఈ అవరోధాలన్నింటిని అధిగమించి కొంతమంది మాత్రమే అభ్యున్నతిని సాధించగలరు. కొంతమంది దిగజారిపోతారు. మరి కొంతమంది త్రిశంకులులాగా అటుఇటు కాకుండా మధ్యలో వ్రేళ్ళాడుతుంటారు! ఇది వారి యొక్క ప్రతిభ మరియు శ్రద్ధల మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. దీనికి ఎవరికి వారే బాధ్యులు.

*– అఖండజ్యోతి, జనవరి 1985*

*అనువాదం: కె. సరోజినిదేవి, ఒంగోలు*

**ఇల్లు ప్రేమతో, ఉల్లాసంగా ఉండేలా చూచుకోవాలి**

### కలర్ ఇంజనీరింగ్-2

# శబ్దశక్తి - వాక్ శక్తి

గత సంచికలో రంగుల గురించి చెప్పుకున్నాము. ఇప్పుడు శబ్దముల గురించి, శబ్ద శక్తి గురించి మననం చేసుకుందాం. ఇదంతా మనందరం విన్నదే, మనందరికి తెలిసినదే. నిజం చెప్పాలంటే దీనిని తిరిగి గుర్తుచేసుకోవడమే.

శబ్ద శక్తి, శబ్ద బ్రహ్మ అనే పదాలు అనాదికాలం నుండి వస్తున్నవే. శబ్ద బ్రహ్మ – బ్రహ్మ అంటే సృష్టి కర్త, శబ్ద బ్రహ్మ అంటే శబ్దములతో సృష్టించడం. శబ్ద బ్రహ్మ–నాద బ్రహ్మ అనే పేరుతో గురుదేవులు రచనలతో ఒక వాఙ్మయమే ఉన్నది. ఈ శబ్దశక్తి మనందరి దగ్గర ఉన్నది. దీనిని ఉపయోగించు కోవడం తెలుసుకోవాలి.

పూర్వకాలంలో ఋషులు శాపములు, వరదానాలు ఇచ్చేవారని, అవి తప్పనిసరిగా జరిగేవని మన పురాణాలలో అనేక సంఘటనలు కనిపిస్తాయి. నా తండ్రి మెడలో చచ్చిన పాము వేసిన వాడు ఏడు రోజులలో పాము కాటుతో మరణిస్తాడని అంటే అది జరిగి తీరవలసినదే. దానిని ఆపే శక్తి ఎవరికి లేదు. అంత గొప్పది, శక్తివంతమైనది మనిషికి ఉన్న వాక్‌శక్తి. భగవంతుడు ఏ ఇతర ప్రాణికి ఇవ్వని వాక్ శక్తి మనిషికి ఇచ్చాడు. కానీ ఈనాడు ఆ శక్తిని తిరిగి గుర్తు చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. "ప్రాణ్ జాయె పర్ వచన్ న జాయె" అంటే ప్రాణం పోయినా ఫరవాలేదు, ఇచ్చిన మాట తప్పకూడదని. అందువలన వారి వాక్కుకు అంతశక్తి వచ్చి ఉండవచ్చు. కానీ ఈ కాలంలో ఏమి అలా జరగటం లేదే. ఒక రకంగా అది జరగకపోవటమే మంచిది. మన నోటి నుంచి ఎన్ని అనకూడని మాటలు వస్తుంటాయో ఇవన్నీ జరిగితే పరిస్థితి ఎలా ఉండేదో!

మనం శబ్దాలు లేక వాక్యాలు ఉచ్చరిస్తుంటాము. ఏదేదో మాట్లాడేస్తుంటాము. కానీ మనం మాట్లాడే ప్రతి మాట వెనుక రెండు అంశములు ఉంటాయి. (1) ఆలోచన (2) కోరిక లేక భావన. మనం మాట్లాడేస్తుంటాము. కానీ ఈ రెండింటిని గమనించము. కలర్ ఇంజనీరింగ్‌లో ఈ రెండు అంశములు ప్రముఖ పాత్ర వహిస్తాయి. మీరు మీ చేతిని కదలించి చూడండి, ఆలోచించకుండా చేతిని కదిలించగలరా? ఇలా అనుకోవడం అలా చేసేయ్యడం జరుగుతుంటుంది. ఆలోచనల ప్రముఖ పాత్ర గుర్తించాలి. చేయి కదిలించాలి అనే కోరిక కూడా అక్కడ ఉన్నది. దోమ కుట్టింది, మన చెయ్యి ఆటోమేటిక్‌గా అక్కడికి వెళ్ళిపోతుంది. అప్పుడు కూడా ఈ రెండు అంశములు ఉంటాయి. గమనించగలగాలి అంతే! పుస్తకాలలో ఆటోమేటిక్ రిఫ్లెక్స్ యాక్షన్ (automatic reflex action) అంటారు. ప్రతిచోట ఈ రెండు అంశములు ఖచ్చితంగా ఉంటాయి. మీరు ఏమి చేసినా ఈ రెండు అంశములు అక్కడ ఉండే తీరుతాయి.

అక్షరాల కూర్పుతో పదాలు ఏర్పడతాయి. వాక్కుగా బయటకు వస్తుంది. **వాక్కుకు భావన తోడయితే ఆ వాక్కుకు శక్తి వస్తుంది.** వాక్కుకు సృజనాత్మక శక్తి ఉన్నది. దానిని గుర్తించగలగాలి అంతే! సృష్టి అంతా పంచ భూతాత్మకమైనదని చెప్తారు. ఈ పంచభూతములను (five elements) ఆకాశ (శబ్ద), వాయు (స్పర్శ), అగ్ని (రూపం), జల (రసం, రుచి) పృథ్వి (గంధం / వాసన) అని పిలుస్తారు. ఆకాశము నుంచే అన్నీ ఉద్భవిస్తున్నాయని శాస్త్రాలలో చెప్పబడి ఉన్నది. ఇంకొక విధంగా చెప్పుకోవాలంటే శబ్దం నుంచే మిగిలినవి ఉత్పత్తి అయ్యాయి. బైబిల్‌లో కూడా (genesis 1:3) ఇలా ఉన్నది– God said "let there be light and there was light. అంటే భగవంతుడు అలా అన్నాడు, ఇలా కాంతి వచ్చింది. మనం దీనిని కాంతి (light) కంటే ముందరే శబ్దం (sound) ఉన్నదని అర్థం చేసుకోవాలి. శబ్దం యొక్క ప్రాముఖ్యత ఇక్కడ చెప్పబడుతున్నది. ఫ్లొరెన్స్ షిన్ (Florence Shinn) వ్రాసిన "Your word is your wand" అనే పుస్తకంలో మాటనే మంత్రదండంవలె ఉపయోగించుకోవచ్చు అని చెప్పబడింది.

మనం పెళ్ళిళ్ళలో, శుభ కార్యాలలో చిన్నవారిని పెద్దవారు దీవించడం, ఆశీర్వదించడం ఆనవాయితీ, "సుఖీభవ", "దీర్ఘ సుమంగళీభవ" అని అంటుంటారు. భవ అంటే అలా జరగాలి – సుఖీభవ అంటే సుఖంగా ఉండు. పిల్లాపాపలతో సుఖంగా ఉండు. ఇలా భావపూర్వకంగా, ప్రేమపూర్వకంగా ఉచ్చరించే మాటలకు ఉపయోగం ఉంటుందనే, ప్రభావం ఉంటుందనే అలాంటి పద్ధతులను మన పూర్వీకులు ప్రవేశపెట్టారు.

**బలహీనులు క్షమించలేరు, బలవంతులకే ఆ శక్తి ఉంటుంది**

ఏ పూజ చేసిన దానిలో ఆ సంబంధించిన దేవతను ఆహ్వానించడం, స్థాపించడం జరుగుతుంది. ఆవాహయామి, స్థాపయామి. అంటే దేవతలను ఆవాహన చేసే శక్తి, అక్కడ స్థాపించగలిగే శక్తి మన వాక్కుకి, సంకల్పానికి ఉన్నది.

మనం నిర్వహించే గాయత్రీ యజ్ఞములలో చివరికి శుభకామన వస్తుంది.

**ఓం స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం**
**న్యాయేన మార్గేణ మహీ మహీశాః**
**గోబ్రాహ్మణేభ్యో శుభమస్తు నిత్యం**
**లోకా సమస్తాః సుఖినో భవంతు**

మంత్రార్థాన్ని భావపూర్వకంగా ఉచ్చరిస్తే అలా జరిగి పోతుంది. "ప్రజలందరు చక్కగా పరిపాలింపబడుగాక, రాజులు (మంత్రులు, ఆఫీసర్లు) న్యాయంగా పరిపాలించాలి. గోవులు, బ్రాహ్మణులు (సమాజానికి మేలు కోరేవారు, మేలు చేసేవారు) సుఖంగా ఉండాలి. లోకంలోని అందరూ సుఖంగా ఉండాలి"

**"యద్భావం తద్భవతి"** భావం ఎలా ఉంటే అలా జరుగు తుందని శాస్త్ర వచనం. ఈ సిద్ధాంతాన్ని మనం నిత్య జీవితంలో ఉపయోగించుకోగలగాలి.

ఒక అల్లరి పిల్లవాడు ఉన్నాడని అనుకుందాం. అందరు వాడిని అల్లరి పిల్లవాడు, అల్లరి పిల్లవాడు, వీడితో వేగలేకుండా ఉన్నాము అంటున్నారు. కానీ ఇలా అనడం వలన ఏమవుతుంది? అసలే అల్లరి పిల్లవాడు **"యద్భావం తద్భవతి"** సూత్రాన్ని అన్వయించుకుంటే, ఇలా పదే పదే 'అల్లరి పిల్లవాడు, అల్లరి పిల్లవాడు' అని అనటం వలన వాడు ఇంకాస్త అల్లరి పిల్లవాడుగా మారే ప్రమాదమున్నది.

ఒక పిల్లవాడు సరిగ్గా చదువుకోవడం లేదు. "ఉత్త వెధవ, పనికిమాలిన వాడు, ఏమవుతాడో ఏమో" అని పదే పదే అనుకోవడం, అనడం వలన; ఇలా పదే పదే బాధపడటం, దిగులు పడటం ఆ పిల్లవాడిని ఇంకాస్త చిక్కుల్లో పడేస్తుంది.

అందువలన మన ఆలోచనలు, మాటలు మంచిగా ఉండటం ఎంతైనా అవసరం, లేకపోతే మన మాటలే మన కొంపలు ముంచుతాయి. మనం పిల్లలు మంచిగా మారేందుకు దోహదపడే ఆలోచనలు చేయాలి. అల్లరి పిల్లవాడిని మార్చాలంటే ఆ పిల్లవాడిని మనస్సులో ఊహించుకుని "వాడు మంచి పిల్లవాడు, వాడు మంచి పిల్లవాడు" అని పదే పదే పని కట్టుకుని భావపూర్వకంగా నెమ్మది నెమ్మదిగా అనడం వలన ఆ పిల్లవాడి ప్రవర్తన మారుతుంది. మీ వాక్కు ప్రభావాన్ని చూడటానికి ఎక్కువ రోజులు ఏమీ పట్టదు. అలాగే చదువుకోని పిల్లవాడయితే వాడిని ఊహించుకుని, ఇలా అనవచ్చు "వాడు బాగా చదువుకుంటున్నాడు, క్లాసులో వాడికి మంచి మార్కులు వస్తున్నాయి" అని పదే పదే అంటూ ఉంటే నెమ్మది నెమ్మదిగా ఆ పిల్లవాడిలో మార్పు కనిపిస్తుంది.

ఒకావిడ, సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ఆవిడ ఒక గురువుగారి ఉపన్యాసాలకు వెళ్తుండేది. ఆవిడకు ఆయన చెప్పే విషయాలు, విధానం బాగా నచ్చింది. అవకాశం వచ్చినప్పుడల్లా వెళ్ళడానికి ఉవ్విళ్ళూరుతుండేది. కానీ ఆవిడ భర్తకు అలా వెళ్ళడం ఇష్టం ఉండేది కాదు. ఇంటికి తిరిగి రాగానే ఆవిడను ఏదో ఒకటి అంటుండేవాడు. ఉపన్యాసానికి వచ్చినప్పుడు ఇంటికి వెళ్తే ఆయన ఏమంటాడో అనుకుంటూ ఇంటికి వెళ్తుండేది. ఆవిడకు ఇంటి పరిస్థితిని మార్చుకునేందుకు ఇలా అనుకోమని ఉపాయం చెప్పారు. "మా ఆయన చాలా మంచివాడు. నేను అంటే చాలా ప్రేమ. నాకు బాగా సహకరిస్తున్నాడు, నాతోపాటు ఉపన్యాసాలకు వస్తున్నాడు" ఇలా పదేపదే, నెమ్మదినెమ్మదిగా, భావపూర్వకంగా అనుకోవడం వలన, అనడం వలన కావలసిన మార్పులు వచ్చాయి.

అంత శక్తి ఉన్నది మన వాక్కుకు, మన వాక్శక్తిని ఉపయోగించుకుని అన్ని రకముల పనులను సానుకూలం చేసుకొనవచ్చును. మొట్టమొదట మన అనుమానాలను, భయాలను వదలిపెట్టాలి. విశ్వాసం పెంపొందించుకోవాలి. నకారాత్మకమైన (negative) మాటలను రానీయకూడదు.

ఇలా చేసి చూడండి. మీ ఇంట్లో వాళ్ళని, మీ స్నేహితులను ముఖ్యంగా బాధలలో ఉన్నవారిని మనస్సులోకి తెచ్చుకుని "సుఖీభవ, సుఖీభవ, సుఖీభవ" అని ముచ్చటగా మూడుసార్లు మనసారా అనండి. కనీసం రోజుకి మూడుసార్లు ఇలా చేసి చూడండి. "యద్భావం తద్భవతి". వాళ్ళు సుఖంగా ఉన్నట్లు మీకు కనిపిస్తుంది. ముఖంలో కొంచెం తెరిపి, కాంతి కనిపిస్తాయి. రోజులు గడచిన కొద్దీ మంచి పరిణామాలను చూడగలుగుతారు. "వాళ్ళు సుఖంగా ఉంటే నాకేమి లాభం?" అనే ప్రశ్న రావచ్చు. ముందు మీకు మీ వాక్కుకు ఉన్న శక్తి తెలుస్తుంది. మీ కోసం కూడా మీరు ఉపయోగించుకోవచ్చు.

**మంచిని విను, మంచిగా మాట్లాడు**

మన వాక్కు ఎక్కువ శక్తివంతం కావాలంటే మనం మన వాక్కుకి విలువ ఇవ్వాలి. అంటే మనం చెప్పినది, అనుకున్నది చేయగలగాలి. ఒక గంట సేపు చదువుకుంటాననుకుంటే ఆ గంట ఇక చదువుకోవాలి, అటు ఇటు పోకూడదు. ఎక్కడికో ఫలానా సమయానికి వస్తామని చెప్పాము. చెప్పింది చేయాలి. మనం చెప్పిందేగా! అలా మీరు అనుకున్నది, చెప్పింది చేసుకుంటూ పోతే మీరు అనుకున్నవి అన్నీ జరగటం మొదలవుతాయి. **మన ఆలోచనలకు, వాక్కుకు, చేతలకు సమన్వయం ఉండాలి. అంటే అనుకున్నది చెప్పాలి. చెప్పింది చేయాలి.** దీనినే త్రికరణ శుద్ధి అని అన్నారు మన పెద్దలు.

అనేకమంది వారికి కావలసిన దానిని వదిలివేసి అక్కర్లేని దానిని గురించి ఆలోచిస్తుంటారు. మాట్లాడుతుంటారు. మీరు మాట్లాడుతున్నది మంచిదా చెడ్డదా అని ఆ శబ్దాలకు తెలియదు. శబ్దాలకు తగిన ఫలితాలు మాత్రమే ఉంటాయి.

"నేను ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళకూడదు, నేను ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళకూడదు" - ఇలా అనుకుంటుంటే మీరు ఆఫీసుకు ఆలస్యం అవుతూనే ఉంటారు.

"ఇంత పని నేను చేయలేను. ఇంత పని నేను చేయలేను" ఇలా అనుకుంటుంటే, ఇలా బాధపడుతుంటుంటే మీరు చెయ్యలేని పని మీ నెత్తిన పడుతూనే ఉంటుంది.

"పిల్లలతో (పనితో) చచ్చిపోతున్నాను, పిల్లలతో చచ్చిపోతున్నాను" ఇలా అనుకుంటూ ఉంటే భరించలేని కాళ్ళనొప్పులు, కీళ్ళనొప్పులు తరుచూ వస్తుంటాయి.

"మా అమ్మాయికి జలుబు చేస్తుందేమో" అనుకుంటూ స్వెట్టర్లు తగిలిస్తుంటారు. అమ్మాయికి జలుబు రానే వచ్చింది. భయపడినంతా జరిగింది. మీరు భయపడ్డారు కనుకే జరిగింది. (తగిన జాగ్రత్తలు తీసుకోవద్దని చెప్పడం ఈ వ్యాసం ఉద్దేశ్యం కాదు)

"నాకు టైం సరిపోవడం లేదు, నాకు టైం సరిపోవడం లేదు" ఇలా అనుకునే టైం ఎప్పుడు సరిపోదు.

అందువలన మంచిగా ఆలోచించండి. మంచిగా మాట్లాడండి - "తథాస్తు దేవతలు ఉంటారు" అనేవారు.

అమ్మాయికి (అబ్బాయికి) పెళ్ళికావడం లేదు, ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇలా భావపూర్వకంగా ఉచ్ఛరించండి.

అమ్మాయి (అమ్మాయి పేరు)కి పెళ్ళి చక్కగా జరిగి పోయింది. సుఖంగా ఉన్నది. ఇలా పదే పదే అనాలి. ఇల్లు అద్దెకు దొరకటం లేదు - "నాకు అన్ని సౌకర్యాలు ఉన్న ఇల్లు లభించింది" (ఫలానా చోట కావాలనుకునేవారు ఆ చోటును (place, area) కూడా ఆ మాటలలో చేర్చండి.

ఇలా అన్ని రకముల పనుల కొరకు చేసే ప్రయత్నాలతో పాటు ఈ విధంగా వాక్‌శక్తిని ఉపయోగించడం వలన పనుల సానుకూలమవుతాయి.

ఈ సైన్సు అందరిది. కానీ మీరు చేసుకునే ప్రయత్నాలు మీవే. మీరు చేస్తున్నవి ఇతరులకు చెప్పకండి. ఇతరులు "ఆఁ అనుకుంటే జరిగిపోతుందా" అని అనుకుంటుంటే, అంటుంటే ఆ మాటలు మీ ప్రయత్నాలకు అడ్డు తగులుతాయి.

(సశేషం)

- ముక్కామల రత్నాకర్
మొబైల్: *94405 20865*

## స్వామి దయానంద

*సంత్ విరజానంద తన కుటీరం లోపల ఆసీనుడై ఉన్నాడు. తలుపు తట్టిన శబ్దము ఆయనకు వినిపించగా, విరజానందుడు ప్రశ్నించాడు-"వెలుపల ఎవరు?" వెలుపల నుండి జవాబు రాలేదు తదుపరి రెండు, మూడు పర్యాయాలు పిలచినా, జవాబు రాకపోయేసరికి, కుటీరం వెలుపలికి వచ్చాడు. వెలుపల మూలశంకర్ నిలబడి ఉండుట చూసి ఇలా ప్రశ్నించాడు. "ఏమిటి? పిలిచినా జవాబివ్వలేదు?" మూలశంకర్ ఈ రీతిగా జవాబిచ్చాడు - "నేను ఎవ్వరైనది నాకు తెలియనంత వరకు, నేనెవరినని మీకు జవాబివ్వగలను? సంత్ విరజానందుడు ప్రేమాస్పదుడై వచ్చిన వాని వీపుపై తట్టి "రా రాకుమారా! ఎంతకాలం నుండి నీ రాకకొరకై ఎదురు చూస్తున్నాను!" దివ్యదృష్టి కలిగిన గురువు మంచి ప్రతిభా సంపన్నుడైన శిష్యుని కలిశాడు. ఈ రీతిగా సద్గురు కృపతో మూలశంకరుడనే వాడు, ప్రగతి పథంలో సాగుచూ స్వామి దయానంద నామంతో కీర్తి ప్రతిష్టలను ఆర్జించాడు.*

*- అఖండజ్యోతి, ఆగస్టు 2013*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**విలువైన సమయం చిటపటలతో చిత్తవుతుంది**

బాలల నిర్మాణం

# పిల్లలకు మర్యాద నేర్పాలి

సామాజిక ప్రవర్తనలో సంభాషణ, ఇచ్చిపుచ్చుకోవటాలు, పరస్పర సంబంధములు మొదలైన అంశములన్నీ ఉంటాయి. ఈ మూడింటిలో నైపుణ్యము కలిగిన వ్యక్తిని మంచి మొనగాడని, వీనిలో ఏమాత్రము నైపుణ్యము లేకుండా మొరటుగా మెలగే వ్యక్తిని తెలివిహీనుడని అంటారు.

మర్యాదను, మంచితనమును వ్యక్తము చేసేదే 'సద్వ్యవహారము' అనిపించుకుంటుంది. సహృదయము లేనప్పుడు అక్కడ మర్యాద, వినమ్రతకు స్థానమే ఉండదు. అలాంటి వ్యక్తి ఇతరులను ఎంతమాత్రము ప్రభావితము చెయ్యలేడు. అందుచేత మనిషి అంతఃకరణములోనే మంచి-మర్యాదలను కలిగి ఉండాలి. దానితోపాటే ప్రవర్తన కూడా సౌమ్యముగా ఉండాలి. వాస్తవానికి మర్యాద అనేది ఒక అలవాటు. మనం తరచు చేసే పని అలవాటుగా మారుతుంది. అందుచేత బాల్యము నుండే పిల్లలకు 'మర్యాద'ను గురించిన శిక్షణ ఇవ్వటము మంచిది.

'పిల్లలు దేనినైనా ఇట్టే అనుకరిస్తారు' అన్నది సర్వవిదితమైన సత్యము! మంచి-మర్యాద కలిగిన వాతావరణమున్న ఇంట్లో పెరిగిన పిల్లలు సహజముగానే అటువంటి ప్రవర్తనను అలవరచుకుంటారు. ఇంట్లోని కుటుంబసభ్యులు ఉదయము లేవగానే ఒకరినొకరు పరస్పరము పలకరించుకొని అభివాదము చేసుకొనడము, పిల్లలు పెద్దవారికి నమస్కరించడము, పూజా మందిరములో ఇష్టదేవతకు ప్రణమిల్లడము, మృదుమధురముగా సంభాషించుకొనడము, కటువైన మాటలు మాట్లాడకుండా ఉండటం మొదలైనవి మన ప్రవర్తనలో ఉండాలి. పిల్లలు కూడా సహజముగానే వాటన్నింటినీ అనుసరిస్తారు, అలవరచుకుంటారు. సహకారము, సద్భావనలు నిండిన వాతావరణములో పెరిగిన పిల్లలలో సహకారప్రవృత్తి సహజముగానే పెరుగుతుంటుంది. కలసిమెలసి ఉండటము, ఉన్నదానిని పంచుకొని తినడము, త్రాగటము వంటి పద్ధతులను పిల్లలు సులభముగా నేర్చుకుంటారు. ఈ సౌమ్యతతో నిండిన మృదు వ్యవహారము, మర్యాద వారి స్వభావములో ఒక అంగముగా మారుతుంది. పెరిగి పెద్దయిన పిదప ఈ అలవాటు సంఘజీవనములో సహకారమును ఇచ్చిపుచ్చుకొనటానికి ఆధారముగా మారుతుంది.

వివిధరకాలైన సంబంధీకులతో ఎలా మెలగాలో పిల్లలకు చిన్నతనము నుండి నేర్పించాలి. తమకంటే చిన్నవారితో స్నేహపూర్ణకంగా, సమవయస్కులతో మనస్సు విప్పి నిస్సంకోచంగా, పెద్దల యెడల మర్యాదపూర్వకంగా ప్రవర్తించడం, మాట్లాడటం వాళ్ళకు నేర్పించాలి. భోజన సమయములోను, బడికి వెళ్ళేటప్పుడు, రహదారిలో నడుస్తున్నప్పుడు, ఏదైనా ఉత్సవము లేదా ప్రత్యేకకార్యక్రమ సందర్భముగా జనము గుమిగూడినప్పుడు, యాత్రాస్థలాలలో, సామూహిక భోజనములు జరిగేటప్పుడు ఇలా ప్రతిఒక్క సమయము లేదా సందర్భములలో మర్యాదకు సంబంధించిన వివిధరకాలైన నియమాలుంటాయి. వాటికి సంబంధించిన అవగాహన పిల్లలకు బాల్యమునుండే తెలియజేస్తుండాలి.

ఇతరులతో మాట్లాడేటప్పుడు, ప్రవర్తించేటప్పుడు ఒక వ్యక్తియొక్క మర్యాద, సౌజన్యము వ్యక్తమవుతాయి. అదే అసలైన 'మర్యాద'. సౌజన్యము, మర్యాద కలగలిసిన వ్యక్తి ఎడల మనకు గౌరవము, సంవేదనాశీలత కూడా కలుగుతాయి. ఇతరుల హక్కులకు భంగము వాటిల్లకుండా చూడటం, అకారణముగా వారికి చికాకు కలగకుండా చూడటం, అప్రియమైన, అసత్యమైన విషయాలను వారికి చెప్పకుండా ఉండటం, వారి సుఖసౌకర్యాలపట్ల దృష్టిసారించడము ఇటువంటివన్నీకూడా 'మర్యాద'కు సంబంధించిన ముఖ్యమైన అంశములే! ఇటువంటి మర్యాదతో కూడిన ప్రవర్తన, మన వ్యక్తిత్వములోని ఎన్నో లోటుపాట్లను సరిజేస్తుంది. మన ప్రవర్తన వల్ల ఎదుటివారి హృదయము ప్రభావితమవుతుంది, ఇరువురి నడుమ చక్కని మధురమైన బాంధవ్యము చోటు చేసుకుని ఆహ్లాదకరమైన వాతావరణము ఏర్పడుతుంది. ఆందోళన, తడబాటు ఉండవు.

'సత్యమే అయినా కటువుగా చెప్పడము వల్ల ఎదుటివారు గాయపడతారు' అనే అంశముపట్ల జాగ్రత్తవహించాలి. తప్పులు ఎత్తిచూపేటప్పుడు ప్రక్కన ఎవరు లేకపోతే పెద్దగా ఇబ్బంది ఉండదు. అందుచేత అన్ని విధాలైన కార్యకలాపాలలో 'మర్యాద'ను తప్పనిసరిగా పాటించితీరాలి. మృదుత్వము,

ఒత్తిళ్ళకు ఉపశమనం దరహాసమే

సౌజన్యములతో మనిషి వ్యక్తిత్వములో 'మర్యాద-లాలిత్యము'లు చోటుచేసుకుంటాయి. తద్వారా ఇతరులలో మనపట్ల నమ్మకము కలుగుతుంది, మనకు దగ్గరవుతారు.

ప్రతి మనిషి ఎదుటివారినుండి మర్యాదాపూర్వకమైన ప్రవర్తననే కోరుకుంటాడు. తానుకూడా ఇతరులతో మర్యాదగా ప్రవర్తించినప్పుడే ఆ కోరిక నెరవేరుతుంది. 'మర్యాద'కు ప్రతిగా 'మర్యాద'యే లభిస్తుంది. అలాకాక మొరటుగా, అమర్యాదగా ప్రవర్తించే వ్యక్తికి తెరచి ఉంచిన తలుపులు కూడా మూసుకుంటాయి.

పిల్లలకు పసితనము నుండే మర్యాద-మన్ననలతో కూడిన ప్రవర్తనను అలవాటుచెయ్యాలి. సందర్భము కుదిరినప్పుడల్లా వారితో మాట్లాడుతూ 'మర్యాద'కు సంబంధించిన విధానాలను, పద్ధతులను అర్థం అయ్యేలా బోధించాలి. అలాగే జీవితములో వాటి ఉపయోగాలను కూడా వారికి వివరించి చెప్పాలి. కానీ పదే పదే ఒకే విషయాన్ని చెప్పకూడదు. ఇలా చెప్పడం వలన వినేవారికి విసుగు కలిగిస్తుంది. సంభాషించేటప్పుడు ఏ మాటలకు అధిక ప్రాముఖ్యత నివ్వాలి, ఏ విషయమును తక్కువగా మాట్లాడాలి, ఏ విషయమునకు ఏ సమయములో ఎంత సమయమును కేటాయించాలి మొదలైన అంశములను పిల్లలు పెద్దవారు మాట్లాడుకునేటప్పుడు క్రియాత్మకముగా గమనించి నేర్చుకుంటారు.

ఇంటికి బంధువులు, పరిచితులు లేదా ఎవరైనా చాలా గొప్పవారు వచ్చినప్పుడు పిల్లలకు మనము నేర్పిన మర్యాద, మన్ననల తాలూకూ శిక్షణ ఎంతవరకూ ఉపయోగపడింది అన్న అంశమును మనము పరీక్షించుకొనవచ్చు. ఆ సమయములో పిల్లల ప్రవర్తనను పరిశీలించి, ఏమైనా లోటు పాట్లుంటే తరువాత సూచించవచ్చు. ఇంటిలో తమ స్వంత అక్కచెల్లెళ్ళు, అక్కతమ్ముళ్ళతోను, బయట ఇతర స్నేహితుల తోనూ వారి ప్రవర్తన ఎలా ఉన్నదో పరిశీలించి సమయము వచ్చినప్పుడు ప్రేమగా వారికి అర్థమయ్యే రీతిలో కొన్ని సలహాలను ఇవ్వవచ్చు.

వస్తువులను పరస్పరము ఇచ్చిపుచ్చుకునే క్రమములో పిల్లలు మర్యాదను పాటించే విధానమునుకూడా పెద్దలు నేర్పించాలి. పిల్లల భావసంవేదనలు చాలా సూక్ష్మముగా ఉంటాయి. మర్యాద-మన్ననలతో కూడిన ఈవిధమైన ప్రవర్తన ఒక అలవాటుగా మారి వారికి జీవితాంతము ఉపయోగ పడుతుంది. వారి వ్యక్తిత్వము మర్యాదతో నిండిన సౌరభముతో గుబాళిస్తుంది. మాటలలో పెట్టి ఎదుటివారి మర్మాలను తెలుసుకొని, వారిని జయించడము పెద్ద కష్టమైన పని కాదు. అలాకాక దౌర్జన్యపూరితమైన ప్రవర్తన వల్ల అందరిలో ఆందోళన పెరిగిపోతుంది. అది ఎవ్వరికీ హితము కాదు. ఎదుటివారిని గురించి ఎప్పుడూ వ్యంగ్యముగా మాట్లాడటము, ఎగతాళి చెయ్యడము, ఆట పట్టించడము లేదా నిర్లక్ష్యమును ప్రదర్శించడము మంచిది కాదు.

పిల్లలకు అతి సాధారణమైన పనులను చెయ్యడము కూడా ఒక నిర్దిష్టమైన రీతిలో బోధించాలి. చెప్పులను ఎప్పుడూ నిర్దేశితస్థానములో ఉంచడము, కాళ్ళు-చేతులు కడుగుకొన్న తరువాతనే పూజామందిరములోకిగాని, భోజనాల గదిలోకి గాని వెళ్ళటము, మలమూత్రాలను నిశ్చిత ప్రదేశములో విసర్జించడము, చించివేయబడ్డ కాగితము ముక్కలను ఎక్కడ బడితే అక్కడ విసరివేయకుండా ఉండటము. మురికిని ఎప్పటికప్పుడు శుభ్రము చేస్తూండటం మొదలైన మంచి వ్యవస్థీకృతమైన గుణాలన్నీ మర్యాదకు చెందిన అంశములుగా పిల్లలకు తెలియజెప్పాలి.

తుమ్ము, దగ్గు, ఆవులింత మొదలైనవి వచ్చినప్పుడు అందరి ముందు పెద్దగా చప్పుడు చెయ్యకుండా చేతిరుమాలును అడ్డుపెట్టుకొని ఆయా ఇబ్బందులను తీర్చుకొనడము మంచిదని పిల్లలకు బోధించాలి. అలాగే ఎక్కడబడితే అక్కడ ఉమ్మెయ్యడం కూడా మర్యాదకాదు. సామూహిక భోజనాలు, విందులు, వేడుకలు మొదలైన సమయములలో పాటించవలసిన కొన్ని ప్రత్యేకమైన నియమాలను పిల్లలకు తప్పనిసరిగా నేర్పించాలి.

కొంతమంది పిల్లలు గోళ్ళుకొరకడము, చొక్కా లేదా గౌనుకున్న గుండీని తిప్పుకుంటూండటము మొదలైన పనులు చేస్తుంటారు. వాటిని చిన్నప్పుడే ఖండించకపోతే ఆ అలవాటు పెద్దయిన తరువాత కూడా పోదు.

పని, పనిచేసే తీరు, మర్యాదాపూర్వకముగా మాట్లాడటము, ఇతరులపట్ల ఆర్ద్రత కలిగి ఉండటము పిల్లలందరికీ నేర్పించి తీరాలి. తద్వారా అందరు వారిని ప్రేమిస్తారు. వారికి అవసరమైన సహాయసహకారములను అందిస్తారు. తత్ఫలితముగా వారు సార్థకమైన జీవితమును జీవించగలరు.

*- యుగనిర్మాణ యోజన, మార్చి 1981*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**చిరునవ్వులతో జీవించాలి**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# యుగపరివర్తనలో మన బాధ్యత - 3

***ప్రమాదకరమైన పరిస్థితులు ఎదురైనప్పుడు భగవంతుడుకూడా సామాన్య మానవులనుండి సహాయము పొందుతాడని పరమపూజ్యగురుదేవులు ప్రవచించినట్లు గత సంచికలో మీరు చదివి ఉన్నారు. ఇప్పుడు యుగము ఏమి కోరుకుంటున్నది? ప్రస్తుత సమయము ఏమి కోరుకుంటున్నది? ఈ యుగపరివర్తనవేళ మన కర్తవ్యం, బాధ్యత ఏమిటి? అనే అంశములను మనము ఆలోచించాలని పూజ్యగురుదేవులు తెలియజేస్తున్నారు. మానవులం అయినందుకు మనము మన లోపల మానవత్వమును ఉదయింపజేసుకోవాలి. హీనమైన కోరికలకు, వాసనలకు జీవితమును వ్యర్థము చేసుకొనకూడదు అనికూడా గురుదేవులు తెలియజేస్తున్నారు. మనది సాధుసంత్‌ల పరంపర, సాధుసన్యాసులు సమాజము కోసము జీవిస్తారు, తుచ్ఛమైన కోరికల కోసము కాదు అని ఋషివర్యులు ప్రవచిస్తున్నారు. రండి, వారి దివ్యసందేశమును ఇంకా చదువుదాము!***



ఆదిశంకరాచార్యులవారికి భగందరములో గడ్డ ఉండేది. అంత బాధను సహిస్తూకూడా వారు యథావిథిగా పనిచేసేవారు. వినోబా భావే గారికి కడుపులో అల్సర్ సమస్య ఉండేది. ఇరువది సంవత్సరముల నుండి అల్సర్ వ్యాధితో బాధపడుతూ కూడా వారు పనిచేస్తూనే ఉండేవారు. మీరు సాకులు చెప్పవద్దు. 'మా కోరిక నెరవేరితే మేము గాయత్రీ పరివార్ శాఖను నిర్వహిస్తాము' అని నాకు ఆశ చూపవద్దు. వ్యర్థమైన మాటలు మాట్లాడవద్దు. మాకు కోపం వస్తుంది. ఈ శిబిరములో మేము మా వైఖరీవాణితో కాదు, పర-పశ్యన్తి-మధ్యమ వాక్కులతో మిమ్మల్ని మీరు తెలుసుకుంటే, అర్థము చేసుకుంటే, మీ కర్తవ్యాలను, బాధ్యతలను గుర్తెరిగితే ఎంతో బాగుంటుంది. మీ జీవితము సార్థకమౌతుంది. మా ప్రయత్నము సఫలమవుతుంది. అలాకాకపోతే మా ఈ ప్రయత్నములన్నీ వ్యర్థమే! మా జీవిత కాలమంతా ఆధ్యాత్మికత కోసమే వెచ్చించాము. గానుగ ఎద్దువలె 24 గంటలు ఆధ్యాత్మికత కోసమే శ్రమించాము. ఆధ్యాత్మికతను చూస్తే మాకు చాలా చికాకు కలుగుతున్నది. 'ఫలానా పూజ చెయ్యండి, ఫలానా స్తోత్రము చదవండి, మీ జీవితాలలో అద్భుతాలు జరుగుతాయి' అని చెప్పటము ఈనాటి ఆధ్యాత్మికత యొక్క ప్రత్యేకత. శంకరభగవానుల, హనుమంతులవారి, సాయిబాబా, ఆచార్యుల వారి యొక్క వరదానములు ముందర నాకు లభించనివ్వండి, ఇక చూడండి, నా పనితనం, నైపుణ్యము. ఈ వాడలో ఏ ఒక్కరినీ పైకిరానివ్వను. నా మనోరథాలనన్నింటినీ నెరవేర్చుకునే విధముగా అందరినీ ఉపయోగించుకుంటాను' - ఇదీ ఈనాటి ఆధ్యాత్మికవేత్తల ఆలోచనా ధోరణి, ప్రవర్తనాసరళి.

### మనిషిని విశ్వాసపాత్రునిగా మార్చటమే ఆధ్యాత్మికత

'ఈ పూజ చేస్తే అది లభిస్తుంది, ఈ దేవతను సేవిస్తే మీ మనోరథము నెరవేరుతుంది' అని నేను మీకు చెప్పను. అలాంటి పనులు నావల్ల కావు సరిగదా, మాకు ఆ మాటలంటేనే చాలా చికాకు'. చికాకు ఎందుకంటే ఇప్పటికే మేము మీకు కొన్ని వేలసార్లు చెప్పాము, **'మానవుడిని విశ్వాసపాత్రునిగా మార్చగలిగేదే ఆధ్యాత్మికత'** అని. విశ్వాసపాత్రునిగా మారనిదే ఏ దేవీదేవతలు ప్రసన్నము కాలేరు. ఎలాంటి సిద్ధులు, అద్భుతాలు సాధ్యము కావు. తనను తాను విశ్వాసపాత్రునిగా మార్చుకునే ప్రయత్నము, తన నడవడికను, ఆలోచనా విధానమును, దృష్టికోణమును మార్చుకునే ప్రయత్నము చేసినప్పుడే మనిషి లోపల అద్భుతాలు చేయగలిగే శక్తి లభిస్తుంది. కేవలము క్రియాకలాపాలద్వారా, కర్మకాండల ద్వారా దేవీదేవతల అనుగ్రహం, స్వర్గప్రాప్తి పొందాలని,

**చిరునవ్వు దివ్యౌషధంలా పనిచేస్తుంది**

అద్భుతాలను సృష్టించాలని అనుకుంటే అది అసంభవము! సాధుసన్యాసులు అని చెప్పుకునేవారు అడుక్కుంటూ, చెప్పులు దొంగతనము చేస్తూ, ఇతరుల సోదరీమణులను, బిడ్డలను అపహాస్యము చేస్తూ, ఎక్కడపడితే అక్కడ తిరుగుతుంటారు. దొంగలు, మోసగాళ్ళు అంతటా ఉంటారు. వాళ్ళని ఏమి చెయ్యగలము? వీళ్ళల్లో నిజమైన మహర్షియైనవాడుకాని, సాధువుకాని ఒక్కరైనా ఉంటారా? క్రియాకలాపాల గురించి, విధివిధానములగురించి చెప్పమంటున్నారు. దీనికి కావలసిన విధివిధానమల్లా ఒక్కటే ఉన్నది. అది మీ అంతట మీరు మీ స్థాయిని పెంచుకొనగలగటం. మీ ఆలోచనా విధానమును ఉన్నతముగా మార్చుకోవటం. మీ జీవనశైలిలో కొంత మర్యాదా పూర్వకం అయిన మార్పును తెచ్చుకొనడం. మేము చెప్పే ఆధ్యాత్మికతలో లోతు ఉంటుంది, కఠినత్వము ఉంటుంది. ఇందులో మనిషి తీవ్రమైన బాధను తట్టుకొనవలసివస్తుంది. బాధను సహించగలిగిన వ్యక్తికే ఆధ్యాత్మిక విలువ లభిస్తుంది. కష్టపడినదానికి మంచి ఫలితము పొందగలరు. ఆధ్యాత్మికతను సాగించటానికి మీరు చెల్లించవలసిన వెల ఇదే! ప్రమాణ పూర్వకముగా చెప్పగలిగిన విషయమేమిటంటే, నిజమైన ఆధ్యాత్మికత వలన, ఆనందము, శాంతి మీకు లభించగలవు.

### 'విశ్వాసము-క్రియ' ఈ రెండింటి మధ్య తేడా

మీకు కర్మకాండను గురించి తెలుసుకొనటములో ఎంతో అభిరుచి ఉన్నదికానీ, ఆచరించటములో శ్రద్ధ లేదు. కుండలినిని మీరు జాగృతము చెయ్యలేరు. కానీ చెయ్యాలనే కుతూహలము ఉన్నది. పంచకోశజాగరణ చెయ్యాలనే ఇచ్ఛ మీకు లేకపోయినా, తెలుసుకోవాలనే కోరిక ఉన్నది. ఎందుకంటే రహస్యమును గురించి తెలుసుకోవాలనే ఇచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంటుంది. గాయత్రీమంత్రము ఎంత మహత్వపూర్ణమైనదంటే, మీరు దీనిలో కొంచెము శ్రద్ధను జోడించగలిగితే అద్భుతాలను దర్శించగలరు.

ఒక శిష్యుడుండేవాడు. అతడు తన గురువుగారి పాదాలను కడిగి, ఆ నీటిని ఒక సీసాలో నింపి తెచ్చుకున్నాడు. ఎవరైనా వ్యక్తి దుఃఖముతోనో, బాధతోనో వచ్చినప్పుడు, కొంచెము నీళ్ళు తీసుకురండి, నావద్ద అద్భుతమైన జలము ఉన్నది. మీరు తెచ్చుకున్న నీటిలో ఒక్క చుక్క వేస్తాను. ఆ తీర్థము తీసుకుంటే మీ బాధ తొలగిపోతుంది' అని చెప్పేవాడు. చెప్పినవిధముగానే గురువుగారి పాదతీర్థము ఒక్క చుక్కమాత్రమే వారు తెచ్చుకున్న నీటిలో వేసేవాడు. అది పుచ్చుకున్న వెంటనే ఆ వచ్చిన వ్యక్తికి అప్పటివరకు ఉన్న బాధ క్రమముగా తొలగిపోయేది. కష్టము తీరిపోతుండేది. ఒకరోజు గురువుగారు తీవ్రమైన జ్వరముతో బాధపడుతూ శిష్యుని వద్దకు వచ్చారు. 'నువ్వేదో మంత్రజలము ఇచ్చి అందరి బాధలను తొలగిస్తున్నావని విన్నాను. నాకు కూడా ఆ జలమును ఇచ్చి త్వరగా జ్వరము తగ్గించమని' అడిగాడు.

'గురువుగారూ! మీరు సాయంకాలము వరకు కూర్చోండి. ఎంతమంది బాధితులు వస్తారో చూడండి. అందరికీ ఒక్కచుక్క నీరు ఇస్తాను. వాళ్ళ బాధలు తీరిపోతాయి. ఆ ఒక్క చుక్క నీరు మరేమిటో కాదు, మీ పాదతీర్థమే!' అన్నాడు శిష్యుడు.

శిష్యుడు అవతలకు వెళ్ళిన తరువాత గురువుగారు తన పాదాలను తాను కడుగుకొని, ఆ నీటిని అంతటినీ త్రాగేశాడు. కానీ జ్వరము, దాని తాలూకు బాధా ఏమాత్రము తగ్గలేదు.

నువ్వు ఇచ్చే ఒక్క చుక్క నీటితోనే వచ్చినవారి బాధ తీరిపోతున్నది. మరి నేను కూడా ఎక్కువ మోతాదులోనే పాదజలమును స్వీకరించాను. అయినా తగ్గకపోవటానికి కారణమేమిటి?

మీరు స్వీకరించిన నీటికీ, నేను ఇచ్చే నీటికీ తేడా ఉన్నది. నేను ఇచ్చే మీ పాదతీర్థములో శ్రద్ధ, విశ్వాసం జోడింపబడి ఉన్నాయి. మీరు తీసుకున్న జలములో క్రియమాత్రమే ఉన్నది. అద్భుతం అనేది క్రియలో లేదు, శ్రద్ధ, విశ్వాసాలలో ఉన్నది' అని శిష్యుడు జవాబు ఇచ్చాడు.

మీకు 'మాల త్రిప్పటం, జపము చెయ్యటం' అనే క్రియలోనే నమ్మకము ఉన్నది. కానీ గురువుమీద, భగవంతుని మీదా, గాయత్రీమంత్రం మీద విశ్వాసం లేదు. మీకు లోభ, మోహముల మీద తప్ప, మరెవ్వరిమీద, దేనిపైనా విశ్వాసము లేదు. మీకు మీ నైపుణ్యము మీదా, తెలివితేటలమీదా మాత్రమే నమ్మకము ఉన్నది. మీరు ఏదో ఒక్కదానిపైననే నమ్మకముంచితే, అది మీకు తప్పకుండా ఫలాన్ని అందిస్తుంది. మేము కేవలము గాయత్రీ మంత్రమును మాత్రమే జపిస్తాము. మా గాయత్రీ మంత్రము బ్రహ్మాస్త్రముతో సమానమైనది, దీనితో సమానమైన శక్తి కలిగినది మరేదీ లేదు.

**రక్తపోటులాంటి సమస్యలు నవ్వులతో దూరం అవుతాయి**

## సమగ్రసాధనా విధానము

గత సంవత్సరము మేము ఎంతో ఆలోచించి, పరిశీలించిన పిదప, 15 నిముషముల ఉపాసనా విధానమును మీకు అందించాము. అందులో 'సోఽహమ్ సాధన, ముద్రలు' మొదలైనవన్నీ ఉన్నాయి. జపం, ధ్యానం రెంటింటి సమన్వయ స్వరూపమున్నది. సూర్యుడు-సవితాదేవతల ధ్యానముకూడా సమ్మిళితమై ఉన్నది. పంచకోశ శోధనా ప్రక్రియ, దేవపూజనము కూడా జోడింపబడి ఉన్నాయి. సంతులితమైన ఆహారము వంటిది ఈ సాధనావిధానము. ఇది సంపూర్ణమైనది. కుండలినీ సాధన చెయ్యాలని మీరు భావిస్తే, తప్పకుండా మీరు ఇక్కడికి రావలసి ఉంటుంది. మీ ఇంటి వద్ద చెయ్యకూడదు. కొన్ని పనులను అన్ని ప్రదేశాలలోను చెయ్యలేము. ఇది ఉన్నతస్థాయి సాధన. మిమ్మల్ని ఇక్కడకు పిలిస్తే, ఇక్కడి నియమ-నిబంధనలు అత్యంత కఠినముగా ఉంటాయి. మీరు సరిగ్గా అమలు చెయ్యక పోతే మిమ్మల్ని గట్టిగా దండించవలసి వస్తుంది, నిందించవలసి వస్తుంది.

## గాయత్రి యొక్క ఉన్నతస్థాయి సాధన

ఇది శస్త్రచికిత్సతో సమానమైన సాధన. శస్త్రచికిత్స చెయ్యటం తప్పనిసరి అని భావించిన వ్యక్తికి ముందుగా రక్తపరీక్షలు, మధుమేహ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షించకుండా శస్త్రచికిత్స చేస్తే మీ గాయము తగ్గదు సరికదా, అనేక ఇబ్బందులు కలుగుతాయి. అదేవిధముగా ఆధ్యాత్మిక మార్గములో పయనించదలచుకున్నవారిని, పది-పదిహేను రోజులు ఆశ్రమములో ఉండేవిధముగా ఇక్కడకు పిలిపిస్తాము. పరీక్షిస్తాము. ఆధ్యాత్మికపథములో పయనించదలచుకున్న వ్యక్తికి అంతర్గతముగా ఉండవలసిన సంయమనము, నిష్ఠ, చురుకుతనము మొదలైనవి మీలో ఉన్నాయా లేవా అని పరిశీలించవలసి ఉంటుంది. గత సంవత్సరము వచ్చినవారిని తీవ్రముగా మందలించాము. ఉప్పులేని ఆహారమును భోజనముగా అందించాము. ఆధ్యాత్మికమార్గములో పయనించటానికి కావలసిన తీక్షణత, చురుకుతనము మీలో కనపడితే, మిమ్మల్ని ఇక్కడకు పిలుస్తాము. మీరు మా వద్దనే ఉండవచ్చు. వందమందికి సరిపడా స్థానమును కేటాయిస్తున్నాము. అంతకన్నా ఎక్కువమందిని పిలిస్తే ఇక్కడ నిర్వహించడము కష్టమవుతుంది. మా గురుదేవులు మమ్మల్ని సమీపములో ఉంచుకున్న రీతిలో మేము మిమ్మల్ని మా చెంతనే ఉంచుకుంటాము. సామీప్యత వలన కలిగే లాభములు, లభించే శక్తి అవన్నీ మీకు లభించగలవు. ఉదయము పూట మేము చేయిస్తున్న కార్యక్రమములో మా గురువుగారి వరదానములు, మా యొక్క నిర్దేశము, మీరు ఏర్పరచుకునే భావనాచిత్రము ఈ మూడు కలిస్తే పని పూర్తవుతుంది.

మీరు ధ్యానము చేస్తుంటారు, ధారణ చేస్తుంటారు. మీ సామర్థ్యము పెరుగుతుంటుంది. మీ యొక్క స్థాయిని గమనించి మేము మీకు అందించే ఓల్టేజీని ఇంకొంచెము పెంచుతాము. మరింత విద్యుత్తు ప్రవహిస్తుంది. అయితే మీరు సంబాళించు కొనగలరా లేదా అనే విషయమును పరిశీలించ వలసి వస్తుంది. ఇప్పుడు మీరున్న ఈ స్థితిలో ఏమీ కాదు, ఏమీ చెయ్యలేరు. మేము ఇవ్వబోయే శక్తిని తీసుకునే అర్హత మీలో ఉన్నప్పుడే అది ఫలిస్తుంది. మీ లోపల కోరిక లేదా సంకల్పము అనేది లేనప్పుడు సూర్యకాంతిగాని, కనీసము గాలియైనాకాని మీ గదిలోకి ప్రవేశించలేదు. మీ యొక్క ప్రస్తుత స్థితికాని, మీ వ్యక్తిత్వము అనుకూలముగా లేనప్పుడు దేవతా శక్తులుగాని, భగవంతుని శక్తులుగాని, సిద్ధపురుషుల శక్తులు గాని ఏవిధముగా మీ లోపలికి ప్రవేశించగలవు? మీరు తలుపులు మూసుకుని కూర్చుంటే ఎవ్వరూ మీ గదిలోకి ప్రవేశించలేరు, మీకు మిగిలేది రిక్తహస్తములే!

పూజ, ఉపాసన యొక్క క్రియల గురించిన చర్చ ఇంతటితో ఆపుదాము, నిజానికి ఈ మార్గములో మనము ఇచ్చినదాని కన్నా వందరెట్లు ఎక్కువ మనకే లభిస్తుంది. మా గురువుగారు నేర్పించినదే మేము ఆచరించాము. అంతకు వందరెట్లకు మించిన ఫలితమును వారు మాకు అనుగ్రహించారు. మా గురుదేవులు మమ్మల్ని తమ నావలో పయనింపజేసినట్లే, మిమ్మల్ని ఈ భవసాగరమును దాటిస్తాము. అయితే మీరు అలజడి చేయకుండా ప్రశాంతముగా కూర్చోవాలి. అప్పుడే మీరు ఒడ్డుకు చేరగలరు. నావలో ఏమాత్రము గందరగోళము చేసినా నావ తల్లక్రిందులౌతుంది. అందుచేత నిశ్శబ్దముగా కూర్చొనటము మంచిది. నిశ్శబ్దము అంటే ఆధ్యాత్మికత పట్ల శ్రద్ధను ఉత్పన్నము చేసుకొనటము. ఆధ్యాత్మికవేత్త అయిన వ్యక్తికి తన జీవితానికి సంబంధించిన క్రియాకలాపములలో అవసరమైనప్పుడు కొన్ని మార్పులు చేర్పులు చేసుకొనగలిగే మనస్తత్వము ఉండాలి అని మీరు కూడా తెలుసుకోవాలి.

**ఎదుటి వ్యక్తులను ఆకట్టుకోవడానికి చిరునవ్వు ఎంతో ఉపకారి**

## ఆధ్యాత్మికవేత్త క్రియాకలాపములు

ధర్మరాజును స్వర్గమునకు తీసుకువెళ్ళటానికి విమానము వచ్చింది. మా కుక్క కూడా మాతోపాటు వస్తేనే మేము విమానము ఎక్కుతాము అని ధర్మరాజు పట్టుపట్టగా, దేవదూతలు కుక్కతో సహా ఆయనను విమానములో స్వర్గానికి తీసుకు వెళ్ళారు. మీరు కుక్కపిల్లలు కారు. మా బిడ్డలు, మా మేనల్లుళ్ళు. మిమ్మల్ని నదిని దాటించి ఆవలి ఒడ్డుకు చేర్చటము మా బాధ్యత. మీ ఇబ్బందులను, బాధలను గురించి ముందుగా మేము ఆలోచిస్తాము, సహాయము చేస్తాము. మా సమస్యలను గురించి తరువాత ఆలోచిస్తాము. అయితే మొదట మీరు ఆధ్యాత్మవాదులు కండి! సరియైన దృష్టికోణమును అలవరచు కోండి! ఆధ్యాత్మికత పట్ల మనము చెయ్యవల్సిన కర్తవ్యమేదైతే ఉన్నదో దానిని అర్థము చేసుకోండి! ఆధ్యాత్మిక మార్గములో పయనించటానికి మనము చెయ్యవలసినదేమిటి? ఇంత మాత్రము తప్పక తెలుసుకోండి. ఇంతమాత్రము అర్థము చేసుకొనకపోతే మేము చెయ్యగలిగిందేమీ లేదు. క్రియా కలాపాలు, కర్మకాండలు–ఇవే సమస్తము అని అనుకోవద్దు. క్రియాకలాపాలతోపాటు జీవితములో కొన్ని మార్పుచేర్పులు చేసుకొనటం కూడా అవసరమే. ఇక్కడినుండి వెళ్తూనే మొదట ఆ పనిని ప్రారంభించండి. మీ లోపల కొంత సంస్కరణ జరిగినట్లు అర్థమవుతుంది. మిమ్మల్ని మీరు నియంత్రించుకొనే అలవాటు ఇక్కడినుండే ప్రారంభించండి. అన్ని ఇంద్రియముల పైనా మీరు నియంత్రణను సాధించలేరు. కాబట్టి మొదట మీ నాలుకను అదుపులో పెట్టుకొనడం ఇప్పుడే ప్రారంభించండి. **నాలుకను అదుపులో పెట్టుకొనగలిగిన వ్యక్తి నెమ్మదినెమ్మదిగా మిగతా ఇంద్రియములన్నింటిపైనా విజయమును సాధించ గలడు.**

(సశేషము)

– *అఖండజ్యోతి, మే 2013*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

---

## నమస్కారం

*శ్రేష్ఠమైన కుటుంబాలలోని జనులు పెద్దలకు నమస్కరించటం, చిన్నవాళ్ళను పెద్దవాళ్ళు ఆశీర్వదించటం చేస్తూ ఉంటారు. ఇదేదో యాంత్రికంగా జరిగిపోయే సాధారణ కార్యక్రమం ఎంతమాత్రం కాదు. భారతీయ సంస్కృతి యొక్క మహత్వపూర్ణమైన అభిన్న అంగం.*

*విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు వెళ్ళినప్పుడు అక్కడ వారు క్రమం తప్పకుండా ప్రణామం చేసేవారు. వనవాస కాలంలో భగవానుడైన రాముడు ఋషులను వయోవృద్ధులుగా భావించి, గౌరవిస్తూ ప్రణామం చేస్తూ ఉండేవాడు. అలాగే మహర్షులు కూడా రాముడిని అవతారమూర్తిగా భావించి ప్రణమిల్లేవారు. తనకంటే శ్రేష్ఠులకు ప్రణామం చేసే ఈ సంప్రదాయం సత్పురుషులలో సదా చూడగలుగుతాము. అనగా ఎవరైతే అభివాదన శీలురై ఉంటారో తమకంటే పెద్దలను గౌరవిస్తూ వారి ఆజ్ఞను పాలిస్తారో, వారి ఆయువు, విద్య, యశస్సు, బలం, దినదినాభివృద్ధి చెందుతాయి. నమస్కారం అనేది భావనాపూర్వకంగా చేసినప్పుడు, ఎదుటి వ్యక్తి అంతరంగపు లోతుల నుండి సద్భావనలతో కూడిన ఆశీస్సులు తప్పక ఉత్పన్నమవుతాయి. కాబట్టి నమస్కరించిన వ్యక్తి సదా లాభాన్వితుడు కాగలడు.*

*వనవాస సమయంలో సీత అత్రి మహర్షి ఆశ్రమానికి వెళ్ళి అనసూయదేవి పాదాలకు నమస్కరించింది. నమస్కరించిన సీతను అనసూయ మనసారా ఆశీర్వదించి ఉత్కృష్టమైన ఉపదేశాన్ని ఇచ్చింది. ఈ సత్సాంప్రదాయం ఏ కుటుంబాలలోనైతే ఉంటుందో అక్కడ స్నేహ సద్భావనలు వృద్ధి చెందుతాయి. ఒకవేళ విరోధాలు ఏర్పడినా ఈ సాంప్రదాయం వాటిని ఎక్కువ కాలం నిలువనీయదు. కుటుంబ వ్యవస్థ యొక్క పునాది స్నేహం, మర్యాద, సద్భావనల మీద నిర్మించబడి ఉంటుంది. ఈ సద్గుణాలు ఎక్కడ నెలకొంటాయో ఆ కుటుంబాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొందుతాయి.*

– *అఖండజ్యోతి, జూన్ 2013*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**నవ్వుతూ-నవ్వుతూ కష్టమైన పనులను కూడా తేలికగా చేసుకోవచ్చు**

నా వారితో నా మాట

# ఆత్మ విశ్లేషణ చేసుకుందాం



ఈ సంవత్సరం ముగియనున్నది. 2014 మన ముందుకు రాబోతున్నది. గడిచిన ఏడాదంతా మనం అసలు ఏం చేసాం? రాబోయే ఏడాది ఏం చేయబోతున్నాం? ఈ ప్రశ్నలకి జవాబివ్వాలంటే మనం ఆత్మచింతన, ఆత్మమధనం, ఆత్మవిశ్లేషణ చేసుకోవాలి. వ్యక్తిగత, సామాజిక, దేశ సమస్య లెన్నింటికో ఇంకా సమాధానాలు దొరకలేదు. పూర్తి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. హృదయాన్ని పీడించి, మనస్సును కలతపరచే విషయాలు మరెన్నో ఉన్నాయి. సాధువుల ఆచరణ, రాజకీయ నాయకుల లంచగొండితనం, ఇటువంటి వారిపై న్యాయస్థానాల తీవ్ర విచారణ. ఇదంతా చూస్తూ ఉంటే, 'ఆచరణ మార్చుకోండి! కొత్త యుగం అవతరిస్తోంది' అని మహాకాలుని సంకేతం కాబోలు అనిపిస్తుంది. ఈ మధ్య కాలంలో దేశంలో చాలా అల్లర్లు చెలరేగాయి. ఎంతోమంది నిర్దోషుల ఊచకోతకు బాధ్యులైన రాజకీయ నాయకులు ఓట్ల కోసం మన వాకిట్లోకి రావచ్చు. వారిని ఎన్నుకుంటామా లేదా అన్నది మన చేతుల్లోనే ఉంది.

మనిషిగా పుట్టడం ఒక ఎత్తు. మానవత్వ సద్గుణాలతో జీవించడం మరో ఎత్తు. చిన్నప్పుడు పిల్లల అవసరాలన్నీ పెద్దలు చూసుకుంటారు. పెద్దయ్యాక పిల్లలు తమ పనులు తానే చేసుకుంటారు. తెలివి పెరిగి, సంపాదించడం మొదలుపెట్టాక, తన అవసరాలన్నీ తానే సమకూర్చుకునే నైపుణ్యం వచ్చేసింది అని చెప్పుకుంటారు. కాని జీవితమంటే ఇంతేనా?

నిజానికి తన సంపాదనతో జీవితం గడుపుతున్నాడని చెప్పుకుంటున్నా, సమాజంలో అందరి సహకారం అవసరం. డబ్బు అనేది ఒక వ్యావహారిక వ్యవస్థ మాత్రమే. లావాదేవీలను, క్రయవిక్రయాలను పక్కన పెట్టినా కూడా, సమాజం మనిషికి ఎన్నో ఉపకారాలు చేస్తుంది. వాటన్నింటికి ఋణం తీర్చుకోవడం మానవత్వం యొక్క బాధ్యత. కానీ వ్యక్తిగత పనుల, చింతల స్వార్థం నుంచి బయటపడితే కదా! స్వార్థాన్ని తృప్తి పరచినా, అహం తృప్తిపడదు.

ఇంటి వాకిట్లో పూలతోట లేదని బాధపడే వారికి, తల దాచుకోవడానికి గుడిసె కూడా లేని వాళ్ళ బాధ ఏం తెలుస్తుంది? తమ పిల్లలకి ఖరీదైన పళ్ళు కొనివ్వలేక పోతున్నామని బాధపడే వారి దృష్టి ఆకలి చావులకు గురయ్యే కోట్ల మంది పిల్లల మీదకెందుకెళ్ళట్లేదు? పైగా సమాజ వ్యవస్థ భ్రష్టుపట్టింది అంటారు. నిజానికి ఇలాంటి అవసరాలకు ఖర్చు పెట్టడం మనకి ఇష్టం లేదు. ఇదంతా అవసరమా అని అనిపిస్తుంది. ఈ ప్రవృత్తులే మనిషి స్వార్థానికి ప్రతీకలు. ఇవన్నీ చూసాక, పుట్టినంత మాత్రాన, ఎంత బతికున్నట్టు కనిపించినా, జీవితాన్ని సాధించినట్టు కాదేమోనని అనిపిస్తుంది.

సంవేదనాపరుడు, ఇతరుల బాధలను అనుభవించ గలవాడు మాత్రమే మనిషి, అని అనేవారు పరమపూజ్య గురుదేవులు. దేశంలో, ప్రపంచం మొత్తంలో అంతమంది పిల్లల ఆకలి తీరట్లేదు, కానీ నా కొడుకు పరిస్థితి అంత దుర్భరం కాదు. మన పిల్లలకి ఉన్న సౌకర్యాలన్నీ మిగిలిన పిల్లలకి ఎందుకు లేవు, అని అందరం ఆలోచించాలి. ఏ ప్రవచనాల్లోనో, చర్చల్లోనో, స్పీచులు చెప్పినప్పుడో, ఇక కబుర్లేవీ మిగల్లేదు, ఊసుపోవట్లేదు అన్నప్పుడు మాత్రమే ఇలాంటి ఇబ్బందుల గురించి 'చర్చ' చేస్తారు.

ఇంతకు మించిన స్వార్థం, భావనా రాహిత్యం అసలు ఉంటుందా? పుట్టాక, బతకడమెలా అన్నది నేర్చుకోము, మరింత స్వార్థపరులుగా మారిపోతాం, అహంకారం పెంచుకుంటాం. మన అహాన్ని, స్వార్థాన్ని తృప్తి పరచడానికి తెలివితేటలను, బుద్ధిని ఆశ్రయిస్తాం. మనుషుల్లో సమస్యలుంటే, వాటి సమాధానంలో మన భాగస్వామ్యం కూడా ఉండాలి. ఈ మాటలను సిద్ధాంతపరంగా అందరూ ఒప్పుకుంటారు, కానీ వ్యావహారికంగా మాత్రం ఏమీ చేయడానికి ఇష్టపడరు, ముందుకు రారు. కాస్తో కూస్తో నైతికంగా, చుట్టూ ఉన్న నలుగురి బాధ్యతా వహించవలసి వస్తేనే చేతులు దులుపుకుని పక్కన నుంచుంటాం. అయినా, దీనంతటికీ మనమేం చేయగలం అంటుంటాం. ఆకలి, పేదరికం, నిరక్షరాస్యతలాంటి పెద్ద సమస్యల పరిష్కారం ఒక్కరి వల్లనో, ఏ కొద్దిమంది వల్లనో ఎలా సాధ్యమవుతుంది? అంటారు. మరీ పట్టుబట్టి అడిగితే, ప్రభుత్వం మీదకి తప్పును నెట్టేస్తారు.

**ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే అలుపు సొలుపు ఏముంటుంది?**

ఇలాంటి జవాబులన్నిటినీ ఏమనాలి? పిరికితనం. అంతే కాని సంవేదన అని అనగలమా! ఇంటికి నిప్పంటుకుంటే మాత్రం ఎంత నీరు ఉంటే దానితోనే నిప్పును ఆర్పే ప్రయత్నం చేస్తారు. బిందెడు నీళ్ళతో నిప్పు ఆరదని తెలుసు. అయినా ఇదేం సరిపోతుంది అనరే! ప్రయత్నం ఆపరే! ఒక్క దీపం వెలుగుతో భూమి మీద చీకట్లు ఏమాత్రం తొలగవని తెలిసినా కూడా తన వంతు కృషి చేస్తూ అలాగే నిలబడుతుంది. మనమేం చేయగలం? అన్న ప్రశ్న వచ్చిందంటేనే, అసలేమీ చేయాలనే ఉత్సాహం లేదని అర్థం. సంవేదనలు పొడిబారి పోయాయి. సిగ్గు లేకుండా పిరికితనాన్ని స్వీకరిస్తున్నారన్న దానికి ఈ ప్రశ్నలు నిదర్శనం.

బ్రతికే ఉన్నా, మనలో జీవం లేదని తెలిసొస్తోంది. సాటి మనిషి పట్ల నమ్మకం, సద్భావాలు నశించాయి. ఇలాంటి మానసికత మనలను స్వార్థపరులుగా, పిసినారులుగా మార్చింది. అదేంటో కాని, మన పక్కింట్లో వాళ్ళనైనా సరే, మనిషిగా చూడక అతని జాతి, కులం, ప్రాంతం, సాంప్రదాయం, మతం అంటూ వేరు చేస్తూ ద్వేషిస్తుంటారు. చిలికి చిలికి గాలి వానైనట్టు ఈ ద్వేషాలే తరువాత పెద్ద గొడవలవుతాయి.

స్వార్థానికి అంతే లేదు. మనింట్లోనే ఎవరికైనా జబ్బు చేసిందనుకోండి, వాళ్ళ అనారోగ్యం వల్ల ఇంట్లో కలిగే ఇబ్బందులను తలుచుకుని బాధ పడతారే తప్ప, వాళ్ళకి అసౌకర్యంగా ఉంటుందని కాదు. ఎప్పుడైనా గమనించండి; ఎవరికైనా రోగం వచ్చినా, ఏదైనా దుర్ఘటన జరిగినా, మనమసలు ఏ మాత్రం బాధ పడతాం, వాళ్ళ పీడను ఎంత వరకు అనుభవిస్తాం, ఎంత సక్రియంగా ఉన్నాం? మనలో కరుణ, సహృదయత, సద్భావాలను ఇలాంటి పరిస్థితులు పరీక్షిస్తూ ఉంటాయి.

ఒకే చోట స్నేహితుల్లా ఉండే మనుషులు, మతం పేరొచ్చే సరికి భయంకరమైన శత్రువుల్లా మారిపోతారు. కొన్ని నెలల క్రితం ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫ్ఫర్ నగర్‌లో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. దేశానికి స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడిచిపోతున్నా, మనలో ద్వేషానికి, దుర్భావనలకి మాత్రం ఇంకా రాలేదు. వేరే మతం వారిని చంపమని ఏ మతము చెప్పదు. అసలు ధర్మంతో దీనికి సంబంధం లేదు. నిజానికి, ధర్మ సాంప్రదాయాలను, సిద్ధాంతాలను మనిషి సంకీర్ణత, క్షుద్ర బుద్ధి, తన వీలునుబట్టి వ్యాఖ్యానిస్తుంది. అందుకే మనిషిగా పుట్టినా కూడా జీవాన్ని మాత్రం పొందలేక పోతున్నాడు అని పదే పదే ఇక్కడ వల్లించడం జరుగుతోంది. పుట్టుకతోనే స్వార్థాన్ని అలవరచుకుని, అందులోనే పారంగతుడవుతున్నాడు. మరింత సంకీర్ణమైన పరిధిలోకి కూరుకుపోతున్నాడు. మనిషి జీవం ఎలా పొందాలో తెలియ చెప్పడానికే పరమపూజ్య గురుదేవులు మరియు అఖండజ్యోతి పత్రిక (యుగశక్తి గాయత్రి) ఆవిర్భవించాయి.

శరీరంతో పుట్టినప్పటికీ జీవితానికి ఆధారం మాత్రం ఆత్మ చైతన్యం అన్న నిజాన్ని నిరంతరం అఖండజ్యోతి వ్యాసాల (యుగశక్తి గాయత్రి) ద్వారా గురుదేవులు మనకు గుర్తు చేస్తున్నారు. సర్వవ్యాపకమైన పరమాత్మ చైతన్యంలో ఈ ఆత్మ చైతన్యం ఒక భాగం. దీన్ని శరీరమనే జైల్లో బంధించడమంటే హత్య చేయడంతో సమానం. జీవితానికి మారు పేరు ప్రేమ. ఎంతమంది ఎన్ని రకాలుగా వ్యాఖ్యానించినా, పరమపూజ్య గురుదేవులు మాత్రం అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) ద్వారా విశ్వవ్యాప్తమైన విరాట్ చైతన్యాన్ని అంగీకరించడమే ప్రేమ అని అన్నారు. అప్పుడే పుట్టిన పసికందుకు తన ఆకలి, తన బాధ తప్ప మరేమీ తెలియకపోవడం స్వాభావికమే. కానీ పెరిగిన కొద్దీ కుటుంబంతో, సమాజంతో, దేశంతో, ప్రపంచ మానవత్వంతో తన సంబంధ బాంధవ్యాలను తెలుసుకోవాలి. తనవల్ల ఎంత అవుతుంది అని ఆలోచించకుండా, నిరాశ చెందకుండా, దీపంలాగా చీకటితో పోరాడుతూనే ఉండాలి, మన సామర్థ్యాలన్నీ ఒడ్డి ప్రస్తుతం ఉన్న ఆపదలను, సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కోవాలి.

మనం స్వయంగా ప్రేరణ పొంది, ఇతరులకు కూడా ప్రేరణనందిస్తే, మన జీవితాలలో గురుజ్ఞానానికి సార్థకత లభిస్తుంది. గురుదేవులు తమ సాధనా స్థలంలో స్థాపించిన అఖండజ్యోతి యొక్క వెలుగు ప్రతినెల తమ ప్రియ పరిజనులు అందరికీ చేరాలనే ఉద్దేశంతోనే పత్రికకి అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) అని పేరు పెట్టారు. దాని ద్వారానే వారికి, వారి కుటుంబానికి ప్రకాశం, చింతన, చైతన్యం పొందాలనుకున్నారు. ఈ మహాజ్యోతి ప్రకాశాన్ని అందరికీ అందించి, ఇంటింటికీ చేరేట్టు చూసే బాధ్యత ఇప్పుడు మనది. గడిచిన సంవత్సరంలో మన జీవితంలోని అనేక కోణాలను సమీక్షించుకోవడంతో పాటు, ఇప్పటి వరకు ఎన్ని ఇళ్ళల్లో అఖండజ్యోతిని (యుగశక్తి గాయత్రి) స్థాపించాము, కొత్త సంవత్సరంలో ఎన్ని ఇళ్ళల్లో స్థాపించబోతున్నాము అనేది కూడా సమీక్షించుకోవాలి. గురుదేవుల ఆలోచన, చైతన్యాల ఈ ప్రకాశం ఇంటింటికీ చేరి తీరాల్సిందే అని గుర్తుంచుకోండి.

*అఖండజ్యోతి, డిసెంబరు 2013*

*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్, జయలక్ష్మి*

**ఒత్తిడిని చిత్తుచేయడం చిరునవ్వుతోనే సాధ్యం**

# ఓటరులారా మేల్కొనండి!

**ప్రజాస్వామ్యానికి ప్రాణం పోయండి! దాన్ని వికసింపజేయుట,**
**పరిపుష్టి గావించుట మీ చేతిలోనే ఉంది! మీరే యజమానులు!**

*మిత్రులారా!*

ప్రపంచంలో నేడు ప్రాచుర్యంలో ఉన్న అన్ని పరిపాలనా వ్యవస్థలలో అత్యుత్తమమైనది ప్రజాస్వామ్య పాలనా విధానం. దీనిలో ప్రజలే ప్రభువులు. ఈ వ్యవస్థలో ప్రజలు తమ ఆకాంక్షలను నెరవేర్చగలిగే సామర్థ్యం గల వ్యక్తులను గుర్తించి తమ ప్రతినిధులనుగా తమకు గల ఓటు హక్కును వినియోగించుకొని ఎన్నుకొంటారు. ఈ రీతిగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఏకమై ప్రజానురంజకంగా పాలన సాగించుటకై తగిన యంత్రాంగాన్ని, మంత్రాంగాన్ని రూపొందించుటకై శాసనసభ / పార్లమెంటును ఏర్పాటు గావిస్తారు. అత్యధిక సంఖ్యలో సభ్యులున్న పార్టీ తమ సభా నాయకుని ఎన్నుకొని రాజ్యాంగ నియమానుసారం ముఖ్యమంత్రిని / ప్రధానమంత్రిని ఎన్నుకొంటుంది. అలా ఎన్నిక కాబడిన వ్యక్తి తన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసికొని, ప్రజాప్రతినిధుల సహాయ సహకారంతో తగిన శాసనాలను, చట్టాలను రూపొందిస్తారు. సభామోదంతో ప్రభుత్వ యంత్రాంగం ద్వారా పరిపాలన చేస్తూ ఉంటారు. ఈ యంత్రాంగ సహాయంతో సమాజం యొక్క వివిధ అంగాలను నియంత్రిస్తూ, సుస్థిరశాంతిని నెలకొల్పి, సుహృద్భావాన్ని, సహకారాన్ని నెలకొల్పి వానిని పెంపొందిస్తూ సమాజ ప్రగతికి మార్గదర్శనం చేస్తూ ఉంటుంది. ఇంతటి బాధ్యతాయుత కర్తవ్యాలను నెత్తికొత్తుకొని ప్రజాప్రతినిధులు నిస్వార్థ బుద్ధితో, సేవానిరతితో అనుక్షణం మెలగవలసి ఉన్నది. దీనిలో ప్రజాప్రతినిధులకు ఎట్టి మినహాయింపు సడలింపులు లేవు.

అలనాడు సమాజానికి జ్ఞానవంతులు, వివేకవంతులైన మునులు, ఋషులు, మహర్షులు తగు మార్గదర్శనం చేస్తూ సమాజ, దేశ ప్రగతికి తమ తోడ్పాటును అందించేవారు. ఆనాటి క్షాత్రబలం (పాలకులు) నియంత్రించబడి, జ్ఞానబలం (తపస్వులు) చూపిన ధర్మమార్గాన్ని అనుసరించి పాలన సాగించేది. అట్లే మూడవ బలమైన ధనబలం (వైశ్యులు) జ్ఞానబలాన్ని ఆసరాగా చేసికొని, క్షాత్రబలాన్ని అనుసరించి వ్యవహారాలను సాగించేది. పై మూడు బలాలకు ప్రధానంగా క్షాత్రబలాన్ని పరిపుష్టంగావిస్తూ, నాలుగవ బలమైన శ్రమబలం (శూద్రులు) అత్యంత నిష్ఠాశ్రద్ధలతో, సమర్పణా భావంతో పని చేసేది. కాని నేటి సమాజంలో జ్ఞానబలం పూర్తిగా నిర్వీర్యమై తన ఉనికి కొరకు ధనబలాన్ని ఆశ్రయించి తన మనుగడను సాగిస్తున్నది. అట్లే రెండవ శక్తియైన క్షాత్రబలం ధర్మమార్గాన్ని వీడి, ధర్మాధర్మ విచక్షణను కోల్పోయి తనలో నిక్షిప్తమై ఉన్న పశుబలాన్ని ప్రయోగించి, ధనబలాన్ని వశపరచుకొన్నది. తన స్వార్థాన్ని పరమార్థంగా చేసికొని, ఓటుహక్కు దుర్వినియోగ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని వశపరచుకొని తద్వారా అధికార యంత్రాంగాన్ని శాసిస్తూ సమాజ, ప్రజాశ్రేయస్సులను పణంగా పెట్టి రాజ్యపాలన గావిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం గావిస్తున్నది. దీనితో ప్రజాస్వామ్య వ్యవస్థ నేడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రజలలో స్వపాలన కన్నా పరాయిపాలనే మిన్న మరియు స్వాతంత్ర్యం కన్నా బానిస బ్రతుకులే మేలనే భావన నానాటికి ప్రబలమవుతూ వారిలో నైరాశ్యం నెలకొనుచున్నది.

మిత్రులారా! బజారులో అతి స్వల్ప విలువ కలిగిన మట్టి ముంతను కొనేటప్పుడు దానిని మనచేతి వ్రేళ్ళతో గట్టిగా కొట్టి దాని గట్టితనాన్ని నిర్ధారించుకొని కొంటాం. అట్లే బ్యాంకులో దాచుకొన్న మన ధనాన్ని మరొకరికి అందజేసే సమయంలో బాగా ఆలోచించి కాని చెక్కుపై సంతకం చేయం. అట్లే మన స్థిరాస్తిని మరొకరికి విక్రయించేవేళ, రిజిస్ట్రేషన్ కాగితాలను ఒకటికి రెండుమార్లు చదువుకొని మనం సంతకం చేస్తాం. అదేవిధంగా మన ఇంటి ఆడపడచుకు తగిన వరుని నిశ్చయించే ముందు అనేక మందిని విచారించి, కాబోయే వరుని గుణగణాలను, నడవడిని, రూపాన్ని అనేకమార్లు బేరీజు వేసికొని నిర్ణయిస్తాం.

మిత్రులారా! మన వ్యక్తిగత, కుటుంబ విషయాలలో ఇన్ని

**ఆనందాలను అన్వేషిస్తూ అందరికోసం బ్రతకాలి**

జాగ్రత్తలు తీసికొని ప్రవర్తించే మనం, సమాజ విషయాలలో అత్యంత నిర్లక్ష్యంగా అవివేకంగా ప్రవర్తించే బాధ్యతా రాహిత్యం. ఇది క్షమార్హం కాదు. మన హితం సమాజ హితంలో దాగి ఉన్నది, అవి రెండూ వేరు కాదు అనే సత్యాన్ని మరువరాదు. ఏ రీతిగా మన ఇంటి అల్లుడిని లేదా కోడలిని నిశితంగా పరిశీలించి సంతృప్తి చెంది, మన కుటుంబానికి శ్రేయస్సు చేకూర్చగలడు / గలదు అని తగినంత సమయాన్ని వెచ్చించి నిర్ధారించుకొని ఎట్లు ఎంపిక చేస్తున్నామో అదేవిధంగా మనకు మన కుటుంబానికి, సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి నిస్వార్థంగా, సమర్పణాభావంతో సేవలనందించే ప్రజా ప్రతినిధిని ఎన్నుకొనే వేళ తగినంత సమయాన్ని వెచ్చించి, అతని గుణగణాలను, నడవడికని, రూపురేఖలను విచారించి సంతృప్తి చెందిన తరువాతే మన ఆమోద ముద్రను మన ఓటు ద్వారా తెలపాలి. అట్లు కానిచో ఆ ప్రజాప్రతినిధి వేసిన తప్పటడుగు సమాజాన్ని భ్రష్టు పట్టిస్తుంది. తద్వారా జనించే అగ్నికీలల్లో సమాజంతోపాటు మనం కూడా మాడి మసి కావలసిందే! కావున ఓటు హక్కును వినియోగించే వేళ, ప్రలోభాలకు, దగాకోరు హామిలకు, కుల, మత, జాతి, ప్రలోభాలకు, మోసాలకులోను కారాదు.

ఓటరులారా! జాగ్రత్త! మీ ఎదుగుదల సమాజ ప్రగతి. మీ ఓటు హక్కు సద్వినియోగంలో దాగుంది. అట్లే సమాజ పతనం, మీ పతనం మీ ఓటు హక్కు దుర్వినియోగంలోనే దాగుంది.

లే! మేల్కొను! జాగరూకుడవై, నీ హితాన్ని జాతిహితాన్ని, దేశ హితాన్ని కోరి నీ కర్తవ్యాన్ని నిర్వర్తించు!

*– సంకలనం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## శ్రీ గాయత్రీ శతకం

**107.** *'పాహి గాయత్రి' యనగానె ప్రగతి నొసగు*
*'శరణు గాయత్రి' యనగానె శాంతినిచ్చు*
*'జయము గాయత్రి' యనగానె సౌఖ్యమిచ్చు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– "రక్షించుమా గాయత్రీ మాతా!" అని ఆర్తితో పిలువ గానే రక్షించి ప్రగతిని చేకూరుస్తుంది. "శరణు గాయత్రీ మాతా! మమ్ము కరుణించు వేదమాతా!" అని మనసారా కోరగానే ఈతి బాధలనన్నిటినీ తొలగించి పరమ శాంతిని అందిస్తుంది. "జయము మాతా! ఓ గాయత్రీ మాతా" నీకు జయము అనగానే పారమార్థిక సుఖానిస్తుంది విశ్వజనయిత్రి వేదమాత.*

**108.** *వాసిగన్నట్టి 'అయినాల' వంశజుండు*
*ఆంజనేయాఖ్యు 'హనుమాంబ' అమల సుతుడు*
*సుకవి 'మల్లేశ్వరాఖ్యుని' సూక్తిపంచు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– వసివాడని వాసిని నివాసమునందు నివసింప జేసుకున్నటువంటి 'అయినా' వంశములో జన్మించి ధర్మాను వర్తనులై ధరను వీడి పుణ్యలోకాల కేగిన శ్రీ ఆంజనేయులు, భర్తనే దైవముగా భావించిన ఉత్తమ ఇల్లాలు, బిడ్డలను సరస్వతీ బిడ్డలుగా రూపొందించిన ఉత్తమ జనని శ్రీమతి హనుమాయమ్మ పుణ్యదంపతుల కుమారుడు సుకవి, సహజకవి మల్లేశ్వరరావు వ్రాసిన 'శ్రీ గాయత్రీ శతకము" ను విశ్వజనయిత్రి గాయత్రి వేదమాత సహృదయ భక్తులకు పంచుగాక! వారికది మిగుల మనశ్శాంతినిచ్చుగాక!*

*రచన: సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

## వార్తలు

### అమలాపురంలో

కార్తీకమాసంలో 1000 మంది పరిజనుల గృహముల యందు దీపయజ్ఞములు చేయ సంకల్పించగా 600 దీప యజ్ఞములు పూర్తి అయ్యాయి. 15.11.2013 రాజోలు మండలం కేశవపల్లి గ్రామంలోని గీతా మందిరమందు శ్రీమతి రాఘవమ్మగారి ఆధ్వర్యంలో సామూహిక దీపయజ్ఞం శ్రీమతి నాగమణి, దుర్గగార్లచే నిర్వహించబడినది. 60 మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుదేవుల గురించి, గురుదేవులు రచించిన సాహిత్యాన్ని గురించి, గాయత్రి విశిష్ఠత గురించి వివరించడం జరిగింది. భోజన ప్రసాదం శ్రీ హనుమంతరావు అందించారు.

**ఇంకా నిర్వహించిన కార్యక్రమాలు:** 18.11.13న శ్రీమతి నాగమంజరి పుంసవన సంస్కారం, శాయి వినీల జన్మదిన సంస్కారం, 28.11.13న పి. శ్రీనాథ్ చూడాకర్మ సంస్కారం

పై కార్యక్రమాలన్నీ శ్రీ రామానందస్వామి, శ్రీమతి నాగమణి గార్ల ఆధ్వర్యంలో జరిగాయి.

**నవ్వుతూ నవ్విస్తూ కలకాలం జీవించాలి**

# రాయలసీమలో గాయత్రీ అశ్వమేధ శక్తి కలశయాత్ర

*2014 జనవరి 17-20 తేదీలలో బెంగళూరులో జరుగనున్న గాయత్రీ అశ్వమేధ మహాయజ్ఞ సందర్భమున రాయలసీమలో అశ్వమేధ శక్తి కలశయాత్ర కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం శ్రీ వెంకటేశులు, శ్రీ గురురాజారావు, శ్రీమతిరమామణి గార్ల ఆధ్వర్యంలో జరిగింది. శాంతికుంజ్ నుండి శ్రీ శ్రీరామ్, శ్రీ సత్యప్రేమ్, శ్రీ చంద్రశేఖర్; గుజరాత్ నుండి శ్రీ పటేల్; మహారాష్ట్ర నుండి శ్రీ పంకజ్‌లు కూడా ఈ కలశయాత్రలో పాల్గొన్నారు.*

| తేది | స్థలము | వేదిక | హాజరైన పరిజనులు | కార్యక్రమం |
|---|---|---|---|---|
| 26.11.2013 | దొడ్డబల్లాపూర్ | శ్రీ జనార్ధన స్వామి & శ్రీ లక్ష్మీదేవి దేవాలయం | 100 | కలశపూజ |
| 26.11.2013 | హిందూపూర్ | శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం | 850 | దీపయజ్ఞం |
| 27.11.2013 | పెనుకొండ | ఆర్యవైశ్య సత్రము | 100 | కలశపూజ |
| 27.11.2013 | ధర్మవరం | శ్రీ ప్రసాద్‌గారి గృహంలో | 150 | దీపయజ్ఞం |
| 27.11.2013 | అనంతపురం | శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ కళ్యాణ మంటపం | 800 | దీపయజ్ఞం |
| 28.11.2013 | గుత్తి (ఆర్.ఎస్.) | శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం | 250 | దీపయజ్ఞం |
| 28.11.2013 | గుత్తి (ఆర్.ఎస్.) | గుత్తి ఎం.ఎల్.ఎ. శ్రీ మధుసూదన్‌గుప్త గారి గృహం | 30 | కలశపూజ |
| 28.11.2013 | గుత్తి టౌన్ | శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం | 400 | దీపయజ్ఞం |
| 29.11.2013 | తాడిపత్రి | శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం | 300 | దీపయజ్ఞం |
| 30.11.2013 | అవుకు | శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం | 250 | దీపయజ్ఞం |
| 30.11.2013 | బనగానపల్లి | శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం | 250 | దీపయజ్ఞం |
| 30.11.2013 | బేతంచర్ల | పూలతోట ఆశ్రమం | 350 | దీపయజ్ఞం |
| 01.12.2013 | కర్నూలు | శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ కళ్యాణ మంటపం | 250 | దీపయజ్ఞం |
| 01.12.2013 | కొడుమూరు | శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం | 100 | దీపయజ్ఞం |
| 01.12.2013 | ఆదోని | శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మంటపం | 5000 | దీపయజ్ఞం |
| 02.12.2013 | కర్నూలు | శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం | 350 | దీపయజ్ఞం |
| 02.12.2013 | డోన్ | శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం | 200 | దీపయజ్ఞం |
| 03.12.2013 | కర్నూలు | శ్రీ పార్థసారథి దేవాలయం | 30 | కలశపూజ |
| 03.12.2013 | కర్నూలు | శ్రీ కె. గురురాజరావు గృహం | 25 | కలశపూజ |
| 03.12.2013 | నందికొట్కూరు | శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం | 250 | దీపయజ్ఞం |
| 04.12.2013 | కమలాపురం | శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం | 250 | దీపయజ్ఞం |
| 04.12.2013 | కడప | శ్రీ పుట్ట నరసింహ్మారెడ్డి, ఎం.ఎల్.ఎ. గృహం | 50 | దీపయజ్ఞం |
| 04.12.2013 | కడప | శ్రీ నాగార్జున మహిళా కళాశాల | 1200 | కరపత్రాల పంపిణీ |
| 05.12.2013 | తిరుపతి | బైరాగపట్టాడ | 200 | దీపయజ్ఞం |

**గాయత్రీ అశ్వమేధ మహాయజ్ఞంలో పాలుపంచుకోదలచిన వారు శ్రీ వెంకటేశులు, బెంగళూరు గారికి తెలుపగలరు. ఎంతమంది వస్తున్నారో ముందుగా తెలిపితే తగిన ఏర్పాట్లు చేయడానికి వీలవుతుంది. సంప్రదించవలసిన ఫోన్ నెం: 09886258639**

**ముఖ్య గమనిక:** *యజ్ఞ కార్యక్రమమునకు విచ్చేసేవారు చలికాలమునకు తగిన బట్టలు, రగ్గులు, స్వెట్టర్లు, దుప్పట్లు వగైరాతో రావలసినదిగా విజ్ఞప్తి.*

ఎంతటి మానసిక ఒత్తిడి ఉన్నా చిరునవ్వు ఉపశమనం ఇస్తుంది